Dwaraka

ఆంధ్రప్రభ
Estd 1938
www.prabhanews.com
Journalism first!



ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: బహుళ సప్తమి రా. 8.57 వరకు, అనంతరం అష్టమి; నక్షత్రం: హస్త (పూర్తి); అమృతకాలం: రా. 12.50 నుండి 2.25 వరకు; వర్జ్యం: మ. 3.00 నుండి 4.37 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు

సంపుటి: 56 . సంచిక: 268 . సోమవారం 8 జనవరి 2018 . హైదరాబాద్ * పేజీలు: 12+12 . వెల: 5.00 . Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

సర్పంచ్‌కే పవర్

9వ పేజీ

- పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రక్షాళన
- పారదర్శకతకు పెద్దపీట
- సర్పంచులకు విశేష అధికారాలు
- కొత్త చట్ట రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘం
- కేబినెట్ సబ్ కమిటీలో సీనియర్లకు స్థానం
- త్వరలో ముసాయిదా సిద్ధం



ఆదివారం ప్రగతిభవన్‌లో కరీంనగర్ జిల్లా పరిషత్ డైరీ-2018ని విడుదల చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, హరీష్ రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, జడ్పీ చైర్మన్ తుల ఉమ, రాజ్యసభ సభ్యుడు కె. కేశవరావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్

సాగు బడ్జెట్

- అధిక కేటాయింపులు నీటి పారుదలకే
- రైతు పెట్టుబడి సాయానికి రూ. 7 వేల కోట్లు
- బీసీల సంక్షేమానికి భారీ కేటాయింపులు
- ఒకే గొడుగు కిందకు సంక్షేమ పథకాలు
- నేడు సీఎస్ అధ్యక్షతన ఉన్నతస్థాయి భేటీ
- 15వ ఆర్థిక సంఘం నివేదికపై సమగ్ర చర్చ
- ఎన్నికల ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టనున్న చివరి పూర్తిస్థాయి బడ్జెట్ ఈ దఫా ప్రవేశపెడుతున్నందున ఆర్థికపరంగా ఎన్నో ముఖ్యమైన అంశాలను పరిగణనలోనికి తీసుకుని నిధుల కేటాయింపు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పటిలాగానే సాగునీటి రంగానికి సింహభాగం ఈ తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.7 వేల కోట్ల రూపాయలను కేటాయించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ప్రతిపాదించారు. అటు సంక్షేమంతో సహా బీసీల కులవృత్తులకు బడ్జెట్‌లో భారీ ఎత్తున కేటాయింపులు జరిపేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌తో పాటు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన, భవిష్యత్తులో చేపట్టబోయే పథకాలు, కార్యక్రమాలు.. వాటి ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని పూర్తి స్పష్టత తీసుకువచ్చేందుకు ఆర్థిక శాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. ఇదే ➪ 2వ పేజీలో...

ఎన్నికల బడ్జెట్‌కు జైట్లీ..!



- వ్యవసాయం పైనే ప్రధాన దృష్టి
- రెట్టింపు ఊపుతో దళిత సంక్షేమం
- పింఛన్లు, కనీస వేతనాల పెంపు
- పన్ను శ్లాబులను సవరించేనా?
- వేతన జీవుల ఎదురుచూపు
- ఆర్థిక క్రమశిక్షణ అతిపెద్ద సవాల్

న్యూఢిల్లీ: గతంలో మార్చి వస్తోందంటే బడ్జెట్‌లో వడ్డింపులు, వాతలు తప్పవేమోనని సామాన్య జనానికి గుబులు పుట్టేది. పాలకులు తెలివి మీరడంవల్ల, ఏటా ఏదో ఒక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు అనివార్యం కావడం వల్ల పన్ను పోటు లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, ఆ తర్వాత దఫదఫాలుగా పన్నులు వేయడం ప్రారంభించేవారు. దారికాచి కొట్టినట్టు, దొడ్డిదారిన పన్నులు వేసే విధానం అప్పుడే ప్రారంభమైంది. ఈసారి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 30వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటుకు బడ్జెట్ సమర్పించే అవకాశం ఉంది. రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ వీటిని లాంఛనంగా ప్రారంభిస్తారు. జనవరి 31వ తేదీన ఆర్థిక మంత్రి జైట్లీ పార్లమెంటుకు ఆర్థిక సర్వేనీ, ఆ మరునాడు సాధారణ బడ్జెట్‌నీ సమర్పిస్తారు. వస్తు, సేవా పన్ను (జిఎస్‌టి) అమలులోకి వచ్చిన తర్వాత ఆర్థిక మంత్రి ప్రవేశపెడుతున్న మొదటి బడ్జెట్ ఇది. 2019 ఎన్నికల ముందు ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్ కూడా. ఎన్నికల సంవత్సరంలో అనామత్తు (తాత్కాలిక) బడ్జెట్‌నే ప్రవేశపెట్టడం ఆనవాయితీ. 2017ని మధ్యస్థ బడ్జెట్ అని ప్రభుత్వం పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న తుది పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌పై వివిధ రంగాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. ముఖ్యంగా, ఎంతో ఆర్భాటంగా అమలు జరుగుతున్న ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ఈ బడ్జెట్‌ని జైట్లీ ప్రవేశపెట్టనున్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీల ప్రభావంతో మధ్యతరగతి వర్గానికి ఈ బడ్జెట్ ఎలా ఉంటుందోనన్న భయ సందేహాలు కలగడం సహజమే. మధ్యతరగతిపై ఈ బడ్జెట్ ఏవిధమైన ప్రభావం చూపిస్తుందో? అన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జైట్లీ పద్దు అంచనాలపై స్థూల సమీక్ష.

పన్నుల వ్యవస్థ: ఈ ఏడాది పరోక్ష పన్నుల వ్యవస్థకు వస్తు, సేవా పన్ను (జిఎస్‌టి)తో కొత్త రూపు వచ్చింది. సాధారణ బడ్జెట్‌లో ఆదాయం పన్నుల వ్యవస్థతో పాటు ప్రత్యక్షపన్నుల విధానంలో మార్పులు జరగవచ్చు. పన్నుల ఎగవేతను అరికట్టడానికి పన్నుల పరిధిని విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. అదే సందర్భంలో పన్నుల రేట్లను హేతుబద్ధం చేయాల్సిన అవసరం ఉంది. ప్రత్యక్ష పన్నుల వ్యవస్థను, మినహాయింపుల నిబంధనలు సమీక్షించేందుకు సీబీడీటీ (సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరక్ట్ టాక్సెస్) సభ్యుడు అరవింద్ మోడీ నేతృత్వంలో ఒక టాస్క్‌ఫోర్సును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా ప్రత్యక్ష పన్నుల విధానం మరింత సమకాలీనంగా ఉండేట్టు చూడటం కోసమే ఈ టాస్క్‌ఫోర్స్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మౌలిక సదుపాయాలు: వచ్చేబడ్జెట్‌లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత లభించవచ్చు. దేశంలో మౌలిక సదుపాయాలను ➪ 2వ పేజీలో...

• మహాగుణపాఠం

కుల చిచ్చు సమాజానికి ఉచ్చు

- కోరెగావ్ అల్లర్లపై కొత్త సందేహాలు
- హిందుత్వను సహించని దళితులు
- సరిపడని పేష్వా, మరాఠాలు
- బ్రాహ్మణుల చేతుల్లో రాజ్యాధికారం
- తీవ్ర అసంతృప్తిలో మరాఠాలు
- రాజకీయ ప్రాబల్యానికి ఆరాటం
- సనాతనవాదం పేరుతో శిలాజకాలం వైపా?
- సమాజ శ్రేయస్కరం కాదు: విశ్లేషకులు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

సహరన్‌పూర్‌కు చెందిన దళిత యువనేత చంద్రశేఖర్ ఆజాద్‌కు ఓ కేసులో బెయిల్ మంజూరైనప్పటికీ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఆయన్ను బయటకు విడుదల చేయలేదు. జాతీయ భద్రతచట్టాన్ని ప్రయోగించి జైల్లోనే కొనసాగిస్తోంది. పహలుఖాన్ హత్యకేసులో ప్రభుత్వమే నిందితుడిపై ఆరోపణల్ని వెనక్కితీసుకుంది.

దాద్రి మత అల్లర్లలో అఖ్లాఖ్ అనే ముస్లిం హత్యానిందితుల్లో ఒకరు మరణించిన సందర్భంలో కేంద్రమంత్రి మహేష్‌శర్మ ఘనంగా నివాళులర్పించారు.

రాజస్థాన్‌లోని రాజసముంద్ పట్టణానికి చెందిన అఫ్రాజుద్దీన్‌ను బహిరంగంగా హత్యచేసిన శంభులాల్‌ను పోలీసులు వెనకేసుకొస్తున్నారు. పైగా చిన్న అపోహ కారణంగానే దురదృష్టవశాత్తు ఈ హత్య జరిగిందని చెబుతున్నారు.

బహదూర్‌ఘడ్ వద్ద రైల్లో మూకుమ్మడి దాడి కారణంగా ప్రాణాలు కోల్పోయిన జునైద్ కుటుంబ సభ్యుల పట్ల పోలీసులు అమర్యాదకరంగా వ్యవహరిస్తున్నారు. దర్యాప్తు తీరును ప్రశ్నించడాన్ని ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతోంది.

ఇలాంటి సంఘటనలే హిందుత్వ భావజాలంపై హిందువుల్లోని అణగారిన వర్గం తిరుగుబాటుకు కారణాలౌతున్నాయి. 2018 ప్రారంభం రోజునే భీమ్-కోరెగావ్‌లో దళితులు తమ సంఘటనాశక్తిని చాటేందుకు సమాయత్తమయ్యే పరిస్థితులకు దారితీసింది. ఈ ఏడాది తొలిరోజు నుంచి దేశంలో ఘర్షణలు మొదలయ్యాయి. గతంలో రెండు మతాల మధ్య ఇవి జరిగేవి. ఇవి ఒకే మతంలోని ఆధిపత్య ధోరణులపై తిరుగుబాట్లుగా వీటిని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పుణె ➪ 3వ పేజీలో...



రూ. 10వేల కోట్లతో సింగరేణి విస్తరణ

- ఐదేళ్ల ప్రణాళిక రూపకల్పన
- విద్యుత్ కేంద్రాలకు, కొత్త గనులకు నిధులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అభివృద్ధి పథంలో పురోగమిస్తున్న సింగరేణి కాలరీస్ భారీవిస్తరణ ప్రణాళిక రూపొందించుకుంది. రానున్న ఐదేళ్ళలో సంస్థ విస్తరణకు రూ.10 వేలకోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. విస్తరణ ప్రాజెక్టుల ద్వారా ఆదాయాన్ని రానున్న ఐదేళ్ళలో రూ.34 వేల కోట్లకు తీసుకెళ్ళే వ్యూహాన్ని ➪ 2వ పేజీలో...

కరెంట్ ఆపాలనుకుంటే మసైపోతారు

- విద్యుత్ ఉద్యోగులకు వెన్నుదన్నుగా నిలుస్తా
- విలీన ప్రక్రియలో కార్మికుల సమస్యలపై మాట్లాడతా
- ఎంపీ కల్వకుంట్ల కవిత హామీ
- టీఆర్‌వీకేఎస్‌లో భారీగా విద్యుత్ కార్మికుల చేరిక



కార్మికులకు గులాబీ కండువా కప్పుతున్న ఎంపీ కవిత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కరెంట్ ఆపాలనుకుంటే కాకుల్లా మాడిపోతారని టిఆర్ఎస్ ఎంపీ, టిఆర్‌వికెఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాలతో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు టిఆర్‌వికెఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు ➪ 3వ పేజీలో...



డిజిటల్ డోర్ నంబర్లు

- గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం
- పురపాలక శాఖ ముమ్మర కసరత్తు
- ఆధునిక టెక్నాలజీకి పెద్దపీట

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గూగుల్.......ఈ పేరు అంటేనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానికి ప్రతీక. మనకు తెలియని అనేక విషయాలకు సంబంధించిన సమాచారాన్ని అయినా సరే....క్షణాల్లో మనముందు ఉంచుతుంది. అందుకే గూగుల్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతోంది. అంతర్జాలంలో అగ్రతాంబూలం గూగుల్‌కు ఉండడం వల్లే ఇంటినంబర్లను కూడా అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు రాష్ట్ర మునిసిపల్ శాఖ సమాయత్తమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ➪ 2వ పేజీలో...



కిట్టీ పార్టీకెళ్లొస్తూ...

జూబ్లీహిల్స్‌లో ఘోర రోడ్డుప్రమాదం

డ్రంక్ & డ్రైవ్ = డెత్

- స్కూటీని ఢీకొన్న కారు
- అక్కడికక్కడే యువతి మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- వాహన చోదకుడు అరెస్ట్
- మద్యం సేవించినట్లు నిర్ధారణ



5వ పేజీ



సహకార ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే!

- ప్రస్తుత పాలక మండళ్లే మళ్లీ కొనసాగింపు
- ఫిబ్రవరి 23తో ముగియనున్న కాలపరిమితి
- నోటిఫికేషన్ విడుదలకు పక్షం రోజులే గడువు
- ఓటరు జాబితాలు సిద్ధం కాలేదంటున్న అధికారులు
- సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి కేబినెట్ సబ్‌కమిటీ
- వ్యవసాయ సహకార సంఘాలకు పరోక్షంగా భరోసా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సహకార పరపతి సంఘాల ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనని ప్రభుత్వం సంకేతాలిచ్చింది. ఇప్పుడున్న పాలక మండళ్ళనే మరోదఫా కొనసాగిస్తామన్న విషయాన్ని పరోక్షంగా స్పష్టం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో కాలపరిమితి ముగియనుంది. ఏ కోణంలో చూసినా ఎన్నికలు నిర్వహించేందుకు సమయం చాలని పరిస్థితి నెలకొంది. ఒకవేళ ➪ 2వ పేజీలో...

గందరగోళం (భూగోళం)

- అమెరికాలో సైక్లోన్ బాంబ్
- ఆస్ట్రేలియాలో వడగాల్పులు
- గడ్డకట్టిన వరదలో కార్లు సమాధి
- గరిష్ట ఉష్ణోగ్రతకు జారుతున్న రోడ్లు



సిడ్నీ/న్యూయార్క్: మంచు తుపానుతో ఈశాన్య అమెరికా గడ్డకట్టుకుపోతుండగా విపరీతమైన ఉష్ణోగ్రతలతో దక్షిణ ఆస్ట్రేలియాలో రహదారులు కరిగిపోతున్నాయి. భూగోళానికి చెరోవైపున చోటు చేసుకుంటున్న భిన్నమైన వాతావరణ ఉత్పాతం వాతావరణ శాస్త్రవేత్తలకు ఆందోళన కలిగిస్తున్నది. పర్యావరణవేత్తలను కలవరపెడుతున్నది. వాతావరణ మార్పు ప్రభావం తన విశ్వరూపాన్ని చూపిస్తున్నదని వారు వాపోతున్నారు. వీరిని మరింత ఆందోళనకు గురి చేస్తున్నట్టుగా గతవారం బోస్టన్ వీధులు కరిగిన మంచు నీటి వరదలో మునిగిపోయాయి. రోడ్ల పక్కన చెత్తను ఉంచే పెద్ద పెద్ద కంటైనర్లు కొట్టుకుపోయాయి. గడ్డకట్టుకుపోయిన వరదనీటిలో కార్లు దాదాపు సమాధి అయిపోయాయి. న్యూహ్యాంప్‌షైర్‌లో కొన్ని చోట్ల చలిగాలులు వణికిస్తున్నాయి. అయితే ఆస్ట్రేలియాలో ప్రస్తుతం ఎండాకాలం. భానుడు చెలరేగిపోతున్నాడు. అక్కడ ఎంత వేడిగా ఉందంటే అత్యధిక ➪ 3వ పేజీలో...

ఎన్నికల బడ్జెట్‌కు జైట్లీ!

(మొదటిపేజీ తరువాయి)

పెంపొందించే కార్యక్రమానికి ఊతమివ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సంకేతాలిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు కొత్త బడ్జెట్ తోడ్పాటును అందించవచ్చు. భారతమాల ప్రాజెక్టు జాతీయ రహదారుల అభ్యున్నతి కోసం మోడీ ప్రభుత్వం చేపట్టిన భారీ ప్రాజెక్టు. దీనికి ఇప్పటికే ప్రభుత్వ ఆమోదం లభించింది. పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, గృహ, మంచినీటి, పారిశుద్ధ్య అవసరాలు వంటి అంశాలు కొత్త బడ్జెట్‌పై చర్చలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. రైల్వే బడ్జెట్‌ని సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయడంతో రైల్వేల్లో మౌలిక సదుపాయాలు ముఖ్యాంశం కానుంది. రైల్వేలలో మౌలిక సదుపాయాలు పెంచేందుకు, ముఖ్యంగా, రైల్వేస్టేషన్లు, రైళ్ళలో మౌలిక సదుపాయాలు మెరుగు పర్చాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన సంపత్తి

ప్రభుత్వ రంగ బ్యాంకులకు తిరిగి మూలధనాన్ని చేకూర్చే ప్రణాళిక గురించి ప్రభుత్వం గత అక్టోబర్‌లో ఒక ప్రకటన చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు మొండి బకాయిల సమస్యను అధిగమించేందుకు ఈ ప్రణాళిక ప్రకటించింది. ఇందుకు సుమారు రూ.2.11 లక్షల కోట్లు అవుతుందని అంచనా. ఇందులో రూ.1,35,000ల మూలధనాన్ని తిరిగి సమకూర్చే బాండ్ల రూపంలో పెట్టుబడులు ఉంటాయి. ఆ బాండ్లు ఎలా ఉంటాయన్న వివరాలను ప్రభుత్వం ఇంకా బహిర్గతం చేయలేదు. బాండ్లపై వడ్డీరేట్లు ఎలా ఉంటాయో కూడా వెల్లడించ లేదు. ఈవార్త ఇప్పటికే, బాండ్లు, ఈక్విటీ మార్కెట్లలో చర్చ నీయాం శమైంది. ఈ ఏడాది ఫిబ్రవరికి ప్రభుత్వం రూ.70 వేల కోట్లు సేకరించవచ్చు.

ఈ సంస్కరణలతో పాటు భారతీయ కంపెనీలు అంతర్జాతీయ స్థాయిలో పోటీని తట్టుకోవడానికి వీలుగా కార్పొరేట్ పన్ను తగ్గించాలని ప్రభుత్వానికి పలువురు ఆర్థిక శాస్త్రవేత్తలు సూచించారు. ఎక్సైజ్ సుంకం, సేవా పన్నులను వస్తు, సేవా పన్ను (జిఎస్‌టి)లో విలీనం చేయడం వల్ల వచ్చే బడ్జెట్‌లో వర్గీకరణలో మార్పులు ఉంటాయి.

జీఎస్‌టీ రేట్లను ఆర్థిక మంత్రి నేతృత్వంలోని జీఎస్‌టీ మండలి నిర్ణయిస్తుందని అధికారి ఒకరు చెప్పారు. ఈ మండలిలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. అందువల్ల ఎక్సైజ్, సేవా పన్నులకు సంబంధించి కొత్త బడ్జెట్‌లో పన్ను ప్రతిపాదనలేవీ ఉండవని ఆ అధికారి చెప్పారు. ప్రత్యక్షపన్నులలో మార్పుల గురించి ప్రతిపాదనలు మాత్రమే బడ్జెట్‌లో ఉంటాయి.

వ్యక్తిగత ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను, కస్టమ్స్ సుంకంలలో మార్పుల ప్రతిపాదనలను కొత్త బడ్జెట్‌లో చేర్చే అవకాశం ఉంది. వీటితో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టే కొత్త పథకాలు, కార్యక్రమాల వివరాలు ఉండవచ్చు.

బడ్జెట్ సమర్పణను ముందుకు జరపడంవల్ల వివిధ మంత్రిత్వ శాఖలకు బడ్జెట్ కేటాయింపులు కొత్త ఆర్థిక సంవత్సరం అంటే ఏప్రిల్ ఆరంభం సమయానికే కేటాయించబడవచ్చు. దీని వల్ల ప్రభుత్వ శాఖలకు తమకు కేటాయించిన నిధులు ఖర్చు చేసేందుకు మరింత వెసులుబాటు లభిస్తుంది. కంపెనీలు, వాణిజ్య, పన్నుల ప్రణాళికలు ఆమోదించేందుకు వీలు లభిస్తుంది. బడ్జెట్ ప్రతిపాదనల సమర్పణను ముందుకు జరపడమే కాకుండా, బడ్జెట్‌లో ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాలను పొందు పర్చే పద్ధతికి స్వస్తి చెప్పారు.

అన్ని వర్గాలకూ అనుకూలం?

ఇరవై ఏళ్ళకు పైగా అధికారంలో ఉన్న గుజరాత్‌లో బీజేపీ బొటాబొటి మెజారిటీతో అధికారంలోకి రావడం, గ్రామాల్లో వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగ సమస్య, తయారీ రంగం, సేద్యపు రంగాల్లో ఉత్పత్తులు మందగించడం వంటికారణాల వల్ల వచ్చే బడ్జెట్ అన్ని వర్గాలకూ అనుకూలంగా ఉండేట్టు ఆర్థిక మంత్రి రూపొందించవచ్చు. బడ్జెట్‌లో ఆర్థిక క్రమ శిక్షణ పాటించడం అనేది ఆయనకు పెద్ద సవాల్ కానుంది. 2019లో సాధారణ ఎన్నికలు రానున్న దృష్ట్యా, స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) ఊర్ధ్వ ముఖంగా సాగేట్ట చూడటం కూడా ఆర్థిక మంత్రికి సవాలే. ఆయన ఈ కింది విషయాలపై దృష్టిని కేంద్రీకరించవచ్చు.

సంక్షేమ పథకాలపై దృష్టి

2018 బడ్జెట్ ఎన్‌డీఏ కూటమికి ఎన్నికల బడ్జెట్ అయ్యే అవకాశం ఉంది. ఈ ప్రభుత్వం దళితులకు వ్యతిరేకమన్న ఆరోపణలు ఇప్పటికే వచ్చాయి. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ పథకాలపై ప్రభుత్వం దృష్టి



కేంద్రీకరించవచ్చు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ఏమేరకు నిధులు కేటాయించాలో సూచించేందుకు నీతిఆయోగ్‌లో సాంఘిక సంక్షేమ విభాగం సలహాదారు రతన్ వతల్ నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎస్సీ, ఎస్టీల సంక్షేమ కార్యక్రమాలకు కేటాయింపులను రెట్టింపు చేయవచ్చు.

సాంఘిక సంక్షేమం, కనీస వేతనాలు

సాంఘిక భద్రత పథకాలకు కేటాయింపులను ప్రభుత్వం పెంచవచ్చు. సాంఘిక భద్రతకు చెందిన వందకుపైగా పౌర సంఘాలతో కూడిన పెన్షన్ పరిషత్ తరపున బాబా జాదవ్, అరుణ్ రాయ్‌లు ప్రధానమంత్రికి ఇటీవల ఒక లేఖ రాశారు. వయోవృద్ధులకు ఇప్పుడు ఇస్తున్న పెన్షన్ బాగా తక్కువగా ఉందనీ, దానిని పెంచాల్సిన అవసరం ఉందని ఆ లేఖలో ప్రధాన మంత్రిని కోరారు. నెలవారీ ఆదాయాన్ని రూ.9,100లుగా కేంద్ర కార్మిక శాఖ ఇటీవల పెంచింది. కనీసవేతనాలను పెంచే ప్రక్రియను కార్మికశాఖ చేపట్టింది. కనీస వేతనాలను నెలకు రూ.18,000లకు పెంచుతూ బడ్జెట్‌లో ప్రతిపాదన చేయవచ్చు. అయితే, కనీసవేతనాన్ని రూ. 21 వేలకు పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వ్యవసాయరంగానికి ఊపు

వర్షాలు బాగా పడినప్పటికీ వ్యవసాయ రంగం క్లిష్టపరి స్థితులు ఎదుర్కొంటోంది. వ్యవసాయ సంక్షోభం, గ్రామీణ ప్రాం తాల్లో పనులు లేకపోవడం ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని వ్యాకుల పరుస్తోంది.

2004లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఓటమి పాలు కావడానికి కారణం గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు బాగా లేకపోవడమే. భారత్ వెలిగిపోతోందన్న నినాదంతో వాజ్‌పేయి ప్రభుత్వం ఎన్నికలకు వెళ్ళింది. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు అనుకూలంగా లేవని పంజాబ్, గుజరాత్‌లలో పరిస్థితులే తెలియజేస్తున్నాయి. గ్రామాల్లో పరిస్థితిని మెరుగుపర్చకపోతే 2019 ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి క్లిష్టంగానే ఉండవచ్చు. వ్యవసాయ రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గినప్పటికీ, రైతులకు నేరుగా ప్రయోజనాలను చేకూర్చేందుకు ఆర్థిక మంత్రి కొత్త బడ్జెట్‌లో కొన్ని ప్రతిపాదనలు చేయవచ్చు. రైతులకు కనీస మద్దతు ధర లభించేట్టు చూడటం ఇందులో ముఖ్యమైనది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇందుకు సంబంధించి ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్రం ప్రకటించే కనీస మద్దతు ధర గిట్టుబాటు కాకపోతే రైతులకు మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే పథకాన్ని ప్రవేశపెట్టింది. అటువంటి పథకాన్ని రైతులకు నేరుగా ప్రయోజనం చేకూర్చేందుకు ఆధార్‌తో అనుసంధానం చేస్తూ జైట్లీ ప్రవేశపెట్టవచ్చు.

పన్ను రేట్లలో సడలింపులు

2015లో సాధారణ బడ్జెట్‌ని ప్రవేశపెడుతూ దశలవారీగా కార్పొరేట్ పన్నును 30 నుంచి 25 శాతానికి తగ్గిస్తామని జైట్లీ ప్రకటించారు. అది ఈనాటికీ అమలు కాలేదు. జీఎస్‌టీ బిల్లును ప్రవేశపెట్టేటప్పుడు జైట్లీ ఏమన్నారంటే, రాబడి వసూళ్ళు స్థిరీకరణ అయితే, ప్రత్యక్షపన్నులు సడలిస్తానన్నారు. కొత్త బడ్జెట్‌లో సడలింపులు ఏమైనా ప్రకటిస్తారేమోనని కార్పొరేట్ సంస్థలు ఆశిస్తున్నాయి.

పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీల ప్రభావం పరిశ్రమలపై బాగా ఉందనీ, ఆర్థిక మంత్రి ఏమైనా రాయితీలు ప్రకటిస్తే పరిశ్రమలు, వాణిజ్యం తిరిగి పుంజుకోగలవని ఈ వర్గాలు పేర్కొంటున్నాయి. గత బడ్జెట్‌లో వేతన జీవులకు ఆదాయం పన్నులో కొంత రిబేటు ఇచ్చారు. అయితే, ఏడవ వేతన సంఘం సిఫార్సులను అమలు జేసినందున మరిన్ని రాయితీలను ఆర్థిక మంత్రి ప్రకటించక పోవచ్చు. కొత్త బడ్జెట్‌లో ఐదు లక్షల వరకూ ఎటువంటి శ్లాబులను జైట్లీ ప్రకటించకపోవచ్చన్న ఊహాగానాలు ఉధృతంగా వ్యాపిస్తున్నాయి.

ఆర్థిక క్రమశిక్షణ

బ్యాంకులకు మూలధనం పెట్టుబడులు మూడు లక్షల కోట్లతో పాటు ప్రభుత్వ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా ఆర్థిక లోటు స్థూల జాతీయోత్పత్తిలో 3.5 శాతం ఉండవచ్చు. జైట్లీ బడ్జెట్‌లో ఎక్కువ లోటు చూపించవచ్చు. 2018-19లో మార్కెట్ నుంచి నిధుల సేకరణ కోసం ఆయన అలా చేయవచ్చు. ఆర్థిక లోటును పెంచిదే, 2019లో మోడీ ప్రభుత్వంతిరిగి అధికారంలోకి రావడానికి సమస్య కావచ్చు.

ప్రజలు ఆశిస్తున్న వరాల జాబితా

సాంఘిక భద్రతా పెన్షన్‌ని పెంచాలని, ప్రసూతి సమయాల్లో కల్పించేసదుపాయాలు పెంచాలని పలువురు ఆర్థికవేత్తలు ఇప్పటికే ప్రధాని మోడీకి సూచించారు. సాంఘిక భద్రత పెన్షన్ పెంపుదల ప్రభావం పెద్దగా ఉండదని ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్త జీన్ డ్రెజే స్పష్టం చేశారు. ప్రస్తుతం నెలకు రూ.200లు మాత్రమే ఇస్తున్నారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదనీ, కనీసం వెయ్యి రూపాయిలకు పెంచాలని ఆయన సూచించారు.

రైతులకు ఆదాయభద్రత

రైతులకూ, వ్యవసాయ కూలీలకు ఆదాయ భద్రత చట్టాన్ని తేవాలని వ్యవసాయ నిపుణులు ప్రభుత్వాన్ని కోరారు. 2012లో రైతుల ఆదాయం నెలకు రూ.1600 మాత్రమే ఉంది. రైతులకు ఆదాయ భద్రతా చట్టాన్ని అమలు జేయాలని భారతీయ రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.దశరథ రామిరెడ్డి కోరారు.

కార్పొరేట్ పన్ను కోత

కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలని కార్పొరేట్ ఇండియా కోరుతోంది. ఆదాయాన్ని పెంచుకోవడానికి ఇది మార్గమని బ్యాంకింగ్ దిగ్గజం ఉదయ్ కొటక్ స్పష్టం చేశారు.

కనీసవేతనాల పెంపు

కనీస వేతనాలను నెలకు రూ.21,000లకు పెంచాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. ఈపీఎఫ్ పెన్షనర్ల పెన్షన్‌ను నెలకు రూ. 3 వేలకు పెంచాలని కూడా కోరుతున్నాయి.

సాగు బడ్జెట్



(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారుల వేతనాలు, భత్యాల వివరాలను సిద్ధం చేయాలని నిర్ణయించింది. వచ్చే నెల చివరిలో లేదా మార్చి తొలి వారంలో శాసనసభలో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌కు సంబంధించి కసరత్తు చేసేందుకు సీఎస్ ఎస్పీ సింగ్ నేతృత్వంలో సోమవారం సచివాలయంలోని సాధారణ పరిపాలన శాఖ భవనంలో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. 15వ ఆర్థిక సంఘానికి సమర్పించనున్న నివేదికపై కూడా ఈ సమావేశంలోనే చర్చించ నున్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర వార్షిక బడ్జెట్ కసరత్తు సోమవారం నాటి ఉన్నతస్థాయి సమావేశం తర్వాత మరింత ఊపందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆయా శాఖల నుంచి ఆన్‌లైన్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు అందాయి. ఆర్థిక శాఖతో పాటు ఆయా శాఖలు ఆదివారం కూడా పనిచేశాయి. ఆన్‌లైన్ ద్వారా అందిన బడ్జెట్ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు క్రోడీకరించి సోమవారం నాటి సమావేశానికి అవసరమైన నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

బడ్జెట్ ప్రతిపాదనలు పంపించేందుకు సోమవారం తుదిగడువు కావడంతో కొన్ని శాఖల అధికారులు ఇప్పటికే వారి శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్దం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా వచ్చిన ప్రతిపాదనలను వచ్చే వారం పదిరోజుల్లో ఆర్థిక శాఖ పరిశీలిస్తుంది. వచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించి మరింత స్పష్టత తీసుకు రావాలన్న ఉద్దేశంతో సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశంలో ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో పాటు ఆయా విభాగాల సంచాలకులు కూడా పాల్గొంటారని ఆ వర్గాలు తెలిపాయి. నూతన బడ్జెట్‌లో శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలు, ఇతర వివరాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. 15వ ఆర్థిక సంఘానికి ఇవ్వాలనుకున్న నివేదికపై కూడా ఈ సమావేశంలో నిశితంగా చర్చించనున్నారు. రాష్ట్రాలు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు.. వాటి స్థితిగతులు, వృద్ధిరేటు, ఎస్‌జీడీపీ తదితర వివరాలను అందజేయాలని ఇప్పటికే ఆర్థిక సంఘం కోరింది. గతంతో పోలిస్తే ఈ దఫా ఆర్థిక సంఘం పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారం కావాలని కోరుతున్నందున సోమవారం నాటి సమావేశంలో ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చ జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఆయా శాఖల ఉన్నతాధికారులు ఆర్థిక సంఘానికి సమర్పించనున్న నివేదికపై పూర్తి సమాచారంతో రావాలని, పథకాల అమలుకు సంబంధించి ఇప్పటిదాకా ఖర్చు చేసిన నిధులను ఇంకా ఎంత నిధులు కావాల్సి ఉంది.. ఆ వివరాలను తమతో తీసుకురావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం ఆయా శాఖల అధికారులను కోరింది. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీ లోపు ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇవ్వవలసి ఉంది. బడ్జెట్ కసరత్తులో భాగంగా ఈ దఫా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర వివరాలను సిద్ధం చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు సంబంధించి ఇప్పటివరకు శాఖల వారీగా గణాంకాలు సేకరించేవారు. తాజాగా వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగి, పింఛన్‌దారుల పేర్లతో పూర్తి వివరాలను క్రోడీకరించాలని నిర్ణయించింది. ఈ తరహా కసరత్తును ఆర్థికశాఖ చేపట్టాలని ఆరు నెలల క్రితమే ప్రభుత్వం ఆదేశించింది.

ప్రభుత్వ ఉద్యోగికి, పింఛన్‌దారులకు చెల్లించే జీతభత్యాల వివరాలను సిద్ధం చేయాలని ఇప్పటికే తయారు చేసిన ఈ వివరాలను పంపాలని కోరింది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన సమగ్ర వివరాలను ఒకే చట్రం కిందకు తీసుకురావాలని ఆయా శాఖలు చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామీణ స్థాయిలో అమలు చేసిన విధానాన్ని వివరించాలని ప్రభుత్వం కోరింది. ఇప్పటిదాకా పథకాలు, కార్యక్రమాల వివరాలు ఒకే చోట ఉండకుండా వేర్వేరు చోట్ల పొందుపరుస్తుండటంతో సాంకేతికపరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, దానివల్ల ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులపై స్పష్టత కొరవడిందని అధికారులు అంటున్నారు. అందుకే.. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ఒకే చోటకు చేర్చి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రతిపాదించింది. ఇప్పటిదాకా ఖర్చుచేసిన మొత్తాలు.. ఇంకా వ్యయం చేయాల్సిన మొత్తాలను తెలియజేయాలని ఆదేశించింది. ఈ రెండూ ప్రధాన మార్పులతో ఆర్థిక శాఖ బడ్జెట్ కసరత్తును చేపట్టనున్నట్లు సమా చారం.

ఎస్సీ,ఎస్టీ కేటాయింపులు పెంపు



- ఈ వర్గాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పథకాలు
- నిర్దిష్ట కాల వ్యవధిలో నిధుల ఖర్చుకు చర్యలు
- 2018లో సంపూర్ణ, సంతృప్తి స్థాయి బడ్జెట్
- 2017 – 18 కేటాయింపులు రూ. 22,541కోట్లు
- 2018 – 19లో రూ. 25వేల కోట్లకు పెరిగే అవకాశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేసే అవకాశం ఉంది. ఈ వర్గల్లో ప్రభుత్వం పట్ల విశ్వసనీయతను పెంచుకొనే పద్దతిలో సరికొత్త పథకాలు ఉండబోతున్నాయి. అభివృద్ధి, సంక్షేమం లో సమాన ప్రగతి సాధించాలనే లక్ష్యం మేరకు నిధుల కేటా యింపు, పథకాల రూపకల్పన పైన దృష్టి కేంద్రీకరించారు. నిర్దిష్ట కాల వ్యవధిలో ఈ వర్గాల్లోని పేదరికాన్ని రూపు మాపేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకొనే విధంగా కార్యాచరణ రూపొందించబడుతుంది. లక్ష్యాలను సాధిం చేందుకు దోహదపడే విధంగా 2018లో సంపూర్ణ సంతృప్తి స్థాయి బడ్జెట్ ఉండబోతుందని అధికారులు పేర్కొన్నారు.

సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ ఏర్పాటు చేసిన శాఖాధిపతుల సమావేశంలో రాబోవు కాలంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అమలు జరపబోవు కార్యక్రమాలు, అందుకయ్యే ఖర్చు తదితర అంశాలపైన నివేదిక అందించ బోతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నాటి నుండి ఈ వర్గాల అభ్యున్నతి పైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించింది. సత్వర ప్రగతిని ఆశించి భారీగా నిధులను కేటాయిస్తుంది. కేటాయింపులను ఖర్చు చేయడానికి అధికార యంత్రాంగం పై వత్తిడి పెంచింది. ప్రజా ప్రతినిధులతో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. సీఎం కె. చంద్రశేఖర్ రావు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్, షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తరచుగా సమీక్షలు నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచడానికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. సామాజిక భద్రత ప్రభుత్వ బాధ్యత అనే భావనతో తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ రంగంలో వేగం పెంచడానికి చర్యలు తీసు కుంటుంది. అందుకు అనుగుణంగా నిధులు పెంచబోతుంది. ఈ నెల 10వ తేదీ నాటికి నిధుల కేటాయింపు విషయంలో కొంత స్పష్టత వస్తుందని ఉన్నతాధికారులు పేర్కొ న్నారు.

2017 - 18లో ఎస్సీల అభివృద్ధికి రూ. 14,375.12 కోట్లు, ఎస్టీల అభివృద్ధికి రూ. 8,165.88 కోట్లు కేటాయించింది. 2018 - 19లో ఈ మొత్తాలు 15 నుండి 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దాదాపు రూ. 25,000ల కోట్లకు తగ్గని విధంగా కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో ఎస్సీలు 63,60,158 (15 శాతం), ఎస్టీలు 36,02,288 (9.91 శాతం) మంది ఉన్నారు. వారందరి అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు జరుగుతున్నాయి. విద్య, ఉపాధి, సామాజిక భద్రతతో పాటుగా ఆదివాసీలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుంది. కొన్ని కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకుంటూ గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఇంత చేస్తున్నప్పటికీ అభివృద్ధి నిధులు సక్రమంగా సకాలంలో ఖర్చు కావడం లేదు. కొన్ని శాఖలు ప్రతిపాదనలు కూడా పంపించడం లేదు. అనేక రంగాల్లో కేటాయింపులను ఖర్చు చేయలేక పోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం సమాలోచనలు జరుపుతుంది. నిర్దిష్ట కాల వ్యవధిలో నిధులు ఖర్చు చేయడం, పథకాలను అమలు జరపడం, అభివృద్ధిని చూపడం లక్ష్యంగా చర్యలు తీసుకొనేందుకు ముఖ్యమంత్రి స్థాయిలో కసరత్తు జరుగుతుంది. కేటాయించిన నిధులు సకాలంలో ఖర్చు కావాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. నిర్దిష్ట కార్యాచరణ అమలు కోసం శాఖాపరంగా మార్పులు చేర్పులు ఉండబోతున్నాయి.

షెడ్యూల్డు కులాలు, తెగల అభ్యున్నతి పట్ల అంకిత భావం ఉన్న అధికారులకు బాధ్యతలు అప్పగించ బోతున్నారు. క్షేత్ర స్థాయిలో ఫలితాలు వెలుగుచూడాలని, కాగితాలపై చూపే ప్రగతి ఈ వర్గాల అభ్యున్నతికి దోహద పడబోదని ముఖ్య మంత్రి భావించడంతో ఆ దిశగా చర్యల్లో వేగం పెరిగింది. భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మన్ననూరు ఐటిడిఏల పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఈ ప్రాంతాల్లోని గిరిజనులకు మరింతగా అభివృద్ధి చేరువ కావ లసి ఉందని భావించింది.

తండాలు, గూడాలను అభివృద్ధి పర్చడానికి అధిక నిధులు అందుబాటు లోకి తెచ్చింది. రోడ్లు, విద్యుత్ సదుపాయం, విద్య, వైద్యం, ఉపాధి కల్పన కార్య క్రమాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరింత ముమ్మరంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొం దించ బడుతుంది. ఇటీవలి కాలంలో లంబాడీలు, ఆదివాసీ ల మధ్య ఉత్పన్నమైన అంశా లను కూడా ప్రభు త్వం పరిగణలోకి తీసు కుంది. రిజర్వేషన్ల వ్యవహారంలో స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేయబోతుంది. ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగని విధంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపకల్పన జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

సింగరేణి విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించుకుంది. ఇప్పటికే సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 1200మెగావాట్ల విద్యుత్‌కేంద్రం లాభదాయకంగా ఉండగా, కొత్తగా మరో 800మెగావాట్ల విద్యుత్‌కేంద్రం, 500మెగావాట్ల సోలార్ విద్యుత్‌కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. 800మెగావాట్ల విద్యుత్‌కేంద్రానికి సంబంధించిన పనులు వచ్చే ఆర్థికసంవత్సరంలో ప్రారంభం కానుండగా, సోలార్ పవర్‌ప్లాంట్లకు సంబంధించి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది బొగ్గువిక్రయాలు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా రూ.24వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్న సంస్థ రానున్న ఐదేళ్ళలో దీనిని రూ.34వేల కోట్లకు తీసుకెళ్ళాలని నిర్ణయించింది. ఇక కొత్తగా 12గనులు ప్రారంభించాలని నిర్ణయించగా ఇందులో ఆరు భూగర్భగనుల.. ఆరు ఓపెన్‌కాస్ట్ గనులు ఉండనున్నాయి. కొత్త విద్యుత్ కేంద్రాలు, గనులకు కలిపి మొత్తం రూ.10వేల కోట్ల పెట్టుబడి ప్రణాళికను సంస్థ రూపొందించుకుంది. సింగరేణి సంస్థ చైర్మన్‌గా మూడేళ్ళ క్రితం బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ ప్రగతిపథంలో సంస్థను అనూహ్యంగా ముందుకు తీసుకువెళ్ళారు. వచ్చే ఏడాది నుండి ఏటా రూ.2వేల కోట్ల ఆదాయం పెరుగుదల నమోదవుతుందన్న విశ్వాసంలో ఉంది. ప్రస్తుతం ఉత్తర తెలంగాణలో విస్తరించి ఉన్న సింగరేణికాలరీస్‌లో 10బిలియన్ టన్నుల బొగ్గునిల్వలున్నాయి.

రూ.1100కోట్ల లాభం దిశగా..

సింగరేణి సంస్థ గడచిన మూడేళ్ళలో అనూహ్యవృద్ధిరేటును నమోదు చేసింది. 52మిలియన్ టన్నుల నుండి 62.5మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసే స్థాయికి సంస్థ ఎదిగింది. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఆర్థిక సంవత్సరంలో 23శాతం ఆదాయం కూడా వృద్ధి చెందింది. రూ.19,274కోట్ల నుండి రూ.24వేల కోట్ల ఆదాయానికి సంస్థ చేరినట్లు సమాచారం. గత ఆర్థిక సంవత్సరంలో రూ.400కోట్ల లాభాన్ని ఆర్జించిన సింగరేణి సంస్థ ఈఏడాది రూ.1100కోట్ల లాభాన్ని సాధించేస్థితిలో ఉంది. రానున్న ఐదేళ్ళలో 85మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా సంస్థ అడుగులు వేస్తోంది. సింగరేణి వద్ద రూ.6వేల కోట్ల నిధులు నిల్వ ఉండగా, వీటితో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని చేపట్టనుంది.

34వేల కోట్ల ఆదాయమే లక్ష్యం: సింగరేణి చైర్మన్ శ్రీధర్

రానున్న ఐదేళ్ళలో సంస్థను రూ.34వేల కోట్ల టర్నోవర్‌కు తీసుకెళ్ళడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు సింగరేణి చైర్మన్ ఎన్.శ్రీధర్ తెలిపారు. కొత్తగనులు, కొత్త విద్యుత్ కేంద్రాలతో సంస్థ ఆదాయాభివృద్ధి సాధిస్తామన్నారు. గడచిన మూడేళ్ళలో సంస్థ ఉత్పత్తి పది మిలియన్ టన్నులకు పైగా పెరిగిందన్నారు.

డిజిటల్ డోర్ నంబర్లు

(మొదటిపేజీ తరువాయి)



ఇంటినంబర్లు ఎంత గజిబిజి, గందర గోళంగా ఉంటా యో అందరికి తెలిసిందే. ఒక ఇంటి చిరునామాకు...మరో ఇంటినంబర్‌కు ఏ మాత్రం సంబంధం ఉండదు. దీంతో కేవలం చిరునామా ద్వారా ఎవరిదైనా అడ్రస్‌ను కనుగొ నాలంటే....అనేక అవస్థలను ఎదుర్కొ నాల్సి వస్తోంది. ఇప్పుడే ఇంటి నంబర్లను కనుక్కోవడం అసాధ్యంగా మారిన నేపథ్యం లో మునుముందు నగరాలు, పట్టణ ప్రాంతాల పరిధి మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటినంబర్ల గజిబిజికి ఇకనైనా నియంత్రించని పక్షంలో ముమ్మందు మరిన్ని సమస్యలు ఉత్పన్నం కానున్నాయి. భవిష్య త్‌లో తలెత్తనున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే మున్సిపల్‌శాఖ కొత్తగా డిజిటల్ నంబర్లను కేటాయిం చాలని తల పెట్టింది. హైదరాబాద్ వంటి అతి పెద్ద పట్టణం లో ఒక ఇంటి నంబర్‌ను కనుగొనాలంటే చెప్పు లు అరిగేలా తిరిగినా తెలుసుకోవడం అసా ధ్యం. ఇక పాతబస్తీ వం టి పట్టణంలో అయితే ఇక సరేసరి. ఇంతలా ఇంటినంబర్ల సమస్య నగర ప్రజలను పట్టిపీడిస్తున్నాయి.

రాష్ట్రంలోని పలు పట్టణాలు, నగరాల్లో ఇంటినంబర్లు ఒక క్రమపద్ధతిలో లేకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తు తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని మునిసిపల్ శాఖ రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలలోని ఇళ్ళకు కొత్తగా డిజి టల్ ఇంటి నంబర్లను కేటాయిం చాలన్న అంశంపై దృష్టి సారించింది. వీనిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విని యోగించుకుని ఇంటినంబర్లను కేటాయిం చాలని కసరత్తు చేస్తోంది.

ప్రాంతం....వీధిపేరు, రోడ్డునంబర్, అంతస్థుల వారిగా డిజిటల్ ఇంటి నంబర్లను కేటాయిస్తారు. దీని ద్వారా సులభంగా ఇంటినంబర్లను కొనుగొనేందుకు అవకాశముంటుంది. ప్రస్తుతం గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో సర్కిల్ 09 కొనసాగుతోంది. దీనిని మినహాయించి రాష్ట్రంలోని మిగిలిన కార్పొరేషన్లల్లో సరికొత్త ఇంటినంబర్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని మునిసిపల్ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తును కూడా ముమ్మరం చేసింది. కాగా పైలెట్ ప్రాజెక్టుగా మున్సిపల్ శాఖ ఇదివరకే సూర్యాపేటలోని ఒక ప్రాంతంలో చేపట్టింది. ఈ ప్రక్రియ విజయవంతంగా ముగియడంతో మొత్తం కార్పొరేషన్ మొత్తంలో ఈ విధానాన్ని చేపడుతున్నారు. ఇదే తరహాలో మిగిలిన అని నగరాలు, పట్టణ ప్రాంతాల్లో కూడా చేపట్టాలని అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. కొత్తగా రూపొందించిన డిజిటల్ ఇంటినంబర్లను గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం చేస్తారు. ఇలా చేయడం వల్ల ఇంటినంబర్లను సులువుగా తెలుసుకునే అవకాశముం టుంది. ప్రస్తుతం మనం ఫోన్‌లో గూగుల్ మ్యాప్ ద్వారా ఒకప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకుంటున్న విధంగానే....ఇకపై నేరుగా మనం వెళ్ళాల్సిన ఇంటికే వెళ్ళే అవకాశం లభించనుందని తెలుస్తోంది. మొత్తం మీద ఇక రాష్ట్రంలోని ఏ నగర, పట్టణ ప్రాంతాల్లో ఇంటినంబర్‌నైనా సులువుగా తెలుసుకునేందుకు మునిసిపల్ శాఖ చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని ప్రజలు కూడా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

అయితే జీహెచ్‌ఎంసీ ప్రయోగా త్మకంగా కొన్ని సంవత్సరాల క్రితం ఆధునిక ఇంటినంబర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. కానీ ఆ నంబర్లను ప్రజలు పెద్దగా వినియోగించుకోని కారణంగా ఇళ్ళ నంబర్ల వ్యవస్థ ఇంకా గజిబిజిగానే ఉంది. అప్పట్లోకూడా ప్రతి కూడలికి ఒక కోడ్‌నంబర్‌ను కేటాయించి ప్రతి ఇంటికిఒక నంబర్ కేటాయించారు. కానీ ఈ విధానానికి నగర ప్రజలు అంతగా అలవాటు కాకపోవడంతో హైద రాబాద్‌లో ఇంకా పాతకాలం నాటి ఇంటినంబర్లే చలామణి లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మునిసిపల్ శాఖ డిజిటల్ నంబర్ల కేటాయింపు విషయంలోమరిన్ని జాగ్రత్తలు తీసు కుంటే తప్ప ఇది సాధ్యమయ్యే పరిస్థితి లేదని తెలుస్తోంది.

సహకార ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించాలంటే ఇప్పటికే ఓటరు జాబితాలు సిద్ధం చేయాల్సి ఉంది. అందుకు ఎంత లేదన్నా రెండు నెలల సమయం అవసరమవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈపరిస్థితుల్లో ఇప్పుడున్న పాలకమండళ్ళను కొనసాగించక తప్పడం లేదు ప్రభుత్వానికి. ఈ విషయాన్ని నేరుగా స్పష్టం చేయలేక అధ్యయనానికి మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన మొత్తం ఏడుగురు మంత్రులతో కూడిన ఉపసంఘం నెల రోజులపాటు అధ్యయనం చేసి ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించనుంది. అందులో వ్యవసాయ, సహకారశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి కూడా సభ్యునిగా ఉన్నారు. ఈ అధ్యయనం జరిగేలోపు సహకార పరపతి సంఘాల కాలపరిమితి ముగిసే సమయం తగ్గరపడుతుంది. అనంతరం ప్రభుత్వం ప్యాక్స్ గడువును మరో దఫా పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయనుంది.

సహకార చట్టం ప్రకారం మూడేళ్ళ కాలపరిమితితో ఎన్నుకోబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (ప్యాక్స్) పాలక మండళ్ళపట్ల కేసీఆర్ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగిసిపోనున్న ప్యాక్స్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులను మరో మూడేళ్ళు పొడిగించాలన్న ప్రతిపాదనకు ఆయన సూచనప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 903 సహకార సంఘాలకు ఓటే విధానాన్ని వర్తింపజేయాలని కూడా ఆయన నిర్ణయించినట్లు తెలుస్తోంది. చట్టం ప్రకారం సంఘాల పదవీకాలం ముగిసే సమయానికి 45 రోజులు ముందుగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. అంతకన్నా మూడు నెలల ముందుగా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ప్రక్రియ, పరిశీలన తుది జాబితాలు సిద్ధంచేసి బహిరంగంగా ప్రకటించాల్సి ఉంటుంది.

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికలకు వెళితే రాజకీయ వ్యవస్థతో ముడి పెట్టుకుని ఉన్న క్షేత్రస్థాయి పరపతి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. 2019 ఎన్నికల నేపథ్యంలో సహకార ఎన్నికలను వాయిదా వేయాలన్న దిశగా సీఎం కేసీఆర్ యోచి స్తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది.

ప్రభుత్వానికుండే విశిష్టాధికారాల మేరకు ప్రాథమిక సహకార సంఘాల గడువు ముగిసిన తర్వాత గరిష్టంగా ఆరు నెలల్లోగా గడువును పొడిగిస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి మూడుసార్లు ఆర్డినెన్స్‌ల ద్వారా పదవీ కాలాన్ని పొడిగించేందుకు వీలుంది. ఆ తర్వాత తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని చట్టం చెబుతోంది. కానీ ప్రభుత్వం తలుచుకుంటే మంత్రిమండలి తీర్మాణంతో మరోసారి కూడా గడువును కొడిగించే అధికారం ఉందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. అయితే, ఆ ఆర్డినెర్స్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టి సభ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే సార్వత్రిక ఎన్నికల నాటికి సహకార సంఘాల గడువు పొడిగింపుల ప్రక్రియను కొనసాగించి, 2019 ఎన్నికల్లో మరోసారి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాతే ప్యాక్స్‌లకు కొత్త పాలకమండళ్ళ ఏర్పాటుకు సంబంధించి చర్యలకు పూనుకోవాలన్న ఆలోచనతోనే కేసీఆర్ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

గ్రామ స్థాయిలో ప్యాక్స్ కీలక పాత్ర

గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో, చిన్న సన్నకారు రైతు కుటుంబాలతో పెనవేసుకొని ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వ్యవసాయ రంగానికి అవసరమైన మౌళిక వనరులను సమకూర్చడంతో పాటు ప్రభుత్వం విడుదల చేసే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర ప్రోత్సాహకాలను బట్వాడా చేస్తుంది. రాజకీయ వ్యవస్థతో ముడిపెట్టుకొని ఉన్నప్పటికీ, ఈ సంఘాలను రద్దు చేస్తే మరో కోణంలో అనేక సమస్యలు ఎదుర్కొనక తప్పదని ఆర్థిక సామాజికరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో 2004లో నియమించిన వైద్యనాథన్ కమిటీ సిఫారసుల మేరకు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 17రాష్ట్రాల్లోని 53వేల సహకార సంఘాలకు రూ.9వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. 2009లో మరోసారి అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం ప్రకాష్ భక్షి కమిమీని నియమించి సహకార సంఘాలే అవసరం లేదని తేల్చింది.

కుల చిచ్చు సమాజానికి ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

సమీపంలోని భీమ్-కొరెగావ్‌లో ఈసారి దళితులు జరుపుకున్న విజయోత్సవాల్ని కేవలం రెండువందల ఏళ్ళ నాటి పేష్వాలపై అణిచివేతను గురించి మహార్లు సాధించిన విజయానికి ప్రతీకగానే కాదు.. ప్రస్తుతం రోజూ దేశంలో ఏదోక ప్రాంతంలో జరుగుతున్న అణిచివేతకు, నరమేధానికి వ్యతిరేకంగా కూడానని ముందుగానే విశ్లేషకులు హెచ్చరించారు.

మహారాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ బ్రాహ్మణుడు. రెండొందల ఏళ్ళ క్రితం ఈ ప్రాంతాన్ని అప్రతిహతంగా పాలించిన పేష్వాలు కూడా బ్రాహ్మణులే. అప్పటి నుంచి మరాఠా యోధులను, బ్రాహ్మణులను సరిపడదు. ఇప్పుడు మహారాష్ట్ర కీలకనేత శరద్‌పవార్ కూడా మరాఠా యోధుడే. ఈ రెండు జాతులకు మధ్య పచ్చగడ్డి వేయకుండానే భగ్గుమంటుంది. ఈ దశలో సంఖ్యాపరంగా అత్యధికులైన మహర్లు చారిత్రక నేపథ్యంతో కూడిన భీమ్-కొరెగావ్ ధ్వజ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని సంకల్పించారు. సహజంగానే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో తమ సత్తా చాటేందుకు ఇలాంటి అవకాశాన్ని ఎవరైనా వినియోగించుకుంటారు. అయితే శాంతియుతంగా సాగుతున్న ప్రదర్శనపై ఒక్కసారిగా బయట నుంచి దాడులు జరిగాయి. ఇది మహర్, పేష్వాల మధ్య సమసిపోయిన వైరాన్ని తిరిగి రెచ్చగొట్టడానికి లేక మహర్, మరాఠాల మధ్య కొత్తగా వైరాన్ని సృష్టించడానికా అన్నది ఇంతవరకు ఇతమిద్ధంగా తేల్లేదు. అయితే బీజేపీ మాజీ కార్పొరేటర్ మిలింద్, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకోవడం, ఘర్షణలకు వెనకుండి ప్రోత్సహించారంటూ వీరిపై కేసులు నమోదు చేయడంతో ఈ అల్లర్లు సరికొత్త సందేహాలకు తావిస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం ఒక మరాఠా బాలికపై కొందరు దళిత యువకులు అత్యాచారానికి ఒడిగట్టారు. దీంతో దళితులు, మరాఠాల మధ్య వివాదం చిలికి చిలికి అప్పట్లో గాలివానగా మారింది. రెండువసాళ్లోనే ఇది సద్దుమణిగింది. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య ఎలాంటి సంఘర్షణలేవు. ఇప్పుడు ఈ వివాదం నేపథ్యంలోనే మహర్లపై ఓ వర్గం దాడికి పాల్పడే అవకాశాలు లేకపోలేదని పోలీసులు కూడా సందేహిస్తున్నారు. రెండొందల ఏళ్ళ క్రితమే ఈ ప్రాంతంలో బ్రాహ్మణులు, మహర్ల మధ్య వివాదాలుండేవి. అయితే రాన్రాను ఇరువర్గాలు దీన్ని మర్చిపోయాయి. సత్సంబంధాలు కొరవడ్డా పరస్పర ఘర్షణ వాతావరణం మాత్రం లేదు. తాజా దాడులు తిరిగి మూడు ప్రధాన కులాల మధ్య అగ్గికి ఆజ్యం పోశాయి.



కొంతకాలంగా మహారాష్ట్రలో బలమైన వర్గం మరాఠాలు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ఇందుకు కారణం వారు ఇక్కడ అధికారానికి దూరం కావడం. మరాఠాలకు ఆదినుంచి ఓ మానసిక ప్రవృత్తి ఉంది. తాము ఏలేందుకే పుట్టామని వారు భావిస్తారు. మహారాష్ట్రకు దీర్ఘకాలం మరాఠాలే ముఖ్యమంత్రులుగా ఉన్నారు. కానీ ఫడ్నవీస్ రాకతో ఒకప్పటి పేష్వాలైన బ్రాహ్మణుల పెత్తనం తిరిగి ఈ రాష్ట్రంలో జోరందుకుంది. ఇటీవల దళితులు ఆత్మగౌరవ నినాదాన్ని అందిపుచ్చుకున్నారు. అత్యధిక సంఖ్యాకులైన తమకే అధికార పగ్గాలు కావాలంటూ రాజకీయ ప్రాబల్యానికి ప్రయత్నాలు మొదలెట్టారు.

వాస్తవానికి ఎప్పుడో 1818 జనవరి 1న ముగిసిన పోరాటానికి సంబంధించి రెండొందల ఏళ్ళ తర్వాత ఇప్పుడు దళితులు రోడ్లపైకొచ్చి విజయోత్సవాన్ని నిర్వహించుకోవడం ఖచ్చితంగా మరాఠాలు, బ్రాహ్మణులకు వ్యతిరేకంగా తమ శక్తి ప్రదర్శనకేనని భావిస్తున్నారు. వాస్తవానికి 1818 జనవరి 1న విజయం సాధించింది బ్రిటీష్‌వారే. అది బ్రిటీష్ సంస్థ. ఇది మరాఠా పాలకులైన పేష్వాలపై యుద్ధానికి దిగింది. వారు పాలిస్తున్న ప్రాంతాన్ని ఆక్రమించుకునేందుకే ఈ యుద్ధం జరిగింది. ఇప్పుడు విజయోత్సవాన్ని నిర్వహించుకుంటున్న మహర్లు ఆనాడు బ్రిటీషర్ల తరఫున పోరాటం చేశారు. ఇందుకో ప్రత్యేకమైన కారణముంది. కొన్ని తరాలుగా పేష్వాలు మహర్లను అంటరానివారిగా పరిగణించేవారు. పేష్వాలు లేదా అగ్రకులాలు జీవించే వీధుల్లోకి మహర్లు నడిచేళ్ళేందుకు వీల్లేదు. ఒకవేళ అటువైపుగా వెళ్ళాలంటే నడుముకు చీపురు కట్టుకుని వెళ్ళాల్సిందే. వారు తాకిన నేలను తిరిగి చీపురుతో శుభ్రం చేసేవారట.

దీంతో పాటు అటువైపు వెళ్ళే దళితులు మెడలో మట్టితో చేసిన కుండను తగిలించుకోవాలి. దారిలో ఉమ్ము వస్తే అందులోనే ఊయాలి తప్ప వారి ఉమ్ము కూడా ఆ నేలను తాకకూడదు. ఇక కూలి పనులకు మాత్రమే వీరి పరిమితమవ్వాలి. ఊరికి దూరంగానే నివసించాలి. పేష్వాలు, బ్రాహ్మణులు, ఇతర అగ్రకులాల వైపు తలెత్తి చూడకూడదు. వారు కొట్టినా, తన్నినా కనీసం నోటితో శబ్దం కూడా చేయకూడదు. ఊరవతలున్న చెలమల్లోని నీటినే తాగాల్సిందే. ఈ దురాగతాలతో పాటు మహర్లకు చెందిన మహిళలపట్ల పేష్వాలు అతికిరాతకంగా వ్యవహరించేవారు. దీంతో మహర్లలోని యువతలో ఆగ్రహజ్వాలలు తన్నుకొచ్చాయి. వీరంతా బ్రిటీష్ ప్రభుత్వం పిలుపులిచ్చిన సైన్యంలో చేరారు. తమకోసం ప్రత్యేక రెజిమెంట్ ఏర్పాటు చేయాల్సిందిగా సైన్యాధికారులన్ని కోరారు. అప్పటి నుంచి మహర్ రెజిమెంట్‌ను బ్రిటీష్ సైన్యం ఏర్పాటు చేసింది. ఇందులో అందరూ మహర్లే ఉండేవారు.

అప్పట్లో ఈస్టిండియా కంపెనీ పాలనను మరాఠా పాలకులే సమర్థవంతంగా నిరోధించగలిగారు. కొన్ని ప్రాంతాల్ని తమ అధీనంలోనే వారు కొనసాగించారు. వారికి పేష్వాలు ప్రధాన మంత్రులుగా వ్యవహరించారు. పేష్వాలు తప్పుడు సలహాలతో మరాఠాల్ని తప్పుదారి పట్టించారు. ఇది తరచూ బ్రిటీష్, మరాఠాల మధ్య యుద్ధాలకు దారితీసేవి. 1817 చివర్లో మరాఠా, బ్రిటీషర్లకు మధ్య మూడోసారి యుద్ధం జరిగింది. ఈ పూణెవైపు పూర్తిగా పేష్వాల అమలు చేశారు. అప్పటికే పేష్వాలపై ఆగ్రహంతో ఉన్న మహర్లు ఈ యుద్ధం చేసే బాధ్యత తమకు అప్పగించాలంటూ ఈస్టిండియా కంపెనీని కోరారు.

చెప్పినట్టే పేష్వాలకు చెందిన 28వేల మందితో కూడిన సైన్యాన్ని కేవలం 800మంది మహర్లు ఓడించారు. ఈ యుద్ధం తర్వాతే మహారాష్ట్రలో పేష్వాల పాలన అంతమైంది. ఆ ప్రాంతం పూర్తిగా బ్రిటీష్ అధీనంలోకొచ్చింది. ఒకవిధంగా ఇది బ్రిటీషర్ల విజయం. వారి తరఫున భారతదేశానికి చెందిన అణగారిన వర్గం సాధించిన విజయం. ఇందులో ఓటమిపాలైంది భారతీయులే. అయితే అందుక్కారణం కులాల పేరిట సొంత దేశీయుల్ని అణగదొక్కడం. వారి హక్కుల్ని కాలరాయడం.

చారిత్రక నేపథ్యం నుంచి వర్తమానాలు గుణపాఠాలు నేర్వాలి. కానీ ఇప్పటికీ దేశంలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కొంతకాలంగా ఈ దుస్థితి మరింత పెరిగింది. కొన్నాళ్ళు మతాల మధ్య విబేధాలు సృష్టించి పబ్బం గడుపుకునేవారు. ఇప్పుడు కులాల మధ్య చిచ్చురేగుతోంది. సనాతనవాదం పేరిట తిరిగి శిలాజాలంవైపు పయనించడానికి ఏమాత్రం వెనుకాడటంలేదంటూ పరిశీలకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో అప్పటి సంప్రదాయాలు, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అనేకరకాల అంతర్గత విబేధాలు ఉండేవి. అమెరికాలో తెల్ల, నల్ల జాతుల మధ్య పరస్పర ద్వేషభావముండేది. భారత్‌లో సతీసహగమనం, బాల్యవివాహాలు, అంటరానితనం వంటి దురాచారాలు అమలయ్యేవి. అప్పటికాలానుగుణంగా నీటిని ఆచరించారు. అంతమాత్రాన శతాబ్దాల అనంతరం ఇప్పుడు కూడా అప్పటి పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని పరస్పర ఆగ్రహావేశాలు పెంచుకుని కక్షలు, కార్పణ్యాలతో వ్యవహరించడం నాగరికతకు, సభ్యతకు అర్థంపర్థం. ఇప్పటి పరిస్థితుల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి తప్ప మానిన గాయాల్ని తిరిగి రేపుకోవడం సమాజంలోని ఏ వర్గానికి శ్రేయస్కరం కాదని పరిశీలకులు ఉద్బోధిస్తున్నారు.



అందరికీ నాణ్యమైన విద్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత తెలిపారు. అట్టడుగు వర్గాల వారికి నాణ్యమైన విద్యను అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని తెలిపారు. తెలంగాణ టీచర్స్ యూనియన్(టిటియు) రూపొందించిన 2018 డైరీ, క్యాలెండర్‌ను ఆమె ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిటియు రాష్ట్ర అధ్యక్షులు జి.బాలగోపాలస్వామి, ప్రధాన కార్యదర్శి మట్ట పల్లి రాధాకృష్ణారావుతోపాటు రాష్ట్ర నాయకులు మోరం వీరభద్రరావు, భీర వెంకటేశం, బి.నాగేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించడం కోసం ఎక్కువ సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేస్తోందని కవిత తెలిపారు. విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి నియామక ప్రక్రియను కొనసాగిస్తున్నట్టు తెలిపారు. బంగారు తెలంగాణ సాధనలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కరెంట్ ఆపాలనుకుంటే మసైపోతారు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించాలని సిఎం కెసిఆర్ చూస్తుంటే వాటిని అడ్డుకునేందుకు కొందరు కేసులు వేస్తున్నారని విమర్శించారు. సీఎం కెసిఆర్ 20వేలకు పైగా విద్యుత్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తే అది ఓర్వలేని విపక్షాలు కోర్టులకు వెళ్తున్నాయని ధ్వజమెత్తారు. కార్మికులకు 2018లో రావాల్సిన పిఆర్‌సిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానన్నారు. జెన్‌కోలో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ క్రెడిట్ కార్డులను ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. అలాగే జనరేటింగ్ స్టేషన్‌లలో పనిచేస్తున్న కార్మికులకు నివాసగృహాల ఏర్పాటుకోసం కృషిచేస్తామని కవిత తెలిపారు. ఉద్యమంలోనూ ముందున్న టిఆర్‌వికెఎస్ ఉద్యమం తర్వాత కూడా అదే స్ఫూర్తిని కనబరచడం అభినందనీయమన్నారు. నిరంతర కరెంట్ అందించడం వల్ల పారిశ్రామిక ప్రగతితో పాటు వ్యవసాయోత్పత్తుల పెంపుకు దోహదపడుతుందన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటేనే ఇది సాధ్యపడుతుందన్నారు. యూనియన్ నేతలు అడిగిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 650సీనియర్ ఎల్ఎంలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారని దీనిపై సిఎండితోనూ, మంత్రితోనూ మాట్లాడుతానన్నారు. 1991లో నియామకమైన కార్మికులకు పే అనామలీస్‌ను పరిశీలిస్తామన్నారు. ఉద్యోగు ఆరోగ్యం విషయంలో తెలంగాణ ముందుందన్నారు. ఉద్యోగులకు వర్తించే వైద్య సౌకర్యం విద్యుత్ కార్మికులకు వర్తిస్తాయా లేదా అనే విషయాన్ని అధికారులతో మాట్లాడి తెలుసుకుంటానన్నారు. జెఎన్‌టియులో ఐఎంఈ నుండి ఐసిఈ డిప్లమో కోర్సు చేసిన వారిని సబ్‌ఇంజనీర్లుగా అవకాశం ఇప్పించాలని కోరుతున్నారని, కొన్ని డిపార్ట్‌మెంట్‌లలో వీటిని పరిశీలిస్తున్నారన్నారు. ట్రాన్స్‌కోలో 1005పోస్టులు మంజూరయ్యాయని, కానీ ఫోర్‌మెన్ గ్రేడ్-1, గ్రేడ్-2 పోస్టుల మంజూరీ కోసం ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ కె.శ్రీనివాసరెడ్డి, టిఆర్‌వికెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్, ప్రకాశ్, టిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో కోటా ఆదర్శం

డబుల్‌బెడ్‌రూం ఇండ్లలో వికలాంగులకు 5శాతం కేటాయించాలని టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం దేశానికే ఆదర్శమని వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆనయ ఇందుకు కృషిచేసిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్లకవితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాగృతి వికలాంగ విభాగం కన్వీనర్ అంజనారెడ్డి పాల్గొన్నారు.

దస్త్రాల పరిశీలన పూర్తి

• తేలిన లెక్కలు • మరింత స్పష్టతకు రెండో విడత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భూ దస్త్రాల పరిశీలన ఫలితాలు 93 శాతం వివాదరహితంగా తేలాయి. 568 మండలాల్లో, 10823 రెవెన్యూ గ్రామాల్లో 1507 బృందాలు శ్రమించి రికార్డుల ప్రక్షాళన పూర్తి చేశాయి. 2కోట్ల 55 లక్షల 98వేల 91 ఎకరాల భూ విస్తీర్ణానికి చెందిన రికార్డుల పరిశీలన పూర్తయింది. ఈ మొత్తంలో



2,38,08,650 ఎకరాలు వివాదరహితమగి నిర్ధేశించారు. అంటే మొత్తం విస్తీర్ణంలో 93 శాతం వివాదాలు లేనివేనని అధికారులు ధృవీకరించారు. కేవలం 17లక్షల 89 వేల ఎకరాల రికార్డులు, వివరాలను మాత్రమే పార్ట్-బిలో చేర్చి వివాదాస్పదమని గుర్తించారు. ఇది మొత్తం విస్తీర్ణంలో 7శాతంగా తేల్చారు. 71,75,096 ఖాతాలు 92 శాతంతో వివాదాలకు అతీతంగా ఉన్నట్లుగా ఈ పరిశీలనతో బైటపడింది. మొత్తం భూముల్లో 1,42,12,826 ఎకరాల వ్యవసాయ భూమి వివాదాలకు అతీతమని అధికారులు నివేదించారు. మొత్తం భూ విస్తీర్ణంలో వ్యవసాయ భూములవాటా 60 శాతంగా ఉంది. మరో 11,95,889 ఎకరాలు వ్యవసాయేతరంగా తేల్చారు. ప్రభుత్వ అవసరాలకు, కార్యాలయాలకు దాదాపు 83,99,934 ఎకరాలను వినియో గించినట్లుగా వెల్లడైంది. ఇక ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, రహదారులు, దేవాదాయ అవసరాలకు నియోగించిన భూమి 35 శాతంగా ఉంది. కాగా గతంలో ఆయా భూములపై ఇంత వరకు స్పష్టత లేదు. తాజా రికార్డుల ప్రక్షాళనతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సెప్టెంబర్ 15న రాష్ట్రమం తటా ప్రారంభమైన సంచలనాత్మక సర్వే పూర్తయింది. నిర్ధేశిత సర్వే బృందాలు కేటాయించిన ఫార్మాట్‌లో వేగంగా సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు ఎలాంటి అటవీ భూముల లెక్కలు కానీ, సేకరించిన భూముల లెక్కలు కానీ అందుబాటులో లేవు. ఇప్పుడు సర్వేతో ఇవి అందుబాటులోకి వచ్చాయి. భూభారతి తర్వాత తలపెట్టిన అతిపెద్ద కార్యాచరణ కావడంతో కేంద్ర వర్గాలు కూడా ఆరా తీస్తున్నాయి. అయితే దీని తర్వాతే సిసలైన భూ సర్వేకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సిద్దం కానుంది. ఈ సర్వే తర్వాత మరింత స్పష్టత కోసం రాష్ట్ర భూభాగం అనువనువూ లెక్క తేల్చేందుకు సర్కార్ కసరత్తు చేస్తోంది. గతేడాది జనవరి 22న భూ సమగ్ర సర్వేకు నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం ఆ తర్వాత ఈ అంశాన్ని పక్కనపెట్టింది.



యూపీ: ఫిరోజాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మంది దుర్మరణం

గందర భూగోళం

(మొదటిపేజీ తరువాయి)

ఉష్ణోగ్రతల కారణంగా రోడ్లు కరిగిపోతున్నాయి. అలా భూగోళానికి చెరో వైపున రెండు ప్రాంతాలు 2018 సంవత్సరానికి విపరీతమైన వాతావరణ పరిస్థితులతో స్వాగతం పలికాయి. అమెరికాలో శీతాకాలం చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో బాంబు తుపాను తెచ్చింది. దట్టంగా మంచు పడింది. కోస్తా తీరం వెంబడి రోజుల తరబడి వెన్ను వణికించే చలిగాలులు వీచాయి. ఆస్ట్రేలియాలో వేసవికాలం మరీ ముఖ్యంగా దేశంలోని దక్షిణం, ఆగ్నేయ ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలతో వడగాల్పులు వీస్తున్నాయి. వేలాది ఎకరాల బీడు భూముల్లో కార్చిచ్చు రేగింది. విక్టోరియాలో ఎనిమిది కిలోమీటర్ల మేర రహదారి ఎండవేడిమికి కరిగిపోయిందని వాహనచోదకులను పోలీసులు హెచ్చరించారు. రహదారి ఉపరితలం మృదువుగా, బంకలా మారిందని తెలిపారు.

ఆటలు, ఇతర బహిరంగ కార్యక్రమాలకు స్వస్తి చెప్పి ఇళ్లకే పరిమితమైపోండి అని విక్టోరియాలో అంబులన్స్ కమాండర్ పాల్ హోల్‌మాన్ ప్రజలను అప్రమత్తం చేశారు. విక్టోరియా, మెల్‌బోర్న్ ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరుకుంది. గ్రేటర్ సిడ్నీ ప్రాంతంలో అది అత్యధికంగా 45 డిగ్రీలకు చేరుకోవచ్చని ఓ అంచనా. ఆస్ట్రేలియాలో వడగాల్పులు, అమెరికా బాంబు తుపాను రెండూ కూడా 1800 సంవత్సరం నాటి నుంచి రెండవ భూగోళ తాప సంవత్సరం దరిదాపులకు చేరుకున్నాయి.

2016 కన్నా 2017 సంవత్సరం 0.1 డిగ్రీల సెల్సియస్ తక్కువ ఉష్ణోగ్రతతో ఆర్కిటిక్‌లో కరిగిపోతున్న మంచు, దావానలాలు లాంటి వాతావరణ మార్పునకు సంకేతాలు ఇచ్చిందని ఐరోపాకు చెందిన కొపర్నికస్ క్లయిమేట్ చేంజ్ సర్వీస్ తన తాజా నివేదికలో పేర్కొంది.



'తుమ్మిళ్ళ'కు శ్రీకారం

• నేడు శంఖుస్థాపన చేయనున్న మంత్రి హరీష్
• రికార్డుసమయంలో పూర్తికానున్న ప్రాజెక్టు
• ఆర్‌డిఎస్ ఆయకట్టుకు ఇక భరోసా



హైదరాబాద్, ఆంధ్రప్రభ: భక్తరామదాసు ఎత్తిపోతల పథక విజయం ఇచ్చిన స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం మరో ఎత్తిపోతల ప్రాజెక్టు తుమ్మిళ్ళకు శ్రీకారం చుట్టింది. సోమవారం రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్ శాఖా మాత్యులు తన్నీరు హరీష్‌రావు ఈ ఎత్తిపోతల పనులకు పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలోని తుమ్మిళ్ళ గ్రామం వద్ద శంఖుస్థాపన చేయనున్నారు. తుంగభద్ర నదీజలాల్లోని రాజోలిబండ మళ్ళింపు పథకం (ఆర్డీఎస్‌కు ఉన్న వాస్తవ నీటివినియోగంలో ఏర్పడుతున్న లోటును పూడ్చడం దీని ఉద్దేశ్యం. ఈ పథకం టెండర్ల ప్రక్రియ ఇప్పటికే ముగియగా, వచ్చే ఖరీఫ్‌కు ప్రాజెక్టును పూర్తిచేసేలా ప్రణాళిక వేశారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు 15.9టిఎంసిల నీటిసరఫరా ఉన్నా 4టిఎంసిలకు మించి వాడడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో 87,500ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా 30వేల ఎకరాలకు కూడా అందడం లేదు. ఈ నేపథ్యంలోనే 55,600ఎకరాలకు సాగునీరు, మార్గమధ్యలోని గ్రామాలకు తాగునీరు ఇచ్చే విధంగా పథకాన్ని ప్రభుత్వం రూపొందించింది. తుంగభద్రపై ఉన్న సుంకేశుల రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌తో ఫోర్‌షేర్‌లో తుమ్మిళ్ల పథకాన్ని రూ.783కోట్ల వ్యయంతో చేపట్టాలని నిర్ణయించింది.

ప్రాజెక్టు ఇలా..

సుంకేశుల బ్యాక్‌వాటర్‌ను తుమ్మిళ్ళ వద్ద ఉన్న పైప్‌లైన్‌ల ద్వారా ఆర్డీఎస్ కాల్వలకు మళ్ళించి అటు నుండి మల్లమ్మకుంట రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు. అక్కడి నుండి మరో మూడు చిన్నపాటి రిజర్వాయర్ల ద్వారా ఆర్డీఎస్ ఆయకట్టు వరకు నీటిని తరలించేలా ప్రణాళిక రచించారు. ఫేజ్-1లో భాగంగా తుంగభద్ర నదీజలాలను తీసుకునేలా అప్రోచ్ ఛానల్, పంప్‌హౌజ్, పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.383కోట్లతో అనుమతినిచ్చారు. ఇందిరాసాగర్ దుమ్ముగూడెంలో వృధాగా ఉన్న పంపులు, పైపులను తుమ్మిళ్ళ పథకానికి ఉపయోగించాలని నిర్ణయించడంతో రూ.162కోట్లతో టెండర్లు పిలిచారు. ఈ టెండర్లు పూర్తవడంతో పాటు మట్టిపనులు ఇప్పటికే మొదలుపెట్టారు. అధికారికంగా సోమవారం మంత్రి హరీష్‌రావు పనులను ప్రారంభించనున్నారు.

పాలమూరు పరిశీలనతో పాటు..

రాష్ట్రనీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు సోమవారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే ఎదుల రిజర్వాయర్ పనులను పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం తుమ్మిళ్ళ వెళ్ళి ఎత్తిపోతలకు శంఖుస్థాపన చేయడంతో పాటు అక్కడ జరిగే బహిరంగసభలో పాల్గొననున్నారు.

పొరుగు రాష్ట్రాల్లో పర్యటించండి


• మార్కెటింగ్ విధానాలపై అధ్యయనం చేయండి
• రాష్ట్ర నీటిపారుదల, మార్కెటింగ్ శాఖా మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పొరుగు రాష్ట్రాల్లో పర్యటించి మెరుగైన మార్కెటింగ్ విదానాలను అధ్యయనం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, మార్కెటింగ్ శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఆదివారం బిఆర్‌కె భవన్‌లోని మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా రాష్ట్రాలలో వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలను రైతులకు ప్రభుత్వాల నుండి లభిస్తున్న కనీస మద్దతు ధరలపై అధ్యయనం చేయాలని సూచించారు. పంటల దిగుబడి, వాటి కొనుగోలు విధివిధానాలను అక్కడ అవలంభిస్తున్న మంచి పద్దతులు పరిశీలించాలన్నారు. మన కూరగాయల విక్రయకేంద్రాలను జిహెచ్ఎంసి సమీకృత మార్కెట్‌లలో అనువైన మెట్రోరైల్వే స్టేషన్‌లలో త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. మొత్తం 330నాబార్డు గోదాములలో మిగిలిన 18గోదాముల నిర్మాణం మార్చి 2018లోగా ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిచేయాలని ఆదేశించారు. మూడవదశలో నిర్మిస్తున్న 34గోదాముల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన గోదాములను సంబంధిత మార్కెట్ కమిటీలకు వెంటనే అప్పగించాలన్నారు. 2018మార్చిలోగా అన్ని పశువుల మార్కెట్లను ప్రత్యేకబృందాల ద్వారా తనిఖీ చేయించాలని ఆదేశించారు. మార్కెట్ ఫీజు వసూలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.సమీక్షలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, సంయుక్త సంచాలకులు లక్ష్మణుడు రవికుమార్ పాల్గొన్నారు.

రజనీ లోగో మాదే

• ముంబై స్టార్టప్ స్పష్టీకరణ • తమిళ సూపర్ స్టార్‌కు లేఖ



న్యూఢిల్లీ: త్వరలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తానంటూ ప్రకటించిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ లోగో ఆపానముద్ర తమ లోగోను పోలి ఉందని ముంబైకి చెందిన వోక్స్‌వెబ్ అనే సోషల్ నెట్‌వర్కింగ్ యాప్ పేర్కొంది. మరో కంపెనీ లేదా బ్రాండ్‌కు అదే లోగో ఉంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ సోషల్ మీడియా, రాజకీయ పార్టీలకు అలా జరిగితే ఆ రెంటి మధ్య ఏదో పెట్టుబడి ఒప్పందం ఉందనే అపోహకు దారి తీస్తుందని వోక్స్‌వెబ్ వ్యవస్థాపకుడు యష్ మిశ్రా తెలిపారు. రజనీకాంత్ నటించిన బాబా చిత్రం 2002లో విడుదలైన నాటి నుంచి ఆయనకు సంబంధించిన ప్రచార ప్రకటనలన్నీ ఆపానముద్రలోనే ఉంటున్నాయి. ఆపాన ముద్రలో తమిళ సూపర్‌స్టార్ రెండు మధ్యవేళ్లను తన బొటనవేలితో కిందకు దించుతారు. అదే సమయంలో చిటికెనవేలు, చూపుడువేలును పైకి లేపి ఉంచుతారు. ఈ మధ్యకాలంలో రజనీకాంత్ తన అభిమానులతో సమావేశాలు నిర్వహించినప్పు డు సైతం వేదిక నేపథ్యంలో ఆపానముద్ర ప్రముఖంగా కనిపించింది. అభిమా నులు సైతం అదే పార్టీ చిహ్నం అన్నట్టుగా దానికి విస్తృత ప్రచారం కల్పిస్తు న్నారు.అయితే వోక్స్‌వెబ్ యాప్ విషయానికి వచ్చేసరికి లోగోలో బొటనవ్రేలు మామూలుగా ఉంటుంది. లోగో వివాదం విషయమై యాప్ నిర్వాహకులు రజనీకాంత్‌కు లేఖ రాశారు.

కేంద్రానికి పార్లమెంటరీ ప్యానల్ అక్షింతలు

• ఉన్నతాధికారుల ఖర్చుల లెక్కలపై ప్రశ్నల వర్షం
• రైల్వే ఉద్యోగుల విలాసాలపై కన్నెర్ర

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ తీరుపై పార్లమెంటరీ ప్యానల్ తీవ్ర అసృంతప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వం చేస్తున్న ఖర్చులకు సకాలంలో అందుబాటులో ఉంచకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ప్రజా సేవ కోసం పనిచేసే ఉన్నతాధికారులకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చులను ఎప్పటికప్పుడు పార్లమెంటరీ ప్యానల్ ముందుంచకపోవడాన్ని తప్పుబట్టింది. ఇక ప్రజా రవాణాలోని లొసుగులు, ప్రభుత్వ ఉద్యోగుల విలాసాలకు తీవ్ర ఆగ్రం వ్యక్తం చేసింది.

ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఖర్చుచేసేదెంత..?

దేశంలోని ఐఏఎస్, ఐపీఎస్ లు సహా ఇతర అధికారుల జీతబత్యాలకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తోందో స్పష్టం చేయాలని అంచనాల కమిటీ ప్రశ్నించింది. ఇటీవల తన నివేదిక ద్వారా అంచనాల కమిటీ పలు విషయాలకు సంబంధించిన వివరాలు తెలిపాలని కేంద్రాన్ని కోరింది. అఖిల భారత సర్వీసుల్లో పని చేసే ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ ల సేవలు దేశాభివృద్ధికి మరింతగా సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలంటే ప్రభుత్వం నుంచి వారికి మెరుగైన సహకారం అవసరమని నొక్కిచెప్పింది. ఉన్నతాధికారుల జీతభత్యాలు, ఇతర ఖర్చులకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవడంపై అంచనాల కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కమిటీకి బీజేపీ సీనియర్ నాయకుడు మరళీ మనోహర్ జోషి నేతృత్వం వహిస్తుండటం గమనార్హం. ప్రతీ ఏడాదిలో మూడునెలలకొకసారైనా ఉన్నతాధికారుల కోసం చేసే ఖర్చుకు సంబంధించిన విషరాలను తమ ముందుంచాలని పార్లమెంటరీ ప్యానల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

లగ్జరీ రైళ్లలో ఉచిత టికెట్లపై స్టాండింగ్ కమిటీ ఆగ్రహం

లగ్జరీ రైళ్లలో ఉచిత టికెట్ల పంపిణీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. విలాసవంతమైన రైళ్లు కేవలం 30 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నప్పటికీ రైల్వే బోర్డు అధికారులు, ఐఆర్సీటీసీ ఉన్నతాధికారులు వందలాది మందికి ఉచిత టికెట్లు సిఫార్సు చేయడాన్ని స్టాండింగ్ కమిటీ ఆక్షేపించింది. ఐదు లగ్జరీ రైళ్లలో ఉచిత ప్రయాణాలకు ప్రభుత్వం పై పడిన ఖర్చును గుర్తు చేస్తూ మండిపడింది. ఒక్కో టికెట్ విలువ 31 వేల నుంచి 51 వేల వరకు ఉండటంతో ఆయా ప్రయాణికులు టికెట్లు కొనకుండా రైల్వేకు భారీగా గండిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేసింది. మహారాజా ఎక్స్ ప్రెస్, గోల్డెన్ ఛారియాట్, రాయల్ రాజస్థాన్ ఆన్ వీల్స్, డెక్కన్ ఒడిస్సీ , ప్యాలెస్ ఆన్ వీల్స్ రైళ్లు లగ్జరీ హోదాలో నడుస్తున్నాయి. వీటిలో కొన్ని టికెట్లను రైల్వే ఉన్నతాధికారులు ఉచితంగా విలాసాలు అనుభవిస్తున్నారు. ఈనేపథ్యంలో స్టాండింగ్ కమిటీ రైల్వే శాఖ, ఐఆర్‌సిటీసీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.మహారాజా ఎక్స్‌ప్రెస్ రైల్ లో 2012-13 సంవత్సరంలో 30 మంది ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించగా.. 2013-14 లో 97 మంది, 2014-15లో 53 మంది,2015-16 లో 73 మందిఉచితంగా ప్రయాణించినట్లు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక
సాహితీగవాక్షం

నోబెల్ కవుల కవితా దృక్పథాలు

ఆమె
ఆమె కాదు
నేను కొక్కోకో అన్నప్పుడల్లా
వద్దు వద్దంటూనే సంసిద్ధతను తెలిపే
ఆమె ఇప్పుడు ఆమె కానే కాదు
మంద్రంగా ప్రవహిస్తున్న కాలం ఒడ్డున
కల చెదిరి బెదిరిన మనుషుల్లా ఇద్దరం

చలి రాత్రి
దుప్పటి కింద అవలీలగా రెప్పలు మూయని
గుర్రపు డెక్కల చప్పుడు లీలలా



సౌకర్యం మెత్త కింద
సర్వైకల్ వేదనతో
యవ్వన స్వప్నాలు గిలగిల్లాడుతున్నయి
సెలయేటి కాలం నీటిలో
తేప తేపకు కండ్లు తుడుచుకుంటూ
కాళ్లు తడుపుకుంటూనే
తుఫానులో చిక్కుకున్నవారిలా ఇరువురం


ఎంత కప్పిపుచ్చుదామన్నా
కాలం గండకీకావ్యంలో
నిజం మరింత శుద్ధి చేసుకుంటుంది
తిండిలేని చదువులేని
కట్టకోను కప్పుకోను బట్టలేని వారు
గ్రామాలను విడిచి జ్ఞాపకాలను విడిచి
నగరాలకు నడిచి వస్తున్న
కలిచివేసే దృశ్యం దహించి వేస్తుంది

ముండ్లు జంట కట్టి గడియారంలో
మంటలు పెడుతుంది
కరుగుతున్నప్పుడు జరుగుతున్నప్పుడు
గర్భనిరోధక మాత్రలు ఎన్ని వాడినా
సూర్య మోహ పరవశంలో పడి
చుట్టూరా తిరిగి చుట్టీరికం చేసి వచ్చింది

వర్షరుతువు
ఆకాశంలోని మెరుపులను ఏరుకొచ్చి
చేతులకు గాజులు తొడుగాలి
వాన దారాలతో
చెట్ల చిలుక పచ్చరంగునద్ది
ఆమెకు చీర కట్టం పెట్టాలి

కాలం నెలత నెల తప్పింది
బారసాల చెయ్యాలి
తొమ్మిది నెలలకు కాదు
పన్నెండు మాసాలకు
కవి అవ్వగారింటికి
పసిద్దకు తీసుకచ్చుకోవాలి.

- జూకంటి జగన్నాథం
9441078095



సల్లీ ప్రుదోమే(1901) | బ్యోర్న్ స్టెర్న్ బోర్సన్(1903) | ఫెడరిక్ మిస్త్రాల్ (1904) | జియోసుయే కార్డుచ్చీ(1905) | రుడ్యార్డ్ కిప్లింగ్ (1907) | జోహన్ లుడ్విగ్ పాల్ హెజె (1910) | రవీంద్రనాథ్ టాగూర్(1913) | కార్ల్ గుస్తఫ్ ఫర్నర్ ఫాన్ హైడెన్స్టమ్(1916)

నోబెల్ కవుల కవితా దృక్పథాలు అన్న అంశమే చాలా విస్తృతమైనది. సాహిత్యానికి నోబెల్ బహుమతి లభించిన వారిలో, కేవలం కవిత్వానికి వచ్చినవారే 37మంది ఉన్నారు. కొందరికి సాహిత్యంలో ఇతర ప్రక్రియలకి వచ్చినా, వారిలో కూడా కవులున్నారు. అయితే వీరంతా ఒకే భాషకు కాని, ఒకే ప్రాంతానికి కానీ చెందినవారు కాదు. ఎక్కువమంది యూరప్‌కి చెందినవారయినా, వివిధ సమయాల్లోని వారు. 1901 నుండి నోబెల్ బహుమతుల ప్రక్రియ కొనసాగుతోంది. మొదలయిన మొదటి సంవత్సరమే కవిత్వానికి, ఫ్రెంచ్ కవి సల్లీ ప్రుదోమేకి ఈ బహుమతి వచ్చింది. అంటే ఇప్పటికే ఒక శతాబ్దం కంటే ఎక్కువే కాలం గడిచిపోయింది.

ఇంత కాలంలో రెండు ప్రపంచ యుద్ధాలతో బాటు, మతయుద్ధాలు, దురాక్రమణలు, ఆధిపత్యాలు, సామ్రాజ్య వాదాలు వాటి పతనాలు, యూదుల ఊచకోత, బానిస వ్యాపారాలు ఒకటేమిటి అనేక అమానవీయ పరిస్థితులు తలెత్తాయి. వాటి ప్రభావాలు అక్కడి కవుల మీద తప్పకుండా ఉంటుంది. అయితే ఆ ప్రభావాలని వారు ఎలా తీసుకున్నారు. ఎలా ప్రతిస్పందించారు అన్నది మాత్రం ఆయా కవుల వ్యక్తిత్వాల మీద, వారిని ప్రభావితం చేసిన కవుల మీద, వారు పెరిగిన లేదా చుట్టూ ఉండే పరిస్థితుల మీద ఒక్కొక్కరికీ ఒక్కొక్కలా ఉండే అవకాశమే ఎక్కువ. అంచేత విభిన్న కాలాల ప్రాంతాల భాషల ఇంతమంది కవుల కవితా దృక్పథాలు తెలుసుకోవడం మన కున్న తక్కువ సమయంలో పూర్తిగా సాధ్యం కాకపోవచ్చు. అయినా సాధ్యమైనంత మేర నేను గ్రహించిన వాటిని మీ ముందు ఉంచే ప్రయత్నం చేస్తాను.

ఇక్కడ ఒక చిక్కుంది. కవిత్వం అనేసరికి, ఇదే కవిత్వం అని, ఇది కవిత్వం కానే కాదని నిర్దిష్టంగా చెప్పడానికి ఎవరైనా వెనకాడతారు. కవులే తాము రాసిన కవిత నిజంగా కవిత అయిందా అని లోలోపల మధనపడతారు. మరీ దగ్గరైన వారితో అది కవిత అయిందా అని సందేహాస్పదంగా అడుగుతారు కూడా. దానిని కొలిచి చెప్పే తూకపురాళ్ళు ఎవరి దగ్గరా ఏవీ లేవు. ఏవో సూత్రాలలో ఇమిడే వస్తువు కాదది. కవిత్వం ఏమిటన్నది తెలుసుకోవడానికి మళ్లీ కవిత్వాన్నే ఆశ్రయిస్తారు కవులు. అది ఒక కవితతో ఆగదు. వారే వివిధ సందర్భాలలో ఒక్కొక్కలా కవిత్వాన్ని నిర్వచిస్తూ కవితలు రాసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రాచీన కవుల దగ్గర నుండి, ఈనాటి కవుల వరకూ కవిత్వం మీద ఒక్క కవితయినా ఉండని కవులు అతి తక్కువమందే ఉంటారు. అది వారిని ఊరిస్తూ ఉంటుంది. నేనేమిటో తెలుసుకో అని ఎప్పటికప్పుడు సవాలు చేస్తూ ఉంటుంది. అది ఎప్పటికీ పూర్తిగా తెలుసుకోలేని రహస్య ప్రక్రియలా వారికి మిగిలిపోతూ ఉంటుంది. అయినా వారు కవిత్వాలు రాస్తూనే ఉంటారు. రాయకుండా ఉండలేరు. నోబెల్ కవులకు కూడా అది వర్తిస్తుంది. అంచేత ముందు నుంచీ పూర్తిగా ఇదే తమ కవిత్వమని ఎక్కడా వారు కూడా చెప్పుకున్నట్టు కనపడదు.

ఇకపోతే దృక్పథాలు తెలుసుకునేందుకు పనికొచ్చే సాధనాలు కూడా ఎన్నో ఉన్నాయి. నా వరకూ నేను నోబెల్ కవుల కవిత్వ దృక్పథాలు తెలుసుకుందుకు ఒక నాలిగింటిని మాత్రం వాడుకున్నాను. 1. కవులు వారికి వారే చెప్పుకున్న తమ కవిత్వ దృక్పథాలు 2. ఆయా కవుల కవిత్వాల మీద ఇతరుల దృక్పథాలు 3. ఆయా కవుల కవితల్లో ప్రత్యక్షంగా గాని లేదా పరోక్షంగా గాని కనిపించే దృక్పథాలు లేదా 4. ఆయా కవుల మీద పరిస్థితుల మూలంగా మారుతూ వచ్చిన దృక్పథాలు. ఆ పద్ధతుల వారిగా చెప్పడం కంటే ఆ పద్ధతుల మూలంగా తెలుసుకున్న ఒకొక్కరి సారాంశాలు మాత్రం మీ ముందు ఉంచుతున్నాను.

విఫలప్రేమ, ఆదర్శవాదం, వైయక్తిక ఉదాత్త భావాలు, ఆంతరంగిక అనుభూతులు, నైతిక మానసిక ఒత్తిడులు, ఆలోచనల అగాధాలు ఇవన్నీ 1901లోని నోబెల్ ప్రప్రథమ కవి సల్లీ ప్రుదోమే అద్భుత కవిత్వానికి వారి బుద్ధి మనస్సుల అరుదైన సమ్మేళనానికి కారకాలయాయి.

ప్రగతి మార్గంలో ఎరుకకి అంతఃశ్చేతనకి మధ్య ఊహ బలంగా పనిచేస్తుంది. మానవ వికాసం కోసం, నిరాటంకమైన శక్తేదో వారిని ముందుకు తోస్తుందని, రచయిత ఎంతయితే ఆధ్యాత్మికస్వేచ్ఛ కోసం ప్రాకులాడతాడో, అంత నిగూఢంలోకి జారిపోతాడన్న ఎరుకతో తన కవిత్వం సాగిందని, నార్వేకి చెందిన బ్యోర్న్ స్టెర్న్ బోర్స్బన్ (1903లో నోబెల్) స్వయంగా చెప్పుకున్నాడు. అంతేకాదు. ఒక బాధ్యతగల విధేయుడిగా, ఉత్సాహపరుడిగా ఒక రచయిత ఒక కళాకారుడు ఊరేగింపులో ముందుండి, తన వెనకనున్న వారిని నడపాల్సిన తన బాధ్యతల్ని నెరవేర్చాలి అని కూడా భావించాడు.

ప్రాంతీయ భాషకు పట్టం కట్టిన, ఫ్రెంచికి చెందిన ఫ్రెడెరిక్ మిస్త్రాల్ (1904లో నోబెల్) తన ప్రాంతాన్ని కీర్తిస్తూ కట్టిన గొప్ప కట్టడాలు అతని కవిత్వం, వారి ప్రాంతీయత సూర్యుడి వెలుగులా అన్ని దేశాలకీ పాకింది. ప్రకృతే అన్నింటికీ ఆధారం. ఆత్మవిచారణ కాదు. మనిషిని కూడా ప్రకృతి సంతానంగా భావిస్తాడాయన. దానినే తనదైన తాజాతనం, నిజమైన స్ఫూర్తి, తన ప్రజల మూలశక్తిని, సహజమైన రమణీయకంతో కావ్యోత్పత్తి చేసేందుకు అతనికి తోడ్పడింది. గ్రీకు లాటిన్ ఇటలీ కవుల ప్రభావంతో సృజనాత్మక సామర్థ్యం, తాజాశైలి, లయాత్మక శక్తి లక్షణాలుగా ఉన్న కవిత్వాన్ని గణతంత్రవాది ఇటలీ దేశస్తుడు జియోసుయే కార్డుచ్చీ (1905లో నోబెల్) సాధించారు.

జీవితమే అతనికి ప్రేరణతో బొంబాయిలో జన్మించిన బ్రిటీషు నాగరికుడు రుడ్యార్డ్ కిప్లింగ్ (1907లో నోబెల్), రచనల్లో మూడు ప్రధాన భాగాలు. 1. వ్యంగం, 2. కరుణ మానవీయత 3. నీతి, దేవుడి పట్ల నమ్మకం, పిలుపొస్తే దేవుడి దగ్గరికి సైనికుడిలా వెళ్లాలనే బలమైన నమ్మకం ఉన్నవాడు. ఫలితంగా అతని పరిశీలనలోని శక్తి, ఊహలోని మూలం, భావంలోని బలం, అద్భుతంగా వివరించేప్రతిభ, అతని కవిత్వాన్ని నడిపించాయి.

లయాత్మక కవిత్వంతో ఏది రాసినా లోకంలో అంతా మంచే జరుగుతోంది. చీకటి కోణాలే జీవితంలో లేవన్నట్టు గురువుకు గురువుగా భావించబడే జర్మనీకి చెందిన జోహన్ లుడ్విగ్ పాల్ హెజె (1910లో నోబెల్) రాసేవారు. చీకటి ఉన్నా చీకటిలో వెలుగు ఇంకా స్పష్టమవాలి కదా అన్న మనస్తత్వం వీరిది. సత్యానికి, సౌందర్యానికి, ప్రేమకి, ప్రకృతికి వీరెక్కువ ప్రాముఖ్యతనిచ్చారు. సౌందర్యాత్మక నైపుణ్యానికి, ఆదర్శవాద వ్యాప్తికి తన కవిత్వాన్ని వేదికగా చేసుకున్నారు.

ఆసియా ఖండంలోనే తొలి నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ టాగూరు (1913లో నోబెల్) కవిత్వ పునాదులు, సాంప్రదాయ భారతీయ కవిత్వం మీదున్నాయి. మొదట్లో రామాప్రసాద్, కబీరు లాంటి భక్తి కవుల ప్రభావం, తరువాత ప్రియతముడితో కలవాలన్న ప్రగాఢ కాంక్షతో సాగే బెంగాలీ జానపద బౌల్, భతియాలి సాంప్రదాయం వీరిమీద విశేషంగా ప్రభావం చూపాయి. ఫలితంగా వీరి కవిత్వం మార్మికత వేపు ఎక్కువ మొగ్గింది. ''నిశ్శబ్ద స్వరం నా పదాల్ని స్పృశించినపుడే/ అతనెవరో నాకు తెలుసు, అందుచేత నన్ను నాకూ తెలుసు'' అని చెప్పుకోగలిగాడు. ప్రకృతి ఐక్యత టాగూరు కవిత్వంలోని అంతర్భాగమైపోయింది. పిల్లలు కూడా ప్రకృతిలో భాగమే వీరికి. సూటిగా దేవుడు అని చెప్పకుండా, అనేక విధాలుగా రాజు, ప్రభువు, గురువు, తండ్రి, స్నేహితుడు, కవి, ప్రేమికుడు ఇలా చెప్పేవారు. వీరికి దేవుడంటే కార్మికుడు. అతన్ని ప్రేమిస్తే మనం కూడా అతనితోబాటు శ్రమించాలి. **"నిద్రపోయి కలగన్నాను, జీవితమంతా సంతోషం అని/లేచి చూస్తే జీవితమంటే సేవ/సేవచేసి తెలుసుకున్నాను, సేవే సంతోషమని"** అలా వీరి కవిత్వంలో అనేక దశలున్నాయి. ఆఖరు దశలో అనారోగ్యం పాలయినపుడు, మృత్యువు అమరత్వం వీరిని ఎక్కువ బాధించేవి,మృత్యువూ జీవితమూ కలగలిసి ఒకే మూట వీరికి. మనిషి అనంత విశ్వంలో ఒక అణువు మాత్రమే.

ఆత్మలోకంలోకి ప్రయాణం చేసే స్వీడన్‌కి చెందిన కార్ల్ గుస్తఫ్ ఫర్నర్ ఫాన్ హైడెన్స్టమ్ (1916లో నోబెల్) ఏకాంతంలో మనిషి తనను తాను తెలుసుకోగలుగుతాడని, ప్రేమ వారిని కలిపే బంధనమని, సృజనాత్మక సాధుత్వం ప్రపంచాన్ని నిర్మిస్తుందని, విశ్వసిస్తాడు. జీవితాన్ని తెలుసుకునేందుకు జీవితంతో పోరాడాలనే మనస్తత్వం, కాల్పనికుడు, అంత కంటే ఎక్కువగా జీవవేత్త, నిరాశకి, విధేయతకి, పొరుగు వారి అనుకరణకి అతీతంగా, మన ఆత్మలోకి మనం తొంగి చూసుకుని సృష్టిచేద్దాం అని చూస్తాడు. ప్రకృతి దృశ్యాల మధ్య నిశ్శబ్దమైన ఇంట్లో, పూర్తిగా ధ్యానసహితమైన జీవితం గడపటం ఇష్టపడే ఇతను తాను చెప్పదలచుకున్నదాన్ని దృశ్యమానం చేసే శక్తి వీరి కవితలన్నింటా కనిపిస్తుంది.

ఆకర్షించే కల్పనాశక్తితో డేనిష్ కవి కార్ల్ఏడాల్ఫ్ జెలెరప్ (1917లో నోబెల్) మతాలకు అతీతంగా ఉండాలన్న నేపథ్యం ఉన్నా బౌద్ధం, మరికొన్ని మతాల పట్ల ఆకర్షితులయ్యారు. వాటి ప్రభావంతో ఉన్నతమైన ఆశయాలతో, వైవిధ్యం, సుసంపన్నంతో ఉండే కవిత్వం రాయగలిగిన కవి అయ్యారు.

స్విస్ కవి కార్ల్ ఫ్రెడెరిక్ జార్జ్ స్పిటెలెర్ (1919లో నోబెల్) కవిత్వం నిరాశావాదంతోను, వీరోచిత గాథలతోను నిండి ఉంటుంది. మతం, ఊహ, పౌరాణికాల మీద వీరి కవిత్వం ఎక్కువగా వచ్చింది..

ఐరిష్ కవి విలియం బటలర్ ఏట్స్ (1923లో నోబెల్) మార్మిక భావాలు, కాల్పనికత, అతీతశక్తులు, రహస్యాలు తాంత్రికమైన వాటివేపు, ఎప్పుడూ ఆసక్తి చూపేవారు. ఐరిష్ జానపదాలు, పౌరాణికాల ప్రభావం కూడా ఎక్కువే. అత్యంత కళాత్మక పద్ధతిలో, దేశ సంపూర్ణ మూలశక్తిని ప్రతిబింబించే, ప్రేరణాత్మక కవిత్వం వీరిది.

ఒకే ఒక్కసారి మరణానంతరం నోబెల్ పొందిన స్వీడన్‌కి చెందిన ఎరిక్ కార్ల్‌ఫెల్ట్ (1931లో నోబెల్) ప్రకృతిని పరవశించి పాడే జాతీయ సాంప్రదాయ ఉన్న కవి. అప్పటి కాలానుగుణ్యమైన వస్తువునే తీసుకున్నా, అందులో వీరి అనుభవాలు, విశ్వజనీనమై ప్రతిబింబించాయి. వీరి కవిత్వం తాత్విక భూమికతో ముందుచూపున్న కల్పనాశక్తితో ఉద్వేగభరితం, ఆత్మజ్ఞానం, సౌందర్యాన్వేషణతో సాగింది.

రైతు జీవితం ఇతివృత్తంతో కోల్పోయిన రష్యా ఆత్మని అత్యంత ప్రతిభావంతంగా రష్యా సాహిత్యంలో పదిలపరచిన ఇవాన్ అలెక్సవిచ్ బునిన్ (1933లో నోబెల్), ప్రసిద్ధ సూఫీ గురువు, సాదీ చెప్పిన 'ప్రపంచాన్ని చూడు నీ ఆత్మ అచ్చులు దానిమీద వదులు' అన్నవి అతన్ని ప్రభావితం చేసాయన్నారు. తత్త్వం, మతం, అక్టోబరు విప్లవం లాంటి చరిత్రి మూలంగా వచ్చే చిక్కులు అతన్ని ఆలోచింపజేసేవి. అవే అతని కవిత్వానికి పునాదులు. అరుదయిన ఊహాశాలితతో డెన్మార్కు వాసి యెహానెస్ విల్ హెల్మ్ జేన్సెన్ (1944లో నోబెల్) సరళంగా, సున్నితంగా అర్థమయ్యే రీతిలో చెప్పే పద్ధతిని అవలంబించి, జిజ్ఞాసతోకూడిన, అరుదైన సాహసం శక్తివంతం సారవంతమైన సృజనాత్మక నవ్య కవిత్వం వీరిది.

''శరీరానికి ఆత్మ ఎలాగో, తన ప్రజలకు కళాకారుడు అలానే''అని బలంగా భావించే చిలీకి చెందిన మొదటి నోబెల్ కవయిత్రి గబ్రియేలా మిస్త్రాల్ (1945లో నోబెల్)కు బాల్యం, ప్రేమ, ప్రకృతి, క్రైస్తవ మత నమ్మకం, మరణం, పునర్జన్మ, ఎక్కువగా కవితా వస్తువులయ్యాయి. బలీయమైన మానసిక ఉద్వేగంతో ప్రేరితమైన వీరి గేయకవితలు, సమస్త లాటిన్ అమెరికా ప్రపంచపు ఆదర్శ అభిలాషల చిహ్నాంగా భావిస్తారు. ఆమె తన కవిత్వంలో ఆ దేశ ప్రజల పట్ల శాశ్వత నిబద్ధతని తెలియజేస్తుంది.

బహుముఖీన కృషీవలుడు వలస ఒక ముఖ్యభూమికగా చేసుకున్న, అమెరికాలో పుట్టి ఇంగ్లాండ్‌లో స్థిరపడ్డ థామస్ స్టెర్న్స్ ఎలియట్ (టి.ఎస్.ఎలియట్) (1948లో నోబెల్)కు కవిత్వం పట్ల కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలున్నాయి. తాను వాటిని నమ్మడమే కాదు కవులకు పనికొస్తాయని చెప్పినవాడు కూడా. ''ఒక కవిత రకరకాల పాఠకులకు చాలా రకాలుగా కనిపించొచ్చు. అవన్నీ రచయిత తాననుకున్న దానికి భిన్నంగా ఉండి ఉండొచ్చు. ఉదాహరణకి రచయిత తన అసాధారణమైన వ్యక్తిగత అనుభవాన్ని, బయటవాటితో ఏ విధమైన సంబంధం లేని వాటి గురించి రాస్తున్నా పాఠకుడికి ఆ కవిత సాధారణ పరిస్థితినే సూచిస్తూ, తన వ్యక్తిగతమైనదే అనిపించొచ్చు. పాఠకుడి వ్యాఖ్యానం రచయితకంటే, భిన్నంగానో, సమానంగానో, మరింత బాగానో కూడా ఉండొచ్చు. రచయితకు కూడా తెలియనివి బహుశా కవిత చెప్తూ ఉండొచ్చు. వివిధ వ్యాఖ్యానాలన్నీ పాక్షికంగా ఒకే విషయాన్ని సూత్రీకరించొచ్చు. కవితలో అస్పష్టతలన్నీ, బహుశా మామూలుగా మాటాడుతూ చెప్పలేని ఎన్నో విషయాల్ని తక్కువ కాకుండా, ఎక్కువే చేసి చెబుతాయి''అని ఆయనే చెప్పుకున్నారు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- ముకుంద రామారావు
9908347273



కార్ల్ఎడాల్ఫ్ జెలెరప్(1917) | జార్జ్ స్పిటెలెర్(1919) | విలియం బటలర్ ఏట్స్(1923) | ఎరిక్ కార్ల్‌ఫెల్ట్ (1931) | ఇవాన్ అలెక్సవిచ్ బునిన్ (1933) | విల్ హెల్మ్ జేన్సెన్ (1944) | గబ్రియేలా మిస్త్రాల్ (1945) | థామస్ స్టెర్న్స్ ఎలియట్ (1948)

ఆధునిక కవిత్వంలో అభివ్యక్తి నవ్యత

కవిత్వం-డిక్షన్-19

అభివ్యక్తిని ఆంగ్లంలో expressionఅంటారు. ఆధునిక కవిత్వంలో అభివ్యక్తి నవ్యత కవిత్వంలో కొత్త dictionకు దారి తీస్తుంది. కాలం మారే కొద్ది మనుషుల జీవన విధానాలు మారినట్టే కవిత్వంలో అభివ్యక్తి మారుతుంది. అలా మార్పు లేకుండా మక్కికి మక్కి అన్నట్టు కొత్త కవులు, పాతకవుల కవితాశైలిని అనుకరించి రాస్తే ప్రయోజనం ఉండదు. ఏ.కె. శివారెడ్డి styleనో లేక ఎన్.గోపి dictionనో అనుకరించి కవితా నిర్మాణం చేపడితే అనుకరణ కవులు అవుతారే తప్ప అసలైన సొంత అస్తిత్వమున్న, సొంత గొంతుకున్న కవులు కాలేరు. అందుకే కవితా నిర్మాణం చేపట్టే ముందు యువకవులు poetic devicesలోనిclinche formulaగురించి తెలుసుకోవాలి. అంటే ఇది పాత చింతకాయపచ్చడి భలే రుచిగా ఉంటుందని చెప్పే సంప్రదాయ కవితా మార్గం అన్నమాట. అలా కాకుండా .. కవితలో అభివ్యక్తి సమతుల్యతను పాటించాలంటే...

1. ప్రతి కవి తను మొదట రాసిన డ్రాఫ్టును ఎడిట్ చేసుకోవాలి.

2. ఒకేసారి కవితను రాసి..నిర్మాణం బాగుందను కోరాదు.

3. శీర్షికల్లో కొత్తదనం ఉందో లేదో చూసుకోవాలి. ఇప్పటికీ 'తోట', 'మరణం' 'యుద్ధం' లాంటి శీర్షికలు పెట్టడం.. పాతpoetic dictionఅని గుర్తించాలి.

4. జాతీయాలు, నానుడులు, పలుకుబళ్ళను, ప్రతీకలను అధికంగా వాడరాదు.

5. కవితా సంపుటాలకు ముందు మాటలు అవసరమే. కవి కప్పి చెబితే...విమర్శకులు...సమీక్షకులు విప్పి చెప్పాలి. poetic devicesలో క్లిక్ అన్నది కవిత్వ అభివ్యక్తిలో traditional form. ఇది పదాలలో, ఆలోచనలలో, ఆవేశాలలో gesturesలో స్పష్టంగా కనిపిస్తోంది. మన కవులంతా దీన్నే అనుసరిస్తున్నారు. ఉదాహరణకు పెళ్లిల్లు, కోర్టులు, జన్మదినాలు, పండుగలు తదితర సందర్భాల్లో రాసే కవిత్వంలో కొత్త పదాలు, శైలి, అభివ్యక్తి, ప్రతీకలు పాతవే పదేపదే తమ కవితల్లో రిపీట్ చేస్తుంటారు. దీంతో కవితలు బోర్ కొట్టిస్తాయి. కవిత్వంలో అనేకమంది పూర్వకవులు వాడిన పదాలను, ప్రతీకలను, ఇమేజెస్‌లను, ఇమేజరీని, మెటాఫర్లను, similesను మళ్లీ మళ్లీ వాడితే అభివ్యక్తిలో కొత్తదనం ఏముంటుంది? సోషియల్ లైఫ్‌లో పదే పదే వాడిన భాష...కవిత్వంలో వాడితే originality పోతుంది.Social interaction, communicationలో కొత్త అభివ్యక్తులు ఉన్నట్టే కవిత్వంలోనూ ఉండాలి. ఇటీవల కొంతమంది కొత్తగా కవిత్వం రాస్తున్న కవుల్లో కొత్త అభివ్యక్తితో మిసమిసలాడే కవితలు చూశాను. ఆయా రుతువుల్లో మనసు ఎలా ఉంటుందో శిరీష రాసిన కవితలో కొత్త అభివ్యక్తి కనిపించింది.

మనసును అన్ని రంగుల్లో ముంచేసి
మల్లెలా తేల్చే ఆనందంలో ఉన్నపుడు
నేను ఇంద్రధనుస్సులా విరిసే వసంతానవుతాను..

అంటూ..వసంతాన్ని ముందుగానే ఇంద్రధనుసుతో ఉపమింపచేసి, కొత్తexpressionసాధించింది కవయిత్రి. ఒక ఆలోచనను అనుభూతిని, భావావేశాన్ని, అందమైన భాషలో చెప్పడం కవితలోని అభివ్యక్తి నవ్యతకు కారణమవుతుంది. సిరికి స్వామినాయుడు రైతు కష్టాల గురించి రాస్తూ...

కరువును సృష్టించి...కన్నీరు మిగిల్చి
ఒక జీవన విధ్వంసానికి
ఆనవాళ్ళుగా మనల్ని జేసి
దగా జేసింది రాజ్యం
నా సముద్రం నీకళ్ళలో
నీ ఎడారి నా బతుకులో
ఒక శోకమే మనల్ని ఏకం చేసింది
ఎడారి సముద్రం మీద ఇద్దరం- తీరం చేరని పడవలమే.

పై కవిత చివరి పాదాల్లో కొత్తexpressionఉంది. అది అద్భుతమనిపించేలా ఉంది. ఇది ఇమిటేట్ చేస్తే వచ్చేది కాదు. అయితే ఇలాంటి కవితలు, కవులు ఒక catharsisతో రాస్తారు. catharsis is an emotional dischargeఅని గ్రీకు లాక్షణికుల అభిప్రాయం. అరిస్టాటిల్ tragedy గొప్పదనం చెప్పడానికి దీన్ని ఉపయోగించాడు. **'నా సముద్రం నీ కళ్లలో...నీ ఎడారి నా బతుకులో..ఒక శోకమే మనల్ని ఏకం చేసింది'** అనడం లోని అంతరార్థం అదే వస్తువును భావచిత్రంలో చూపించే విధానంలోని అభివ్యక్తి మెరుపులే కవిలోని సొంత గొంతు కేమిటో తెలియజేస్తాయి.

సోమవరపు రఘుబాబు అన్న కవి...
ఆత్మీయుల మధ్య అందంగా గడిపే జీవితం
ఉద్యానవనంలో విచ్చుకున్న
గులాబీ లాంటిది

అంటూ ఎంతో సునాయాసంగా కవితను రాసి అభివ్యక్తి నవ్యతను సాధించాడు. అయితే దీనికి మంచి imagery కావాలి. కవితా నిర్మాణంలో emotional shades ఉండేలా చూసుకోవాలి. Figurative language ఉపయోగించాలి. కవితలో నిర్మాణ నైపుణ్యాలతో పాటు expressionలో కొత్తదనం ఉన్నప్పుడే రీడర్స్‌కు heart touchingలా అనిపిస్తుంది. అయితే కొన్ని రకాల poemsలో అభివ్యక్తి ఒకేలా ఉండదు. అందుకే కొందరు.. అనేకరకాల poemsను ప్రాక్టీస్ చేస్తుంటారు. ఉదాహరణకు...

1. హైకూ: మూడు unrhymed పాదాలున్న కవితను హైకూ అంటారు. దీంట్లో అభివ్యక్తి కొత్తగా ఉంటుంది.

2. సానెట్: ఇది 14 పాదాలున్న లిరికల్ poem. ప్రేమ విరహం.. అధిక్షేపం లాంటి భావాల అభివ్యక్తికి షేక్స్పియర్ లాంటి కవులు వాడిన పాత నిర్మాణం.

3. అలెర్జీ: మరణం గురించి రాసే స్మృతి కవిత...ఇది దాదాపు అందరు కవులు రాశారు.

4. epitaph: ఇది మరీ చిన్న కవిత. ఇలాంటి వాటిని చూస్తే ఏకవాక్య కవితలు పుట్టుకొచ్చాయేమో. రేపు ఏకాక్షర కవిత కూడా రావచ్చు.

5. limerick: ఐదు వాక్యాలలో (lines) ఉండే humorous poem. ఇందులో అభివ్యక్తి satiricalగా ఉంటుంది.

6. free verse: రైమింగ్‌లేని పాదాలున్న వచన కవిత..



ఇప్పుడు ప్రపంచంలో ఎక్కువమంది కవులు ఉపయోగించే అభివ్యక్తి వైవిధ్యపూరిత కవితా నిర్మాణ పద్ధతి ఉన్న పద్ధతైన వచన కవిత ఇది.

ఇంకా రెక్కలు, నానీలు, వ్యంజకాలని...ఎన్నో కవి తలు వచ్చాయి. ఇవన్నీ అభివ్యక్తి నవ్యతతో వచ్చి పాఠకులను అలరించాయి. ఎవరికి తోచిన కవితా నిర్మాణాలను వారు ఉపయోగించుకుని కవితా సంపుటాలు వెలువరించారు. అయితే ఆయా కవితా సంపుటాలలో మేధావి కవులు forewordరాస్తూ ఆయా కవితా ప్రక్రియలు గొప్పవని తెగపొగిడేసుకున్నారు. అలాగే కొత్తమార్గం తొక్కిన కవులు prefaceలో వారి కవితా రీతులను సమర్థించుకుని తృప్తిపడ్డారు. అన్ని కవితా రీతులున్నా...అందులో కవుల అభివ్యక్తి... ఆధునికంగా... లేకపోతే కవితల్లో, నిర్మాణ పద్ధతుల్లో, భావాభివ్యక్తిలో కొత్తదనం కనిపించకపోతే... అలాంటి కవిత్వం ఎన్ని సంపుటాలు వేసుకున్నా వ్యర్థమే. కనుక కొత్త కవులు ఈ విష యాలన్ని గమనించి అభివ్యక్తి నవ్యత కోసం విస్తృతంగా వెల్లువలా వచ్చి పడుతున్న ఆధునిక కవిత్వాన్ని బాగా చదవాలి. అప్పుడే అభివ్యక్తిలో (Expression)లో నవ్యత సాధిస్తారు.

- బిక్కి కృష్ణ
8374439053

సాహిత్య వార్తలు

కవిసంధ్య-పానుగంటి కవితల పోటీ

21మార్చి 2018 అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవిసంధ్య కవిత్వపత్రిక "కవిసంధ్య పానుగంటి కవితల పోటీ"ని నిర్వహిస్తుంది. ఈ పోటీలో పాల్గొనడానికి కవులు ఎంట్రీ ఫీజుగా 200రూ.లు మనియార్డరు/డ్రాఫ్టులేదా నేరుగా బ్యాంకు ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఎంట్రీఫీజు చెల్లించిన వివరాలను కవితలతో పాటు జతపరచాలి. మొదట బహుమతి 3000/-, రెండవ బహుమతి 2000/-, మూడవ బహుమతి 1000/- అయిదు మంచి కవితలకు రూ.500/- చొప్పున ప్రోత్సాహక బహుతులు ఉంటాయి. కవితలు పంపాల్సిన చివరి తేదీ. 20 ఫిబ్రవరి 2018, పంపాల్సిన చిరునామా: దాట్ల దేవదానం రాజు, జక్రియానగర్, యానాం, 533464. వివరాలకు :9440105987

అలిశెట్టి పురస్కారానికి "బూర్ల" ఎంపిక

తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారికి ప్రదానం చేస్తున్న విప్లవ కవి అలిశెట్టి ప్రభాకర్ స్మారక సాహిత్య పురస్కారానికి ఈ యేడు బూర్ల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఈ నెల12న కూకట్ల తిరుపతి అధ్యక్షతన జరిగే నిజాం వెంకటేశం, గాజోజు నాగభూషణం, నగునూరి శేఖర్ తదితరులు పాల్గొంటారు.

- కూకట్ల తిరుపతి, అధ్యక్షులు తెరవే కరీంనగర్
9949247591

రచనలకు ఆహ్వానం

సాహితీగవాక్షం పేజీకి సమకాలీన సాహిత్యంపై మీ అభిప్రాయాలను, రచనలను ఆహ్వానిస్తున్నాం. మీ రచనలుsahithigavaksham@gmail. com పంపగలరు.

చిరునామా: ఎడిటర్, ఆంధ్రప్రభ, సాహితీ గవాక్షం పేజీ, రోడ్ నెం. 9, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, హైదరాబాద్ -500033

నకిలీ విదేశీ మద్యం పట్టివేత

● బస్సు, 3 ద్విచక్ర వాహనాలు, 220 సీసాలు స్వాధీనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నాలుగు సంవత్సరాలుగా జంట నగరాల్లో నకిలీ విదేశీ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్న ధూల్‌పేటకు చెందిన హరీష్‌సింగ్, అతని ముఠా సభ్యులు ఆరుగురిని ఎక్సైజ్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ దాడులలో సుంకం చెల్లించని 220 నకిలీ విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక ట్రావెల్ బస్సు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనపర్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ ఆదేశాల మేరకు స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఏపీఈఎస్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌టీఎఫ్ టీం 8, ఎస్‌హెచ్‌వో, మలక్‌పేట, ఎస్‌హెచ్‌వో కుత్బుల్లాపూర్ సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. చెన్నై నుండి సముద్ర మార్గం నుండి స్మగ్లింగ్ చేసి తీసుకువచ్చి వివిధ ట్రావెలింగ్ బస్సుల ద్వారా జంటనగరాలకు ఈ ముఠా సరఫరా చేస్తోంది. నిందితులు హరీష్‌సింగ్, రాజేష్, కకాని భాస్కర్, గోపికృష్ణ, గంజి అనిల్‌కుమార్, నిరంజన్‌రెడ్డి, దాసరి మహేష్ మిసోర్. ప్రధాన సరఫరాదారులుగా కార్తీక్, మాండిక్, నరేష్‌లుగా గుర్తించారు.

విదేశీ మద్యం కొంటే పదేళ్ల జైలు: అకున్ సబర్వాల్

విదేశీ మద్యం కొన్నవారికి మూడు నుంచి పదేళ్ల జైలు శిక్షపడుతుందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ హెచ్చరించారు. విదేశీ మద్యాన్ని ఎవరూ కొనవద్దని ప్రజలకు సూచించారు. విదేశీ మద్యం, డ్రగ్స్, గంజాయిలను ట్రావెలింగ్ బస్సులలో సరఫరా చేస్తే ఆ బస్సులను ఎక్సైజ్ శాఖ స్వాధీనపర్చుకుంటుందన్నారు.

డ్రగ్స్ కేసుల్లో త్వరలో చార్జిషీట్

డ్రగ్స్ కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని, త్వరలోనే చార్జీషీట్‌ను దాఖలు చేస్తామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ స్పష్టం చేశారు. కేసు దర్యాప్తులో ఏ మాత్రం వెనక్కు తగ్గలేదన్నారు. డ్రగ్స్ సరఫరాలో కీలక వ్యక్తులు విదేశాలకు చెందిన వారు కాబట్టి వారి విషయంలో కొంత జాప్యం జరుగుతోందన్నారు. ప్రాథమికంగా సేకరించిన సమాచారం, ఆధారాలను పరిశీలించిన తర్వాత కీలక సమాచారం రాబట్టడం జరిగిందని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను కోర్టుకు వివరిస్తూ త్వరలోనే చార్జీషీట్‌ను దాఖలు చేయబోతున్నామన్నారు. కెల్విన్ లాంటి కీలక వ్యక్తులకు బెయిల్ లభించడంపై స్పందిస్తూ బెయిల్‌పై విడుదలైనంత మాత్రాన నిర్దోషులు కారని, కేసు విచారణ తర్వాత నేరం చేశారా? లేదా అనేది తేలుతుందన్నారు.

పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య



వీపనగండ్ల, ప్రభ న్యూస్ : కుటుంబ కలహాలతో ఇద్దరు కూతుళ్లను బావిలో తోసి తల్లి కూడా బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలం గోపల్‌దిన్నె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. భార్యభర్తలు, అత్తమామలు ఆస్తుల పంపకాల విషయంలో తరచుగా గొడవపడేవారని తెలిపారు. చివరకు గొడవలను భరించలేక మనస్తాపానికి గురైన జనన్ కుమార్ భార్య రోజా (26), వందన (5), లాహ్య (2) ఆదివారం గ్రామ సమీపంలో ఉన్న బావి దగ్గరకు వెళ్లి కూతుళ్లను బావిలో తోసి తాను ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. మృతురాలు గోపల్‌దిన్నె రంగవరం గ్రామానికి చెందిన రోజా 7 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిచంద్రప్రసాద్ తెలిపారు.

కిట్టీ పార్టీకెళ్లొస్తూ...

జూబ్లీహిల్స్‌లో స్కూటీని ఢీకొన్న కారు

● యువతి దుర్మరణం ● మరొకరి పరిస్థితి విషమం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10లో ఆదివారం వేకువజామున ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పంజాగుట్టకు చెందిన విష్ణువర్ధన్ అనే వ్యక్తి తప్పతాగిన మైకంలో అతి వేగంతో కారును నడుపుతూ స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న శ్రీనగర్ కాలనీకి చెందిన మస్తానీ అనే యువతి అక్కడికక్కడే మృతి చెందింది. మస్తానా తన స్నేహితురాళ్లను స్కూటీపై ఇంటికి తీసుకువెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. స్కూటీ వెనక సీట్లో కూర్చున్న అనూషతో పాటు మరో యువతికి తీవ్రగాయాలయ్యాయి. మద్యం తాగి కారు నడిపిన విష్ణువర్ధన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ఘటనలో గాయపడ్డ అనూష పరిస్థితి విషమంగా ఉందని, ఆమె బ్రెయిన్‌డెడ్‌కు గురైందని వైద్యులు చెబుతున్నారు.

మగువలు మందేస్తున్నారు..

ఇదిలా ఉండగా మగువలు మందేస్తున్నారు. వీకెండ్ సందర్భంగా పోలీసుల తనిఖీల్లో పురుషులతో సమాన స్థాయిలో మహిళలు కూడా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కుబడుతుండటం గమనార్హం. ఈ క్రమంలో వారు బ్రీత్ ఎన్‌లైజర్ టెస్టుకు సైతం నిరాకరిస్తున్నారు. పోలీసులను ముప్పతిప్పలు పెడుతున్నారు. శనివారం అర్ధరాత్రి పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురు యువకులు డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడటం విశేషం.

తెలుగు రాష్ట్రాల్లో కోడిపందేల జోరు

● హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో పందేల నిర్వహణ

● 20 కోళ్లు, 29 మంది అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పర్వదినాలు ప్రారంభ సందర్భంలో కోడిపందేలు నిర్వహిస్తుండటం ఆనవాయితీ. కోడిపందేల నిర్వహణకు అనుమతి లేకున్నా నిర్వహించడంలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఆయా రాష్ట్రాలలో పలు జిల్లాల్లో కోడి పందేల నిర్వహణకు పలువురు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పందెంకోళ్లను సిద్ధం చేస్తున్నారు. దాదాపుగా లక్షల్లో ఈ మారు కోడి పందేలు జరగవచ్చునే ప్రచారం ఊపందుకుంటోంది. ఈ నేపథ్యంలో కోడిపందేలు నిర్వహించకుండా ఇరు తెలుగు రాష్ట్రాల పోలీసులు సన్నద్ధులయ్యారు. కోడి పందేలు నిర్వహిస్తే సహించేది లేదన్న హెచ్చరికలను సైతం ఇప్పటికే జారీ చేశాయి. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కోడి పందేల నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో ప్రముఖులు ఎక్కువగా నివసించే జూబ్లీహిల్స్‌లోనూ కోడిపందేలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కోడిపందేల స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించి 20 పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నారు. 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 25 సెల్‌ఫోన్లు, రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఇక విదేశీ మద్యం స్టోర్లు!

● అబ్కారీ శాఖ పరిశీలన ● బడ్జెట్ అంచనాల పెంపు ● 10 శాతం అదనపు రాబడి లక్ష్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇక విదేశీ మద్యం రాష్ట్రంలోనే అందుబాటులోకి రానుంది. దొంగచాటుగా విదేశీ మద్యాన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే మద్యంపై పన్నులను తగ్గించి, వైన్‌పై ఉదారత చూపిన ప్రభుత్వం తాజాగా విదేశీ మద్యంపై దృష్టిసారించింది. విదేశీ మద్యం విక్రయాలకు ప్రత్యేక ఔట్‌లెట్లను అనుమతించాలని నిర్ణయించింది. కొంత కాలంగా రాష్ట్రంలో భారీగా విదేశీ మద్యం పట్టుపడుతోంది. దొంగచాటుగా దేశంలోకి ఖరీదైన విదేశీ మద్యాన్ని రాష్ట్రంలోకి తరలిస్తున్న ముఠాలు రెచ్చిపోతున్న తీరు ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ గుర్తించింది. దీంతో రాబడికి భారీగా గండి పడుతోంది. కాగా ఆశించిన రాబడితో ఊపుమీదున్న ఆబ్కారీ శాఖ మరింత రాబడికి మార్గాలను అన్వేషించింది. గత ఆర్థిక ఏడాది రూ. 9421 కోట్ల రాబడిని సాధించిన ఈ శాఖ ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి 6 నెలల్లోనే రూ. 8445.11 కోట్లకు చేరింది. రానున్న మరో 6 నెలల్లో మరో రూ. 5000 కోట్లకుపైగా సాధించేఅవకాశం కనిపిస్తోంది. గడచిన రెండు నెలల్లో తెలంగాణ సర్కార్ మొత్తం రాబడి 17.45 శాతం వృద్ధిరేటును నమోదు చేసుకోగా, అందులో ఆబ్కారీ శాఖనుంచే 51.92 శాతం రికార్డు వృద్ధిని సాధించి, ఇదే ఊపును కొనసాగించేందుకు సరికొత్త విధానాలను సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగా విదేశీ మద్యం విక్రయాలను మరింత ప్రోత్సహించడం ద్వారా రాబడిని పెంచుకోవాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. వీటికోసమే ప్రత్యేకంగా విదేశీ మద్యం అమ్మకాలకు ఔట్‌లెట్లను అనుమతించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పరిమితంగా ఉన్న ఔట్‌లెట్లను పెంచుకుంటే రాబడికి ఢోకా ఉండదని భావిస్తోంది.

ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8 విదేశీ మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. వీటిద్వారా సుమారు రూ. 15కోట్ల రాబడి సమకూరింది. 2014లో 29వేల కేసుల విదేశీ మద్యం విక్రయాలు జరగ్గా...2016లో ఇవి 57,623 కేసులకు చేరాయి. ఈ ఏడాది ఆరు నెలల్లో రూ.47.34 కోట్లు విదేశీ మద్యం రూపంలో ఖజానాకు చేరింది. రాష్ట్రంలో భారీ డిమాండ్ ఉన్న విదేశీ బ్రాండ్‌లకు చెందిన మద్యం చెన్నైనుంచి రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తున్నారు. దీనిని అరికట్టేందుకు విదేశీ మద్యం ఔట్‌లెట్లే మార్గమని ప్రభుత్వ యోచన. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 విదేశీ మద్యం దుకాణాలను అనుమతించాలని నిర్ణయించింది. ఇందుకు రెండేళ్ల కాలపరిమితితో లైసెన్స్‌లను జారీ చేయాలని యోచిస్తోంది. ఒక్కో దుకాణానికి రూ. 1కోటీ 25 లక్షల రుసుమును వసూలు చేయాలని ప్రతిపాదించింది. మొదటి విడతలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో మద్యం ఔట్‌లెట్‌కు 1000 చదరపు అడుగుల స్థలం ఉండాలని అధికారులు పాలసీలో నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం 2143 మద్యం దుకాణాలతోపాటు, 804 బార్లు, 27 క్లబ్బులు, పర్యాటక ప్రాంతాల్లో 8, టీడీకి 1 లైసెన్స్ క్లబ్‌లద్వారా స్వదేశీ, విదేశీ మద్యం అమ్మకాలు జరుపుతున్నారు.

గరిష్టంగా పెరుగుతున్న మద్యం విక్రయాలు...

1994-95లో రూ. 1105కోట్లుగా ఉన్న మద్యం విక్రయాలు గరిష్టస్థాయికి చేరాయి. 2003-04 వరకు రూ. 3వేల కోట్ల లోపుగా ఉన్న విక్రయాలు క్రమంగా పుంజుకున్నాయి. అమ్మకాల వాటా గతేడాది రూ. 9421 కోట్లకు చేరడం విశేషం. అయితే విక్రయాల పెరుగుదలకు నకిలీ మద్యం కట్టడి, నాటుసారా, గుడుంబాలను అరికట్టడం కూడా కారణంగా ఉంది. నకిలీలు నిరోధించేలా హోలోగ్రాం విధానం మద్యం విక్రయాల పెరుగుదలకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో భారీ విక్రయాలతో సర్కార్ ఖజానాకు పన్ను రాబడి పెరిగింది. ఖజానాకు ఆబ్కారీ శాఖ భారీ ఆదాయం అందిస్తోంది. అన్ని రెవెన్యూ రాబడుల శాఖలకంటే ముందంజలో నిలుస్తూ ఆదాయంలో అగ్రస్థానంలో నిలుస్తోంది. తాజాగా ఈ వార్షిక ఏడాది లక్ష్య సాధనలో ఇప్పటికే 80 శాతం రాబడిని సాధించి రూ. 9350 కోట్లను ఆర్జించింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలు 20 శాతం వృద్ధిరేటును సంతరించుకోగా, బీర్ విక్రయాల్లో 16 శాతం పెరుగుదల నమోదైంది. ఫలితంగా భారీ రాబడి ఖజానాకు చేరుతోంది. అమ్మకాల ఆదాయంతోపాటు పన్నులు, ఇతర మార్గాల్లో ఆశించిన రాబడి సమకూరుతోంది. మార్చిలోగా రూ. 13వేల కోట్లకు చేరుతామనే ధీమా వ్యక్తం అవుతోంది.

రానున్న బడ్జెట్‌లో అంచనాల పెంపు...

ప్రస్తుత ఆర్థిక యేడాదిలో సొంత వనరుల పన్ను ఆదాయం సంతృప్తికరంగా ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే బడ్జెట్‌లో కీలకమైన రాబడి వనరులపై 10నుంచి 20 శాతం వరకు అంచనాలు పెంచుకోవాలని యోచిస్తోంది. ఈ యేడాది జనవరి ఆరంభానికి వివిధ రాబడి శాఖలద్వారా పన్నుల రూపంలో రూ. 66 వేల కోట్ల రాబడి ఖజానాకు చేరింది. అమ్మకం పన్ను (వ్యాట్) మినహా కీలక ఆదాయ వనరుల్లో ఒకటైన ఎక్సైజ్ శాఖ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖల్లో రాబడులు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 20 శాతం అధిక రాబడి నమోదు చేసుకుంది.

సమాచార చట్టంపై అభ్యంతరాలు తెల్పండి

● కమిషనర్ల ఉత్తర్వులపై అప్పీల్ సరికాదు

● రౌండ్ టేబుల్ సమావేశంలో మాడభూషి, వక్తలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విప్లవాత్మకమైన సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడిచేలా ఉన్న ముసాయిదా చట్టంపై ప్రజలు తమ అభ్యంతరాలను కేంద్రానికి తెలియజేయాలని కేంద్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ మాడభూషి శ్రీధర్ కోరారు. ఈ చట్టాన్ని నీరుకార్చేలా ఉన్న సిఫార్సులపై ప్రజలు స్పందించాలని విజ్ఞప్తిచేశారు. పీపుల్స్ ఫోరం ఫర్ రైట్ టు ఇన్ఫర్మేషన్ (పిఎఫ్ఆర్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీధర్ పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి పిఎఫ్ఆర్ఐ అధ్యక్షులు వి. యాదయ్య అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి కె పార్థసారథి, హైకోర్టు సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్, ఆర్‌టిఐ సోషల్ ఆడిట్ కన్వీనర్ వివి రావు, సామాజిక కార్యకర్తలు కట్టాభగవంత్ రెడ్డి, వై క్రిష్ణారెడ్డి, ఎం మహేశ్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న కమిషనర్ల పోస్టులను భర్తీ చేయాలని, ప్రజాస్వామ్యాన్ని మంటకలిపే విధంగా ఉన్న ఆర్టీఐ సవరణలు వెనక్కు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వానికి అభ్యంతరాలను లేఖల రూపంలో పంపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ఫలితంగా సమాచార హక్కు చట్టాన్ని సాధించుకున్నామని, కానీ, చట్టంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోలేకపోతున్నామన్నారు. రాజస్తాన్ ప్రజలు ఈ హక్కును విస్తృతంగా వినియోగించుకుంటారని మాడభూషి శ్రీధర్ చెప్పారు. సమాచార హక్కు చట్టాన్ని ఇంకా పటిష్టం చేయాల్సి ఉండగా, నిర్వీర్యం చేసే విధంగా ముసాయిదా ఉందని ఆరోపించారు. కమిషనర్లు ఇచ్చే ఉత్తర్వులను సవాల్ చేసే విధంగా చట్టంలో సవరణలు రాబోతున్నాయని హెచ్చరించారు. ఒక కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్ ఉండపోతోందని, దీనివల్ల కమిషనర్లపై ఒత్తిడులు పెరుగుతాయని, పారదర్శకత లోపించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దుష్పరిణామాలు పెరుగుతాయని హెచ్చరించారు. అంతేగాక సమాచారం కోసం దరఖాస్తు చేసిన వ్యక్తి చనిపోతే దాన్ని మూసే సవరణ కూడా కొత్త ముసాయిదా చట్టంలో ఉందన్నారు. ముసాయిదాలో కొన్ని మంచి సవరణలు కూడా ఉన్నప్పటికీ మొత్తంమీద చట్టాన్ని నీరుకార్చేందుకు సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ చట్టం వల్ల అవినీతిపరులకు కొత్త ఆయుధం ఇచ్చినట్లవుతుందన్నారు. సమాచార హక్కు చట్టం స్వతంత్రత కోల్పోతున్నందున రాజకీయ నాయకులు చెప్పే వారికే అనుకూల తీర్పులు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదన్నారు.

దేశవ్యాప్త ఉద్యమం రావాలి: సుభాష్ అగర్వాల్

సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని ఢిల్లీకి చెందిన సామాజిక కార్యకర్త సుభాష్ చంద్ర అగర్వాల్ పిలుపునిచ్చారు. ఈ చట్టాన్ని నీరు కార్చేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్హతకు సంబంధించిన వివరాలు కోరిన కమిషనర్‌ను ఆ శాఖ నుంచి తప్పించారని, కొత్త చట్టం వస్తే పారదర్శకత అనేది అభాసుపాలవుతుందని హెచ్చరించారు. కమిషనర్ల నిర్ణయాలను ఆన్‌లైన్‌లో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. చాలా శాఖలు వివరాలను ఆన్‌లైన్‌లో పెడుతున్నప్పుడు ఈ శాఖ ఎందుకు పెట్టరాదన్నారు. హైకోర్టు న్యాయవాది విద్యాసాగర్ మాట్లాడుతూ, ఒక న్యాయ వాదిగా సమాచార హక్కు చట్టం కార్యకర్తలకు సహకారం అందిస్తానన్నారు. సమాచార హక్కు వికాస సమితి అధ్యక్షులు యర్రమాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను గ్రామపంచాయతి నోటీస్ బోర్డులో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీఐ యాక్టివిస్ట్ బద్రి మాట్లాడుతూ, చట్ట సవరణలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. సమావేశంలో డాక్టర్ శ్రీధర్ కుమార్ గౌడ్, వన్ వరల్డ్ వన్ పీపుల్ సంస్థ అధ్యక్షులు రానవేని లక్ష్మణ్‌రావు తదితరులు మాట్లాడారు.

హెచ్‌సీఏ సమావేశం రసాభాస

● అజారుద్దీన్‌ను అనుమతించకపోవడంపై వీహెచ్ ఆగ్రహం ● టీసీఏకు మద్దతిస్తున్నందున అనుమతించలేదు: వివేక్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ) సమావేశానికి మాజీ టెస్ట్‌స్టార్ అజారుద్దీన్ అనుమతించకపోవడంతో కొంత సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పీసీసీ మాజీ అధ్యక్షులు వి హనుమంతరావు మైక్ విరగ్గొట్టి అసోసియేషన్ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సిఏ చైర్మన్ వివేక్ వివరణ తర్వాత పరిస్థితిసద్దుమణిగింది.

ఆదివారం హెచ్‌సిఏ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. వివేక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం మధ్యలో అజారుద్దీన్ లోపలికి వచ్చేందుకు ప్రయత్నించగా కార్యాలయం సిబ్బంది ఆయన్ను అడ్డుకున్నారు. విషయం తెలిసిన విహెచ్ అక్కడికి వచ్చి ఏం.. అజారుద్దీన్‌నే అడ్డుకుంటారా? ఇదేమైనా టీఆర్ఎస్ కార్యాలయం, సమావేశం అనుకుంటున్నారా అని సిబ్బందిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వివేక్ జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించగా ఆయనపై కూడా విహెచ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏమనుకుంటున్నావు వివేక్...మీరంతా ఎక్కడి నుంచి వచ్చారు...ఈ సర్కార్ ఇంకెక్కువ రోజులు అధికారంలో ఉండదు...వచ్చే సర్కార్ మాదేనంటూ ఆవేశంగా అన్నారు. వివేక్ స్పందిస్తూ, లోథా కమిటీ సిఫార్సులు అమలు చేసేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెచ్‌సిఏలో నిధులు లేకపోయినప్పటికీ అండర్ -14 పోటీలు నిర్వహించేందుకు బాకీ తెచ్చి విజయవంతం చేశామన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) కి అజారుద్దీన్ మద్దతు ఇస్తున్నారని, అందుకే ఆయన్ను లోపలికి అనుమతించలేదని అన్నారు. ఆయనంటే తమకు అపారమైన గౌరవం ఉందని, వ్యక్తిగతంగా ఎలాంటి కక్షలు లేవన్నారు. హెచ్‌సిఏ సమావేశమైనందుకే లోపలికి అనుమతించలేదని, పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. టీసీఏకి అజారుద్దీన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారని చెప్పారు. ఎవరి అసోసియేషన్ను వాళ్లు చూసుకుందామని కోరారు. విహెచ్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని వివేక్ స్పష్టం చేశారు.

రాజ్‌భవన్‌లో వార్షిక సాంస్కృతికోత్సవాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజ్‌భవన్‌లో వార్షిక సాంస్కృతికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ దంపతులు ఇ ఎస్ ఎల్ నరసింహన్, విమలా నరసింహన్ జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాలను ప్రారంభించారు. రాజ్‌భవన్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ సాంస్కృతికోత్సవాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

సిబ్బంది పిల్లలు నిర్వహించిన అనేక గ్రూప్ డ్యాన్స్‌లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళా సిబ్బంది నిర్వహించిన దాండియా కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న రాజ్‌భవన్ సిబ్బందికి గవర్నర్ జ్ఞాపికలను బహూకరించారు. గత సంవత్సరం నిర్వహించిన క్రీడోత్సవాల్లో గెలుపొందిన వారికి కూడా జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు.

అధికారులు, సిబ్బంది అంతా ఒక కుటుంబంగా కలిసి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ఎంతో బాగుందని అభినందించారు. అంతా ఒక కుటుంబ సభ్యులుగా భావించి విధులు నిర్వహించవలసి ఉందన్నారు.



ప్రైవేటుకు 108 సేవలు?

● జీవీకేతో ఒప్పందం ముగిసినా పునరుద్ధరణకు ప్రభుత్వం అనాసక్తి

● ఉద్యోగ భద్రతపై సిబ్బంది ఆందోళన ● సేవలకే ప్రాధాన్యం: మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : 108 నిర్వహణ ప్రైవేటుకు అప్పగించేఆలోచనలో ప్రభుత్వం ఉంది. జీవికేకు ప్రభుత్వానికి మధ్య ఎంఓయూ ముగియడంతో దానిని పునరుద్ధరించుకోవడానికి ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 108 సేవలను ఇన్ని సంవత్సరాలుగా జీవికే నిర్వహించడం అసంతృప్తిగా ఉన్న ఉద్యోగులు మొత్తంగా ప్రైవేటుకు బాధ్యతలను అప్పగిస్తే పరిస్థితి పెనం నుంచి పోయిలో పడ్డట్టేనని ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగులు మాత్రం ప్రభుత్వమే ఈ సంస్థను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. సంవత్సరానికి నిర్వహణ నిమిత్తం 48 కోట్ల రూపాయలను జీవీకేకు ప్రభుత్వం చెల్లిస్తోంది. కొత్తవారికి 108 సేవల బాధ్యతలను అప్పగిస్తే ఇంకా తక్కువ వ్యయం అవుతుందన్నది ప్రభుత్వం భావన. అందులో భాగంగానే జీవీకేతో సేవలను పునరుద్ధరించుకోకుండా తాత్సారం చేస్తున్నదని ఉద్యోగులు అంటున్నారు.

కొత్త సంస్థ వల్ల ఇబ్బందులే

ఎందరికో ప్రాణదానం చేసే 108 సిబ్బందికి కష్టం వచ్చింది. ఆపదలో ఆదుకునే వీరి కష్టాల గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. 2005 సంవత్సరంలో ప్రారంభమయినప్పటి నుంచి ఇప్పటివరకు ఇందులో పనిచేస్తున్న వారు చాలీచాలనీ జీతంతోనే జీవితాలను నెట్టుకొస్తున్నారు. ఈ విషయమై చాలా సార్లు జీతాలను పెంచాలని మొరపెట్టుకున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని వారు కోరుతున్నారు. జీవీకే (ఈఎంఆర్‌డీ) సంస్థకు ప్రభుత్వం ప్రతినెలా డబ్బు చెల్లిస్తేనే తమ జీతాలు అందుతున్నాయని, అలాకాకుండా నెలకు కచ్చితంగా జీతం వచ్చేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చిన్న చిన్న తప్పిదాలకు కూడా వారు సీనియర్ ఉద్యోగులను తొలగిస్తున్నారన్నారు.

రూ.4 వేలు అలవెన్సుగా చెల్లింపు

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 108 సిబ్బందికి ప్రత్యేక తెలంగాణ ఇంక్రిమెంట్ కింద 4 వేల రూపాయలను అలవెన్సుగా చెల్లిస్తోంది. దానిని బేసిక్‌లో కలపకుండా జీతంతో పాటు ప్రత్యేకంగా చెల్లిస్తోంది. దానిని బేసిక్‌లో కలిపి ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నాయకులు పలుసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పెంచిన జీతాన్ని ప్రత్యేకంగా చెల్లిస్తానని ప్రభుత్వం పేర్కొంటుంది. దీంతోపాటు 108 కింద పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని 12 గంటలు పని చేయించుకొని 25 వేల రూపాయల జీతాన్ని చెల్లించాలని వారు తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. అయినా వారి కోరిక నెరవేరలేదు.

108 నిర్వహణ బాధ్యతలు త్వరలో టెండర్లను పిలిచి తక్కువ ధరకు ఏ కంపెనీ కోట్ చేస్తే వారికే 108 నిర్వహణను ప్రభుత్వం అప్పగిస్తుంది. 2005 సంవత్సరంలో మొదటగా సత్యం రామలింగరాజు 70 పైచిలుకు వాహనాలతో 108 సేవలను ప్రారంభించారు. 2006 సంవత్సరం ప్రభుత్వం-సత్యం (కంప్యూటర్‌తో) కలిసి దీనిని నిర్వహించేది. 2009లో సత్యం రామలింగరాజు కేసులో ఇరుక్కుపోవడంతో జీవికే చేతికి 108 సంస్థను అప్పగించారు. కాగా తెలంగాణ వచ్చిన తరువాత 145 వాహనాలు సమకూర్చారు. దీంతోపాటు 102 పేరుతో అమ్మ ఒడి పథకం కింద 45 వాహనాలను ప్రభుత్వం సమకూర్చింది. త్వరలో మరో 100 వాహనాలను ప్రభుత్వం తీసుకురానుంది. వీటి నిర్వహణ కూడా జీవికే అప్పగించింది. ఒక్కో అంబులెన్సు కింద 5గురు ఉద్యోగులు పనిచేస్తారు.

> ### సేవల విషయంలో రాజీపడం
>
> దేశంలోని 20 రాష్ట్రాల్లో పైగా జీవికే 108 వాహనాలను సంబంధించి నిర్వహణను చూస్తోంది. 2005 నుంచి ఇదే సంస్థ కాంట్రాక్టును దక్కించుకుంటుంది. మేము వైద్యసేవల విషయంలో రాజీపడం. ఎవరైతే ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తున్నారో వారికే బాధ్యతలను అప్పగిస్తాం. 2017 మార్చి నుంచి ఎంఓయూను పునరుద్ధరించలేదు. దీనిపై చర్చలు జరుపుతున్నాం. కొందరు కావాలనే ఉద్యోగాలు పోతాయంటూ 108 సిబ్బందిని భయబ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇవన్నీ ఒట్టి అపోహలే. మీకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడడమే మా బాధ్యత. అంతా పారదర్శకంగానే ఉంటుంది.
>
> 
>
> **- వైద్య ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి**

2017 మార్చి వరకు సేవల పొడిగింపు
108 వాహనాల స్పెషల్ ఆఫీసర్

2016లో ఎంఓయూ అయిపోయిన మాట వాస్తవమే. ఆ తరువాత 2017 మార్చి వరకు ప్రభుత్వం పొడిగించింది. అప్పటినుంచి ఆ ప్రపోజల్ ప్రభుత్వంలోనే పెండింగ్‌లో ఉంది. టెండర్లను పిలవడానికి సంబంధించి ఫైల్ ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వ అనుమతి రాగానే టెండర్లను పిలిచి తక్కువ కోట్ చేస్తారో వారికే ఆ బాధ్యతలను అప్పగిస్తాం.

వేరే వాళ్లకు అప్పగిస్తే నిర్లక్ష్యానికి గురవుతుంది

ప్రతి జిల్లాలోనూ అంబులెన్సులను జిల్లా డీఎంహెచ్ఓ తనిఖీ చేస్తారు. 108 వాహనంలో బేసిక్ లైఫ్ సేవింగ్ కిట్స్ ఉన్నాయా లేదా అన్నది వారు తనిఖీ చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తారు. కలెక్టర్ దీనిపై రివ్యూ జరుపుతారు. ఈ వాహనం నడిపే వారితో పాటు వాహనాలను ఎప్పటికప్పుడు మేము తనిఖీ చేస్తాం. మొదట ఫోన్ రాగానే అది మా కాల్‌సెంటర్‌కు వెళుతుంది. అక్కడి నుంచి ఆ ఏరియాలో ఉండే 108 వాహనానికి ఫోన్ వెళుతుంది. అర్బన్ ఏరియాలో అయితే 20 నిమిషాల లోపు, రూరల్ ఏరియాలో 25 నిమిషాలలోపు 108 వాహనం క్షతగాత్రుడి వద్దకు వెళ్లాలన్న నిబంధన ఉంది. వీటన్నింటిని మేము ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటాం. తక్కువ కోట్ చేసిన సంస్థకు బాధ్యతలు అప్పగిస్తే 108 నిర్లక్ష్యానికి గురవుతుంది.

-భూమా నాగేందర్, ప్రోగ్రాం మేనేజర్

ఎంఓయూపై త్వరగా చర్యలు తీసుకోవాలి

మా దగ్గర చాలామంది పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ పర్మినెంట్ చేయాలంటే కొన్ని రూల్స్ ఉంటాయి. వాటికి విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించలేక పోతుంది. సీఎం కేసీఆర్ వచ్చిన తరువాత స్పెషల్ ఇంక్రిమెంట్ కింద ఉద్యోగులకు రూ.4వేలను ప్రతినెలా ఇస్తున్నారు. గతంలో ప్రతి నెలా 1వ తారీఖు జీతం వచ్చేది. ఎంఓయూ ఆగిపోయినప్పటి నుంచి రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం 108 నిర్వహణ బాధ్యతలను తీసుకుంటే ఉద్యోగులందరికీ మేలు జరుగుతుంది. ఈ విషయమై త్వరగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

వరప్రసాద్, టీఎంపీహెచ్ఈయు రాష్ట్ర అధ్యక్షుడు

Andhraprabha business 2017
బిజినెస్
BUSINESS

పాన్- ఆధార్ అనుసంధానం మార్చి 31 వరకు గడువు

హైదరాబాద్ : ఆదాయపు పన్ను శాఖలో 2017లో పది లక్షలకు పైగా ఉన్న పాన్‌కార్డుల్లో కొన్నిటిని నిలిపివేయడమో రద్దుచేయడం చేసింది. మీ పాన్ ఆ జాబితాలో ఉందో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోండని ఆదాయపు పన్ను ప్రజలను కోరింది. నకిలీ పాన్‌కార్డులను ఏరివేయడానికి, వాటిని ఆధార్‌తో జతచేయాలని ఐటిశాఖ ప్రజలను కోరుతోంది. అదే సమయంలో ఈ అనుసంధానానికి మార్చి 31, 2018 వరకు గడువు పొడిగించింది. అయితే నకిలీ పాన్‌కార్డును గుర్తించడం.. కంప్యూటర్లు నిర్వహిస్తాయి కాబట్టి కొన్ని సార్లు చిన్న పొరపాటుకు కూడా పాన్ రద్దు అయ్యే అవకాశాలున్నాయి. దీనికి గాను ఐటి ఫైలింగ్ చేసే వారు వెబ్‌సైట్.. https://incometaxindiawfil-ing.gov. సైట్‌కు వెళ్లి అక్కడ Know your pan అనే బటన్‌ను క్లిక్ చేసి సిస్టమ్‌కు అవసరమైన సమాచారం ఇస్తే , మీ మొబైల్ నెంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ నెంబర్ వస్తుంది. దీన్ని ఎంటర్ చేసిన వెంటనే మీరు ఇచ్చిన వివరాలు సరిగా ఉంటే మీ పాన్‌కార్డు యాక్టివ్ గా ఉందా లేదా అనే సమాచారం ఇస్తుంది. యాక్టివ్ ఉండే ఫర్వాలేదు.. కానీ బ్లాక్ లేదా డియాక్టివ్ అయితే మాత్రం మీ పరిధిలోని ఆదాయపు పన్ను శాఖ అసెసింగ్ ఆఫీసర్ (ఏఓ)కు మీ పాన్‌కార్డు యాక్టివ్ చేయాల్సింది లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి ఆదాయపు పన్ను శాఖ ను ఉద్దేశించి ఇండెమ్నిటి బాండ్‌ను సిద్ధం చేయాలి. మీ దగ్గర ఉన్న పాన్‌కార్డు నకలును, గత మూడేళ్లుగా సమర్పించిన ఐటి రిటర్న్‌ల నకళ్లను దీనికి జత చేయాలి. అన్నీ సవ్యంగా ఉన్నాయని ఆదాయపు పన్ను ధ్రువీకరిస్తే..10-15 రోజుల్లో మీ పాన్ తిరిగి చెల్లుబాటులోకి వస్తుందని ఆదాయపు పన్ను శాఖ చెబుతోంది.



మొండి బకాయిల్లో
ఎస్‌బీఐ టాప్

- 1463 ఖాతాలు రూ. 100 కోట్ల కంటే ఎక్కువ
- ఎస్‌బీఐ 265ఖాతాల ఎన్‌పీఏ రూ.77,538 కోట్లు
- త్వరలో పెద్ద కేసులన్నీ ఎన్‌సీఎల్‌టీకి


న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన 21 బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండి బకాయిల గురించి ఆర్థికమంత్రిత్వశాఖ తాజా గణాంకాలను విడుదల చేసింది. మొత్తం 1,463 కంపెనీలు పీఎస్‌యు బ్యాంకులకు రూ.100 కోట్లు లేదా అంత కంటే ఎక్కువ మొత్తం బకాయిపడ్డాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్‌ఇండియా (ఎస్‌బీఐ)కే సుమారు 265 ఖాతాలు రూ.100 కోట్ల కంటే ఎక్కువ బకాయిపడ్డ వాటిలో ఉన్నాయి. సెప్టెంబర్ చివరి నాటికి ఈ బకాయిలు రూ.77,538 కోట్లకు ఎగబాకాయి. జాబితాలో పంజాబ్ నేషనల్ బ్యాంకులో 143 ఖాతాలు రూ.100 కోట్ల కంటే ఎక్కువగా తేలాయి. పీఎన్‌బీ మొండి బకాయిలు రూ.45,973 కోట్లకు చేరాయి. కెనారా బ్యాంకుకు కూడా పెద్దమొత్తంలో ఇలాంటి ఖాతాదారులు న్నారు. చిన్న బ్యాంకుల విషయానికి వస్తే యూనియన్ బ్యాంకుకు 79 ఖాతాలు, ఒరియంటల్ బ్యాంకుకు 68, యూకో బ్యాంకుకు 62 చొప్పున ఉన్నాయని ఆర్థికమంత్రిత్వశాఖ పేర్కొంటోంది. సెప్టెంబర్ చివరి నాటికి ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో ఈ మొండిబకాయిలు రూ.7.34 లక్షలకోట్లకు చేరాయి. ఇదిలా ఉండగా రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) అతి పెద్ద 12 ఖాతాలు రూ.5,000 కోట్లకంటే ఎక్కువ బకాయిలుండి వాటిలో 60 శాతం వరకు 2016మార్చి చివరి నాటికి మొండికబాయిలుగా మారిపోతే ఇన్సాల్వెన్సీ బ్యాంకరప్టసీ కోడ్ -2016 ప్రాసెస్‌ను మొదలుపెట్టాలని సూచించింది. బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండిబకాయిలకు అడ్డుకట్ట వేయడానికి ఈ పీఎస్‌యు బ్యాంకులు ఎన్‌పీఏ కోసం పెద్ద మొత్తంలో కేటాయింపులు చేయాల్సి వస్తోంది. బ్యాంకులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం రూ.2.12 లక్షల కోట్ల మూలధనం సమకూరు స్తామని ప్రకటించింది. ఇప్పటికే పార్లమెంటు అనుమతులు తీసుకొని రూ.80వేల కోట్ల రీక్యాపిటలైజేషన్ బాండ్లను అనుమతులు కూడా పొందింది.

డిషెంబర్‌లో పెరిగిన రుణాల డిమాండ్: ఆర్బీఐ



ముంబై : దీర్ఘకాలం తర్వాత బ్యాంకుల రుణాల డిమాండ్ రెండంకెలకు చేరింది. డిసెంబర్ 22, 2017తో ముగిసిన పక్షం రోజులకు రుణాల డిమాండ్ 10.65 శాతం పెరిగి రూ.80,96,727 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఇదే డిసెంబర్ 23, 2016లో రుణాల డిమాం డ్ రూ.73,17,391 కోట్లుగా నిలిచింది. గతేడాది పెద్దనోట్ల రద్దు తర్వాత బేస్‌రేట్లను సవరించడంతో రుణాలకు డిమాండ్ పెరిగిందని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ (రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) పీకే గుప్తా చెప్పారు. రిటైల్ రుణాలకు డిమాండ్ పెరుగుతోందని.. కార్పొరేట్ రుణాలకు డిమాండ్ అంతం మాత్రంగానే ఉందన్నారు. డిసెంబర్‌లో రిటైల్ రుణాలకు డిమాండ్ బాగా పెరిగిందని.. ముఖ్యంగా ఆటో రుణాలతో పాటు గృహ రుణాలకు డిమాండ్ పుంజుకుందని గుప్తా చెప్పారు. ఇటీవల విడుదల చేసిన ఫైనాన్షియల్ స్టెబిలిటి నివేదిక ప్రకారం చూస్తే షెడ్యూలు బ్యాంకుల రుణాల డిమాండ్ సంవత్సరం ప్రాతిపదికన చూస్తే మార్చి నుంచి సెప్టెంబర్ 2017 నాటికి 4.4 శాతం నుంచి 6.2 శాతానికి పెరిగిందని తెలిపింది. ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో రుణా డిమాండ్ 0.7శాతం నుంచి 2.2శాతానికి ఇదే కాలంలో పెరిగింది. అంతకు ముందు రెండు సంవత్సరాల నుంచి రుణాల డిమాండ్ తగ్గముఖం పడుతూ వస్తోంది. డిసెంబర్ 8, 2017తో పోల్చుకుంటే డిసెంబర్ 23 ,2017న స్వల్పంగా పెరిగింది. అంతకు ముందు పక్షం రోజుల విషయానికి వస్తే బ్యాంకుల రుణాల డిమాండ్ 9.77 శాతం పెరిగి రూ.80,26,901 కోట్లకు ఎగబకాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.73,12,107 కోట్లకు చేరింది. ఇదే సమయంలో బ్యాంకుల్లో డిపాజిట్లు 3.96 శాతం పెరిగి రూ.108,85,118 కోట్లకు చేరగా.. అదే డిసెంబర్ 23, 2016లో బ్యాంకుల్లో డిపాజిట్లు రూ.104,69,807 కోట్లుగా ఉన్నట్లు ఆర్‌బీఐ గాణాంకాలు తెలియజేస్తున్నాయి. అదే డిసెంబర్ 8, 2017 నాటికి పక్షం రోజులకు చూస్తే డిపాజిట్లు 3.32 శాతం పెరిగి రూ.109,01,613 కోట్లు చేరగా.. అంతకం ముందు ఏడాది డిసెంబర్ 9, 2016న డిపాజిట్లు రూ.105,50,392 కోట్లుగా నమోదయ్యాయి. అదే షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకుల్లో ఏడాది ప్రాతిప దికన చూస్తే 11.1 శాతం క్షణించి మార్చి నుంచి సెప్టెంబర్ 2017 నాటికి 7.8 శాతానికి దిగివచ్చింది. అన్నీ బ్యాంకు గ్రూపుల్లో డిపాజిట్లు గణనీయంగా తగ్గాయి.

ఎలక్టోరల్ బాండ్లతో పారదర్శకత: జైట్లీ



రాజకీయపార్టీలకు ఎన్నికల్లో కంపె నీలు విరాళాలు పారదర్శకంగా ఉండేందుకే ఎలక్టోరల్ బాండ్లను తీసుకొచ్చినట్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చడంతో మరింత ప్రక్షాళన చేయడానికి ప్రజల నుంచి సలహాలు సూచనలు కోరుతామని ఆయన ఆదివారం నాడు పేర్కొన్నారు. ఆయన ఫేస్‌బుక్ పోస్ట్‌లో ... సంప్రదాయబద్ధంగా రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చే వ్యవస్థను పూర్తిగా మార్చలానుకుం టున్నామని,, సాధారణంగా రాజకీయ పార్టీలకు ఖర్చుల కింద నగదును స్వీకరిస్తారని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలకు ఎవరు ఎంత డబ్బు ఇచ్చారో తెలియదు. ఏ వర్గాల నుంచి వచ్చిందో తెలీదు. పార్టీలు కూడా తమకు ఎంత మొత్తం విరాళాలు వచ్చాయో స్పష్టం చేయదు.. రాజకీయ వ్యవస్థలోకి నల్లడబ్బు గుర్తింపులేని వర్గాల నుంచి వస్తోందన్నారు. మొత్తానికి రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాలు పారదర్శకంగా ఉండవని తేటతెల్లం అయ్యింది. మెజారిటి రాజకీయ పార్టీలు ప్రస్తుతం ఉన్న వ్యవస్థనే కొనసాగించాలని అంటున్నాయి. దీని వల్ల ప్రత్యామ్నయ వ్యవస్థ తయారు అవుతుందని, రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు పారదర్శకంగా ఉండాలని అందుకే ఎలక్టోరల్ బాండ్ల వ్యవస్థను తీసుకొస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఆర్థికమంత్రి గత వారం ఎలక్టోరల్ బాండ్లను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఈ బాండ్లను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా విక్రయిస్తామని.. దీనికి కేవలం 15 రోజుల గడువుమాత్రమే ఉంటుందని చెప్పారు. రాజకీయ పార్టీలకు నగదు బదులు బాండ్ల ద్వారా విరాళాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఎలక్టోరల్ బాండ్లను తీసుకురావడానికి ముందు మొత్తం మూడు ప్రత్యామ్నాయలను ఆలోచించామని, వాటిలో చెక్కులు, లేదా ఆన్‌లైన్‌లో చెల్లింపులు లేదా ఎలక్టోరల్ బాండ్లను పరిగణనలోకి తీసుకున్నామని, చివరగా.. ఎలక్టోరల్ బాండ్లే కాస్తా నయమనిపించింద న్నారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థమాత్రం పారదర్శకంగా లేదని ఆయన అన్నారు.

అక్రమలాభార్జనపై
స్పష్టత ఇవ్వండి: సీఐఐ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసు కొచ్చిన వస్తు సేవల పన్ను జీఎస్టిలో యాంటీ ప్రాఫిటరింగ్ నిబంధనలు (అక్రమలాభార్జన) పై మరింత స్పష్టత ఇవ్వాలని పారిశ్రామిక మండలి (సీఐఐ) ప్రభుత్వాన్ని కోరింది. జీఎస్టి ఇప్పుడిప్పుడు అమల్లోకి వచ్చినందు వల్ల ప్రభుత్వం రోజుకో నిబంధన తీసుకురావడంతో ఆ నిబంధనలు అమలు చేయడంలో కొన్ని పొరపాట్లు దొర్లుతాయని సీఐఐ ఒక ప్రకటనలో పేర్కొంది.



కొత్తగా తెచ్చిన జీఎస్టిలో ప్రభుత్వం యాంటీ ప్రాఫిటరింగ్ నిబంధనను తీసుకొచ్చింది. జీఎస్టి అమల్లోకి వచ్చినం దు వల్ల పన్ను ద్వారా లభించే లబ్దిని వినియోగదారుడికి బదలీ చేయాల్సిఉంటుంది. ఇలా బదలీ చేయని కంపెనీ లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కొత్త నిబంధన ప్రకారం ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ద్వారా లభించే లబ్దిని వినియోగ దారుడికి వస్తువు ధర తగ్గించి అందజేయాల్సి ఉంటుంది. అయితే దీనిపై పక్కాగా స్పష్టత లేదని సీఐఐ పేర్కొంది. జీఎస్టిచట్టంలో యాంటి ప్రాఫిటరింగ్ క్లాజుపై నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని.. దీంతో పాటు అసెస్‌మెంట్ ఆఫ్ వ్యాల్యుయేషన్ దీనిపై పన్నుల ప్రభావం ఎంత స్పష్టత ఇవ్వాలని సీఐఐ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వం కొత్తక్లాజులు లేదా నిబంధనలు తీసుకు రావడంతో ప్రధానంగా చిన్న చిన్న వ్యాపారులకు దీనిపై అవగాహన ఉండదు.. వారికి లేని పోని ఇబ్బందులు కల్పించినట్లవుతుందని పేర్కొంది. జీఎస్టి ఇప్పుడిప్పుడే అమల్లోకి వచ్చినందు వల్ల ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు తలెత్తడం సహజమేనని సీఐఐ అభిప్రాయపడింది. పన్ను అధికారులు యాంటిప్రాఫిటరింగ్ చట్టాన్ని దృష్టిలో ఉంచుకుని చోటా మోటా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తుందని, కొత్త నిబంధనలు అమలు చేయడానికి వ్యాపారులకు కొంత గడువు కావాల్సి ఉంటుందని సీఐఐ ప్రకటనలో కోరింది. ఇదిలా ఉండగా జులై 1 నుంచి జీఎస్టి అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం నవంబర్‌లో నేషనల్ యాంటీ ప్రాఫిటరింగ్ అధారిటీని ఏర్పాటు చేసింది.

దేశీయ విమాన సర్వీసుల్లో
మూడవ స్థానంలో భారత్
కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు

రేణిగుంట, , ప్రభన్యూస్ : ప్రపంచంలోని డొమెస్టిక్ విమానయాన సర్వీసులలో భారతదేశం మూడవ స్థానంలో వుందని కేంద్ర పౌరవిమానయానశాఖా మంత్రి అశోక్‌గజపతిరాజు అన్నారు. ఆదివారం రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో తిరుపతి - హైదరాబాద్ ఇండిగో విమాన సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన మీడియాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఏ హయాంలోనే మనదేశం విమానయాన రంగం అభివృద్ధి పథంలో వెడుతోందన్నారు. గత 70సంవత్సరాల కాలంలో దేశంలో 75 ప్రాంతాల కనెక్టివిటి వుంటే ఎన్‌డిఎ ప్రభుత్వంలో గత 3సంవత్సరాలలో మరో 80 ప్రదేశాలకు విస్తరించి విమానాశ్రయాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రాంతీయ కనెక్టివిటీ పేరుతో దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నామని అన్నారు. ఇండిగో విమాన సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ప్రతి రోజు తిరుపతి నుండి హైదరాబాదుకు, హైదరాబాదు నుండి తిరుపతికి సర్వీసులు అందుబాటులో వుంటాయన్నారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు శివప్రసాద్ మాట్లాడుతూ ఇం డిగో సంస్థ ప్రయాణికుల సంక్షేమంలో రాజీలేని విధంగా సేవలందిస్తుం దని అన్నారు. ప్రపంచంలోనే ఇండిగో 4వస్థానంలో వుందన్నారు. తిరుపతి పార్లమెం టు సభ్యులు వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్రమంత్రి అశోక గజపతి రాజుతో 20సార్లు సమావేశమైనానన్నారు. గొప్ప వ్యక్తిత్వంగల మంత్రి ని కొనియాడారు. త్వరలో రేణిగుంట విమానాశ్రయం నుండి విదేశాలకు వెళ్లడానికి అంతర్జాతీయ విమానాలను నడపాలని కేంద్ర మంత్రిని కోరారు. కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుండి అధిక మంది దుబాయ్, సింగపూర్ ప్రాంతాలలో వున్నారని అన్నారు. విమానాశ్రయం డైరెక్టర్ పుల్లా మాట్లాడుతూ వేసవికల్లా 44విమాన సర్వీసులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.

అనంతరం కేంద్ర మంత్రి అశోకగజపతి రాజు ఇండిగో విమానంలో హైదరాబాదుకు బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తుడా ఛేర్మన్ నరసింహ యాదవ్, సబ్‌కలెక్టర్ నిశాంత్ కుమార్, విమానాశ్రయం డిజిఎం రవిశంకర్, ఆపరేషన్స్ బాబిడోరిన్, సిఎస్ఓ దేవేంద్రన్, ఎజిఎం లక్ష్మీనారాయణ, ఇండిగో తిరుపతి మేనేజర్ విన్ని బాజాజ్, డిఎస్పీ నంజుండప్ప పాల్గొన్నారు.



తిరుపతి -హైదరాబాద్ ఇండిగో సర్వీసులు

చౌకరకం ఎయిర్‌లైన్ ఇండిగో ఆదివారం తిరుపతి - హైదరాబాద్ విమానసర్వీసులు ప్రారంభించింది. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు రోజుకు మూడు విమాన సర్వీసులు నడుపుతుంది. పౌర విమానయానశాఖ మంత్రి అశోకగజపతిరాజుతో పాటు ఇండిగో ప్రెసిడెంట్, హోల్‌టైం డైరెక్టర్ ఆదిత్యఘోష్ తిరుపతి నుంచి హైదరాబాద్‌కు ఆదివారం రెండవ విమానాన్ని తిరుపతిలో జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి నుంచి రోజు మూడు నాన్‌స్టాక్ విమానాలను హైదరాబాద్‌కు, రెండు నాన్ స్టాప్ విమానాలు బెంగళూరుకు నడుపుతుంది. దీంతో పాటు తిరుపతి నుంచి ఇతర నగరాలకు కూడా కనెక్టివిటిని విస్తరిస్తుంది. ఇండిగో నెట్‌వర్కులో ఎయిర్‌బస్ 320, ఎటీఆర్‌లున్నాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ తిరుపతి నుంచి ఢిల్లీ, ముంబై, కోలకతా, దుబాయి, సింగపూర్‌తో పాటు ఇతర నగరాలకు వయా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, మంగళూరుకే విమానసర్వీసులు నడుపుతుంది. రోజుకు 47 నగరాలకు 1,000 విమాన సర్వీసులు నడుపుతుంది. కొత్త విమానాల సర్వీసులు కార్పొరేట్లతో పాటు లీజర్ ట్రావెలర్స్‌లను అనుకూలంగా ఉంటాయని ఇండిగో ఒక ప్రకటనలో పేర్కొంది.

మారుతి ఎల్‌సీవీ నెట్‌వర్క్ విస్తరణ



న్యూఢిల్లీ : మారుతి సుజుకి తేలిక పాటి వాణిజ్య వాహనం (ఎల్‌సీవీ) సూపర్ క్యారీ సేల్స్ నెట్‌వర్క్‌ను విస్తరించ నుంది. సూపర్‌క్యారీ వాహనాన్ని 2016 సెప్టెంబర్‌లో మార్కెట్లో విడుదల చేసింది. 2016-17లో 900 యూనిట్లు విక్రయించింది మార్కెట్లో మంచి స్పందన లభించిందని మారుతి సుజుకి ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం మార్కెట్లో హవా నడిపిస్తున్న టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రాకు గట్టిపోటీ ఇచ్చే స్థాయికి ఎదిగింది. రిటైల్ నెట్‌వర్కు కోసం దశల వారీగా విస్తరించుకుంటూపోతోంది. ప్రస్తుతం 25 రాష్ట్రాలు 140 నగరాల్లో 162 వాణిజ్య ఔట్‌లెట్‌ల ద్వారా విక్రయాలు జరుపుతోంది. దీన్ని మరింత విస్తరించాలనుఉంటున్నట్లు కంపెనీ అధికార ప్రతినిధి వెల్లడించారు. అయితే అమ్మకాల లక్ష్యం గురించి, త్వరలో ప్రారంభించబోయే ఔట్ లెట్ల గురించి వివరాలివ్వలేదు. 700 కిలోల పేట్‌లోడ్ సెగ్మెంట్‌లో మార్కెట్ వాటా 5.5 శాతం కలిగి ఉందన్నారు. మార్కెట్లో టాటా ఏస్, ఎంఅండ్‌ఎం సుప్రో, పియజియోకు చెందిన పోర్టర్‌కు పోటీ ఇస్తోందన్నారు. దేశీయ మార్కెట్లతో పాటు గురుగావ్‌లో ఉత్పత్తి చేసే ఈ సూపర్‌క్యారీని దక్షిణాఫ్రికాతో పాటు శ్రీలంక, ఫిలిప్పీన్స్, నేపాల్, బంగ్లాదేశ్‌కు ఎగుమతులు కూడా చేస్తోంది 793 సీసీ డిజిల్ ఇంజిన్ కలిగిన ఈ ఎల్‌సీవీ లీటర్ డిజిల్‌కు 22.07 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుంది.

డబుల్ డిజిట్‌కు లంబోర్గిని అమ్మకాలు



న్యూఢిల్లీ : సూపర్ స్పోర్ట్స్ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ లంబోర్గిని భారత్ మార్కెట్లో అమ్మకాలు రెండంకెలకు పెంచుకుంటామని భరోసా వ్యక్తం చేస్తోంది. 2017లో అమ్మకాలు మాత్రం ఫ్లాట్‌గా ముగిశాయి. ఇటాలియన్‌కు చెందిన సూపర్ స్పోర్ట్స్ కార్ల తయారీ కంపెనీ భారత్ మార్కెట్లో హురాకేన్, అవెన్‌టాడార్ మోడల్స్‌కు విక్రయిస్తోంది. గతేడాది అమ్మకాలకు పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను జీఎస్టిదెబ్బతీసిందని, డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నుంచి డిమాండ్ పెరుగుతోందని ఆటోమొబిల్ లాంబోర్గిని ఇండియా చీఫ్ శరద్ అగర్వాల్ చెప్పారు. లాంబోర్గి సూపర్ స్పోర్ట్స్ కారు సెగ్మెంట్‌లో రెండు డోర్‌మోడల్స్ ధర రూ.2.2 కోట్లుగా ఉంటుందని.. గతేడాది 70 యూనిట్లు విక్రయించినట్లు తెలిపారు. మార్కెట్లో లంబోర్గినికి పోటీ ఇచ్చే ఇతర కంపెనీలు ఇలా ఉన్నాయి. ఫెరారీ, ఆస్టిన్ మార్టిన్, ఆడి ఆర్8, మెర్సిడెజ్ ఎంఎంజీ జీటీ -ఆర్‌లున్నాయని చెప్పారు. ప్రభుత్వం తరచూ అధిక పన్నులు విధిస్తూ.. వాటిని మారుస్తూ ఉంటంతో అమ్మకాలపై ప్రభావం చూపుతోందని అగర్వాల్ అన్నారు. 2011-12 ఆర్థికసంవత్సరంలో సుమారు 100 యూనిట్ల వరకు విక్రయించామన్నారు. అన్నీ సవ్యంగా కొనసాగితే వచ్చే రెండు నుంచి మూడు సంవత్సరాల్లో 100 యూనిట్ల మార్కును తిరిగి చేరుతామన్న భరోసాన వ్యక్తం చేశారు.

క్యూ3 ఫలితాలు, ఐఐపీ గణాంకాలు కీలకం



న్యూఢిల్లీ : ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీలకంగా మారనున్న పరిణామాల విషయానికి వస్తే క్యూ3 ఫలితాలు, ఐఐపీ, రిటైల్ ద్రవ్యోల్బణం కీలకం కానున్నాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది మొదటి వారం ట్రేడింగ్ సరళిని చూస్తే సెన్సెక్స్ 97.02 పాయింట్లు , నిఫ్టీ 28.15 పాయింట్లు లాభపడింది. ఈ వారం నుంచి కార్పొరేట్ క్యూ3 ఫలితాలు వెల్లడికాబోతున్నాయి. జనవరి 11న టాటాకన్సెల్టెన్సీ సర్వీసెస్, 12 ఇన్ఫోసిస్ మూడవ త్రైమాసిక ఫలితాలు ప్రకటించనున్నాయి. జనవరి 12వ తేదీన నవంబర్ నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలు విడుదల కాబోతుండగా.. అదే రోజు డిసెంబర్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువనున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ ప్రీమియం వ్యాల్యూయేషన్‌లో కొనసాగుతోంది.. క్యూ3 ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో మార్కెట్లో పెద్దమొత్తంలో ద్రవ్యంవచ్చి చేరింది. దీంతో పాటు గ్లోబల్ మార్కెట్లనుంచి కూడా అనుకూలమైన సంకేతాలు వెలువడ్డం కూడా బాగా కలిసొచ్చింది. భవిష్యత్తులో మార్కెట్లకు దశదిశ చూపించేంది మాత్రం 2018-198 బడ్జెట్ అని వారు చెబుతున్నారు.

విశాఖ స్టీల్‌లో పెల్లెట్ ప్లాంట్
ఆర్‌ఐఎన్‌ఎల్, కేఐఓసీఎల్ మధ్య ఎంఓయూ



విశాఖపట్నం, ప్రభ న్యూస్ : కేంద్ర ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వశాఖ కింద ఉన్న ప్రభుత్వరంగ సంస్థలు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ (ఆర్‌ఐఎన్‌ఎల్), కుంద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ (కెఐఓసిఎల్)లు కొత్తగా జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటుచేసి, దాని ఆధ్వర్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆవరణలోనే పెల్లెట్ ప్లాంట్‌ని ఏర్పాటుచేస్తుంది. ఒప్పందంపై మంగళూరులో శనివారం సంతకాలు జరిగాయి. కేంద్ర ఉక్కుశాఖా మంత్రి చౌధరి బీరేందర్ సింగ్, ఉక్కుశాఖా కార్యదర్శి అరుణాశర్మల సమక్షంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఎండీ పి.మధుసూధన్, కుంద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ సీఎండీ ఎం.వి.సుబ్బారావులు ఒప్పంద పత్రాలపై సంతకాలుచేశారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బైలదిల్లా లేదా కర్నాటకలోని బళ్ళారిల నుంచి ముడి ఇనుమును తీసుకుని పెల్లెట్లను ఉత్పత్తిచేయాలని భావిస్తున్నారు. ఈ ప్లాంట్‌ని ప్రారంభంలో 1.2 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటుచేయనున్నారు. ఈ పెల్లెట్స్‌ని బ్లాస్ట్ ఫర్నేస్‌లకు ముడి సరుకుగా ఉపయోగిస్తారు. ఎంఓయు కార్యక్రమంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) - టెక్నాలజీ విల్సన్ దేవిడ్, కుంద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీలఈడీ (ప్రాజెక్ట్స్) వి.బోబ్రాగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎయిర్ ఇండియా ప్రైవేట్‌పరం వద్దు

- ఐదేళ్లలో గాడిలో పడుతుంది
- పార్లమెంట్ ప్యానెల్



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన ఎయిర్‌ఇండియా నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు ఇది సరైన సమయం కాదని, కనీసం ఐదు సంవత్సరాల సమయం ఇస్తే ఎయిర్‌ఇండియా అప్పులను పూర్తిగా తీర్చేస్తుందని పార్లమెంటు ప్యానెల్ ఒక నివేదికలో పేర్కొంది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది. ఎయిర్‌లైన్స్‌కు ప్రభుత్వంచిన్న చిన్న మొత్తాల్లో పెట్టుబడులు సమకూర్చడం వల్ల ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని.. దీని వల్ల ఎయిర్‌లైన్స్ నిధులు అవసరమైనప్పుడు అధికవడ్డీరేట్లకు బయటి నుంచి రుణాలుతీసుకోవాల్సి వస్తోందని కూడా గుర్తించింది. ప్రభుత్వం ఎయిర్‌ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణ గురించి మరోసారి ఆలోచించి దీనికి ప్రత్యామ్నయం ఆలోచించాలని .. ఎయిర్‌ఇండియా మనజాతి గౌరవం అని పేర్కొంది. ఎయిర్ ఇండియా అత్యవసర సమయంలో మనల్ని ఆదుకుంటోందని.. ఉదాహరణకు జాతీయ విపత్తులు ఏర్పడినప్పుడు, సావాజిక లేదా రాజకీయ సంక్షోభాలు దేశంతో పాటు విదేశాల్లో ఏర్పడినప్పుడు తన వంతు బాధ్యతలు నిర్వర్తించిందని పార్లమెంటుప్యానెల్ వివరించింది. ఎయిర్‌లైన్‌కు ప్రభుత్వం 10సంవత్సరాల పాటు ఫైనాన్షియల్ రీస్ట్రక్చర్ ప్లాన్ (ఎఫ్ఆర్‌పీ) ప్రకటించింది. 2012 నుంచి 2022 వరకు పెట్టుబడులు సమకూరుస్తుంది. మొత్తానికి చూస్తే ఎయిర్‌ఇండియా మాత్రం వివిధ కొలమానాల ప్రకారం చూస్తే గాడినపడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని తెలిపింది. ఎయిర్ ఇండియాకు చెందిన అనుబంధ సంస్థలు ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏటిఎస్‌ఎల్), ఎయిర్ ఇండియా సాట్స్ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎస్ఏటీఎస్) అలయెన్స్ ఎయిర్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లు లాభాలను ఆర్జిస్తున్నాయి కాబట్టి ఖచ్చితంగా పెట్టుబడుల ఉపసంహరణ వద్దు అని పార్లమెంటుప్యానెల్ తేల్చి చెబుతోంది. మార్చి 2017 నాటికి చూస్తే ఎయిర్ ఇండియా మొత్తం రుణాలు రూ.48,877 కోట్లు, వాటిలో రూ.17,360కోట్లు విమానాలు కొనుగోలు చేయడానికి, రూ.31,517 కోట్లు మూలధనం కింద రుణం సమకూర్చింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఎయిర్ ఇండియా రూ.3,579కోట్లు నష్టాన్ని ప్రకటించవచ్చు. 2016-17లో నికనష్టం రూ.3,643 కోట్లు నష్టాన్ని చవిచూసింది. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.531 కోట్లు నిర్వహణా లాభాన్ని ప్రకటించవచ్చు.. క్రితం ఏడాది రూ.215కోట్లు నిర్వహణా లాభన్ని ప్రకటించిందని ప్యానెల్ తాజాగా పార్లమెంటులో ఈ గణాంకాలను ప్రవేశపెట్టింది.


చిగురించిన 'ఉక్కు' ఆశలు

• బయ్యారంలో కేంద్ర బృందం పర్యటన • ఉక్కు పరిశ్రమ స్థాపనకు వనరుల పరిశీలన • ప్రాథమిక అధ్యయనంపై సంతృప్తి • స్థానికుల్లో హర్షాతిరేకాలు

వరంగల్, ప్రభ న్యూస్ బ్యూరో : బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్య అసాధ్యాలపై కేంద్ర బృంధం ఆదివారం నాడు బయ్యారంను సందర్శించింది. మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రయత్నాలు సాగుతున్ననేపథ్యంలో స్థానికంగా అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఆ బృందం పరిశీలించింది. ప్రధానంగా భూములు నీటి వనరులు, విద్యుత్, రవాణా సౌకర్యాలపై దృష్టి కేంద్రీకరించింది... 50 ఏళ్లుగా ఉక్కు పరిశ్రమ కోసం అనేక ఉద్యమాలు సాగాయి. తాజాగా కేంద్ర బృందం పర్యటనతో మరో మారు ఆశలు చిగురించాయి. జార్ఖండ్ రాష్ట్రం లోని రాంచీ పట్టణానికి చెందిన మెకాన్ టీమ్ ఉక్కు పరశ్రమ ఏర్పాటుపై సాధ్యసాధ్యాలను పరిశీలించింది., ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌లో కడప, తెలంగాణ రాష్ట్రంలో బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాల పునర్విభజన అనంతరం అనేక మార్లు సేయిల్, సింగరేణి సంస్థలతో పాటు పలు ప్రైవేట్ కంపెనీలు బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపనపై పలు సర్వేలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమ ఏర్పాటు ప్రజల మనోభావాలతో దోబూచులాడుతుంది. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం నెపం నెట్టటం, కేంద్రం సర్వేల పేరుతో కాలయాపన చేయటంతో ఈ ప్రాంత ప్రజల్లో అసహనం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో పలు ఉద్యమాలు ఆందోళనలు కొనసాగాయి. సుధీర్ఘ కాలంపాటు రిలే నిరాహార దీక్షలు, జిల్లా దిగ్బంధనాలు, కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాలు అనేక కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు సర్వేల పేరుతో కాలయాపన చేస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలను తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోను చేసింది. ఈ నేపథ్యంలో పరిశ్రమల ఏర్పాటుకు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బృందం పర్యటన స్థానికుల్లో ఆశలు రేకెత్తించింది. మెకాన్ టీం డీజీఎం కుమ్ముద్ రజక్ నేతృత్వంలోని టీమ్ మొదట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ ప్రాంతంలోని ఉల్వనూరు ప్రాంతంలో పరిశీలించింది. అనంతరం అదే జిల్లా కొత్తగూడెం మండలం అనిశెట్టిపల్లి ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం సాయంత్రం బయ్యారం మండలంలోని ధర్మాపురం ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించింది.

ప్రాజెక్ట్ నిర్మాణానికి 1500 నుంచి 2 వేల ఎకరాల స్థలము అవసరం ఉండగా దాదాపు 4 వేల 100 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం పరిశ్రమ ఏర్పాటుకు అతిముఖ్యవనరైన నీటి సదుపాయం గురించి సమీపంలోని బయ్యారం పెద్దచెరువు ప్రాంతాన్ని సందర్శించిన బృందానికిక ఇరిగేషన్ ఏఈ నీటి వనరుల విషయాన్ని వివరించారు. అనంతరం బృంధం రవాణా కోసం గార్ల రైల్వేస్టేషన్‌ను పరిశీలించింది. అదే విధంగా పరిశ్రమ ఏర్పాటు కావలసిన విద్యుత్ సదుపాయం విషయంలో మహబూబాబాద్ పరిధిలోని అనంతాద్రి ప్రాంతాన్ని పరిశీలించారు. వారి పర్యటనలో మూడు ప్రాంతాలని పరిశీలించగా బయ్యారంలోని ధర్మాపురం మెరుగైన పరిస్థితులు ఉన్నట్లు బృందం ఆలోచన పడినట్లు సమాచారం.

ఈ బృందంలో యుఎస్.రజాక్, డీజీఎం లెజిస్లేట్ లేఅవుట్ ఆనంద్‌కుమార్, మైన్స్ మేనేజర్ శశిభూషణ్‌కుమార్, మేనేజర్ హైడ్రో ఇంజనీర్ ఉండగా ఈ కార్యక్రమంలో డీడీ రఫీఅహ్మద్, ఆర్ఐ బాగీలాల్, రెవెన్యూ సిబ్బంది, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ట్రాక్‌లను పరిశీలించిన రైల్వే బోర్డు ఛైర్మన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైల్వే బోర్డు ఛైర్మన్ అశ్విని లోహానీ ఈ నెల 6, 7 తేదీల్లో తీవ్రమైన చలిని కూడా లెక్క చేయకుండా ఢిల్లీ - రావారీ సెక్షన్‌లో పెట్రోలింగ్ సిబ్బందితో కలిసి నైట్ పెట్రోలింగ్ నిర్వహించారు. సిబ్బంది పని పరిస్థితులను క్షేత్ర స్థాయిలో స్వయంగా తెలుసుకొని వారి సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకొనేందుకు ఆయన పెట్రోలింగ్ నిర్వహించడం జరిగిందని భారతీయ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. పెట్రోలింగ్‌లో భాగంగా ఆయన చలిని కూడా లెక్క చేయకుండా ట్రాక్ వెంట సుమారు రెండు కిలోమీటర్లు నడిచారని పేర్కొంది. పెట్రోలింగ్ సిబ్బందితో అశ్విని లోహానీ సంభాషించారు. చల్లని చలిలో పెట్రోలింగ్ నిర్వహించడానికి వారు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇది కష్టతరమైన పని అని వ్యాఖ్యానించారు. సిబ్బంది భద్రతా పరికరాలు, రక్షిత దుస్తులు, బూట్లు, చలి నుండి కాపాడే నిండైన ఉన్ని దుస్తుల గురించి విచారించారు. అవసరమైన చర్యలు, మార్పుల కోసం వెంటనే ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి వెంటనే ఓవర్ కోట్, నాణ్యమైన జాకెట్స్ ప్రతి సంవత్సరం పంపిణీ చేయాలని ఆదేశించారు. నాణ్యమైన పారిశ్రామిక బూట్లను కొనుగోలు చేసి సిబ్బందికి అంద చేయాలని, యూనిఫార్మ అలవెన్సుకు ఇవి అదనం అని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పెట్రోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి అత్యంత కాంతివంతమైన ఛార్జబుల్ టార్చ్‌లైట్లను అందచేయాలని, కిరోసిన్ ఆధారిత ల్యాంపుల స్థానంలో ఎల్ ఈ డి ఆధారిత హెచ్ ఎస్ ల్యాంపులు అందచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

23న నల్గొండలో నిరుద్యోగ గర్జన



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ 23న నల్గొండలో నిరుద్యోగుల గర్జన సభను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ నిరుద్యోగ జేఏసీ తెలిపింది. ఆదివారం నిరుద్యోగ జేఏసీ సమావేశం బీసీ భవన్‌లో జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశం అనంతరం నిరుద్యోగ గర్జన పోస్టర్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డాక్టర్ ర్యాగ అరుణ్, గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ సింగం లక్ష్మినారాయణ, భూపేష్ సాగర్, జి కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసే వరకు పోరాటం కొనసాగించాలని ఆర్ కృష్ణయ్య నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. ఉద్యోగ ఖాళీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రచారం చేసిన టిఆర్ఎస్ ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వకుండా తిరిగి ఎన్నికలకు వస్తే నిరుద్యోగులు నిలదీయాలని స్పష్టం చేశారు. వెంటనే గ్రూప్-1, 3, 4 నోటిఫికేషన్లను జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 40వేల ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు జడ్చర్లకు కుంతియా

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామ చంద్ర కుంతియా సోమవారం జడ్చర్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. వచ్చే ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గంలో పాగా వేయాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షులు కెప్టెన్ ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా పలుమార్లు జడ్చర్లలో పర్యటించారు. తాజాగా కుంతియో నియోజకవర్గంలో పర్యటించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు. నియోజకవర్గంలోని బాలనగర్ మండలంలో జరిగే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, బూత్ కమిటీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనుబంధ సంఘాల ప్రతినిధులతో కూడా సమావేశమవుతారు. నియోజకవర్గ ఇంచార్జీ,పీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి ఆయన వెంట ఉంటారు.

గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ సమావేశం


రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌ను పటిష్టం చేయడంలో భాగంగా గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్రకుంతియా ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

తెలంగాణ చీడపురుగు రేవంత్

టీఎస్ఐఐసి ఛైర్మన్ బాలమల్లు ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రానికి ఎంఎల్ఎ రేవంత్‌రెడ్డి చీడ పరుగులా దాపురించాడని టిఎస్ఐఐసి ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు ధ్వజమెత్తారు. ఎంఎల్ఎను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి జైలులో చిప్పకూడు తిన్నా ఇంకా ఆయన తీరు మారలేదన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి కెటిఆర్ ప్రవర్తన మార్చుకోకపోతే తన అభిమానులతో ప్రతిచర్యలు తప్పవని రేవంత్ పిచ్చికూతలు కూస్తున్నారని, బ్లాక్ మెయిల్ రాజకీయ ఖల్‌నాయక్ రేవంత్‌కు ప్రజలు రాజకీయసమాధి కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ రేవంత్‌రెడ్డి అని, రాజకీయ ఉనికిని కాపాడుకోవడం, సంచలనాల కోసం కెసిఆర్, కెటిఆర్,మంత్రులపై నిందారోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లీన్ ఇమేజ్‌తో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి కెటిఆర్ పద్ధతి మార్చుకోకపోతే తన అభిమానులతో ప్రతి చర్యలు తప్పవనడం దుర్మార్గమన్నారు. ఇందుకు తన సామాజికవర్గం మద్ధతు కూడా ఉందని కులాలు, మతాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం అత్యంత హేయమని అన్నారు. రేవంత్ లాంటి చిల్లర రాజకీయ నేతల మాటలను ప్రజలెవరూ పట్టించుకోరని, మంత్రి కెటిఆర్ జోలికి వస్తే ఎలా బుద్ధి చెప్పాలో టిఆర్ఎస్ కార్యకర్తలకు తెలుసన్నారు.

పవన్ అభిమానుల నుంచి కాపాడండి



సోమాజిగూడ, ప్రభన్యూస్: పవన్ అభిమానుల సామాజిక దాడి నుంచి తనను రక్షించాలని కత్తి మహేష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం తనపై జరుగుతున్న దాడిపై బహిరంగ చర్చకు రావాల్సిందిగా పవన్‌కు సవాల్ విసిరిన కత్తి మహేష్ ఆదివారం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పవన్ అభిమానులు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని మహేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన వద్దకు వెళ్లేందుకు యత్నించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అదుపు చేసి, అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా పవన్ అభిమానులు సామాజిక మాధ్యమాలలో తనపై తీవ్రస్థాయిలో దాడి చేస్తున్నారని, సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఇక్కడికి రావాలని సూచించానన్నారు. అయితే పవన్ రాకపోగా అతని అభిమానులు తనపై దాడికి యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను దళితుడినని, సమాజంలో ఇంకా వివక్షత కొనసాగుతుందన్నారు. పవన్ అభిమానులకు ఒక్క మాట చెబితే ఆగిపోతారని, కానీ ఆయన చెప్పడం లేదని ఆరోపించారు. ఒక వేళ అభిమానులను ఆపలేని పవన్ రాష్ట్రాన్ని ఎలా పాలిస్తారని ప్రశ్నించారు. మొత్తంగా ఉద్దేశపూర్వకంగానే తనపై దాడికి పాల్పడుతున్నారని అన్నారు. అలాగే నటి పూనం కౌర్‌కు ఆయన ఆరు ప్రశ్నలు సంధించారు. ఏపీ బ్రాండ్ అంబాసిడర్ పదవి ఎలా వచ్చింది ? తిరుమలలో పవన్‌తో కలిసి ఒకే గోత్రంతో పూజలు చేయించుకున్నది నిజం కాదా ? ఆత్మహత్యకు యత్నిస్తే అడ్డుకున్నది ఎవరు ? ఆస్పత్రిలో చేరితే బిల్లులు కట్టింది ఎవరు? మీ అమ్మకు పవన్ చెవిలో ఏమని హామీ ఇచ్చారు ? త్రివిక్రమ్ అంటే కోపం ఎందుకు ? క్షుద్ర పూజలు నిర్వహించలేదా ? అని ప్రశ్నించారు. తాను చేసిన ఆరోపణలపై అభ్యంతరాలు ఉంటే తనపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే కోర్టుకే ఆధారాలు సమర్పిస్తానని పేర్కొన్నారు.

మళ్లీ గజల్ బెయిల్ పిటిషన్!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గజల్ శ్రీనివాస్ మరోసారి బెయిల్ పిటిషన్ వేయనున్నారు. రెండ్రోజుల క్రితం ఆయనకు కోర్టులో బెయిల్ మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో మరోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేసేందుకు ఆయన తరపు న్యాయవాది సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా గజల్ శ్రీనివాస్ పనిమనిషి పార్వతి పట్టుబడితే మరిన్ని విషయాలు వెలుగుచూస్తాయని భావిస్తున్నారు. గజల్ బాదితులు మరికొందరు ఉన్నారని బాధితురాలు చెబుతున్నారు. మరోవైపు గజల్ బాధితులు భయపడకుండా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు చెబుతున్నారు. గజల్ శ్రీనివాస్ ఇప్పటివరకు ఏపీ స్వచ్ఛాంధ్ర బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. లైంగిక ఆరోపణల నేపథ్యంలో ఆయనను కొనసాగించే ప్రసక్తి లేదని నిర్ణయించి అందుకనుగుణంగా ఉత్తర్వులు జారీచేసింది. గజల్ అనంతరం బ్రాండ్ అంబాసిడర్ ఎవరన్న విషయంపై సర్కార్ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గజల్ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణలు, అందుకు బలమైన సాక్ష్యాల నేపథ్యంలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ ప్రచారకర్త పదవికి ఆయన అనర్హుడని భావించి, ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. 2017 మే 28న స్వచ్ఛాంధ్ర మిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా గజల్ శ్రీనివాస్‌ను ఏపీ ప్రభుత్వం నియమించింది.

ఏపీ ఎంసెట్ నిర్వాహణ బాధ్యత అనంతపురం జేఎన్‌టీయూకు

హైదరాబాద్/అమరావతి, ఆంధ్రప్రభ : ఈ ఏడాది ఎంసెట్ నిర్వహణ బాధ్యతను అనంతపురం జేఎన్టీయూకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. రాష్ట్రం విడిపోయాక, ఉమ్మడి రాష్ట్రంలో మూడు దఫాలు ఎంసెట్‌ను కాకినాడలోని జెఎన్‌టీయూ నిర్వహిస్తూ వచ్చింది. వరుసగా ఒకే విశ్వవిద్యాలయానికి ఎంసెట్ లాంటి ముఖ్యమైన ప్రవేశ పరీక్షను నిర్వహించడం సబబు కాదని భావించిన ప్రభుత్వం ఈ ఏడాది ఈ పరీక్ష నిర్వహణను అనంతపురంలో జేఎన్‌టీయూకు ఇవ్వాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఎంసెట్‌తో పాటు ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్, ఈసెట్, పీజీఈసెట్, పీజీసెట్ ప్రవేశపరీక్షల తేదీలు ఈ పరీక్షలను నిర్వహించే విశ్వవిద్యాలయాల వివరాలను ఏపీ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రకటించనున్నారు. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేకంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంసెట్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 27వ తేదీ నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు ఆన్‌లైన్ ద్వారా జరపాలని ప్రతిపాదించారు. మిగతా ఉమ్మడి ప్రవేశపరీక్షలన్నింటినీ ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించాలని ఉన్నత విద్యామండలి ఇప్పటికే ఓ నిర్ణయం తీసుకుంది. ప్రశ్నాపత్రాల లీకేజీకి అవకాశం లేకుండా పకడ్బందీగా ఆన్‌లైన్ ద్వారానే ఈ పరీక్షలను జరపాలని ప్రతిపాదించింది. ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు పేరొందిన సాఫ్ట్‌వేర్ సంస్థతో ఇప్పటికే ఉన్నత విద్యామండలి ఒప్పందం కుదుర్చుకుంది. గతేడాది ఆన్‌లైన్ ద్వారా ప్రవేశపరీక్షలను నిర్వహించడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే పరీక్షను, ఫలితాలను విడుదల చేశామని మండలి అధికారులు చెప్పారు.

ఆయిల్ ట్యాంకర్ పేలి.. 32 మంది మృతి

బీజింగ్ : చైనాకు తూర్పు తీరంలో ఆయిల్ ట్యాంకర్ కలిగి ఉన్న నౌక పేలిన ఘటనలో 32 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో సిబ్బంది గల్లంతయ్యారు. మృతుల్లో 30 మంది ఇరానీయులు కాగా, ఇద్దరు బంగ్లాదేశీయులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. చైనాకు చెందిన రవాణా నౌకతో ఇరాన్‌కు చెందిన మరో నౌక ఢీకొట్టింది. పేలింది ఇరాన్‌కు చెందిన నౌకగా తేల్చారు. పేలిన సమయంలో ట్యాంకర్‌లో 1,36,000 టన్నుల ఆయిల్ ఉంది. ఘటన జరిగిన సమయంలో పెద్ద ఎత్తున నిప్పు రవ్వలు చెలరేగడంతో పాటు ఆ ప్రాంతం అంతా దట్టమైన నల్లటి పొగతో కమ్ముకునే వీడియోను స్థానిక చైనా మీడియా ప్రముఖంగా ప్రసారం చేసింది. ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం సంభవించిందని, చైనా రవాణా నౌకలో ఉన్న 21 మంది సిబ్బందిని మాత్రం రక్షించుకోగలిగామని ఆ దేశ మంత్రిత్వ శాఖ తెలిపింది. శాంఘైకు తూర్పున 160 నాటికన్ మైళ్ల దూరంలో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు గుర్తించారు. వెంటనే చైనా 8 నౌకలతో రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది.



పండక్కి వెళ్లేదెట్లా!

- ఆర్టీసీలో రిజర్వేషన్లు నిల్
- ప్రైవేట్ ట్రావెళ్ల చార్జీల భారం
- రైళ్లలో సంపన్నులుకే పెద్దపీట
- సాధారణ బోగీలకు విజ్ఞప్తి

అమరావతి, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగ సీజన్ నేపథ్యంలో ఏపీఎస్ఆర్టీసీ బిజీగా మారింది. రద్దీని క్యాష్‌గా మలుచుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. కనీసం ఈ విధంగానైనా నష్టాలు పూడ్చుకుందామని భావిస్తోంది. దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పండుగ రద్దీతో ఆర్టీసీ బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. పండుగ రోజుల్లో రోజుకు కనీసం లక్ష మంది ప్రయాణికులను వారి వారి గమ్యాలకు చేర్చాలని ఆర్టీసీ అధికారులు లక్ష్యంగా ఎంచుకున్నారు. ఈసారి గత సంవత్సరం కంటే రెట్టింపు మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఏపీఎస్ ఆర్టీసీ చర్యలు తీసుకున్నది. గత ఏడాడి సంక్రాంతి పండుగ , కొత్త సంవత్సరం సందర్భంగా నడిపిన ప్రత్యేక బస్సుల వల్ల ఏపీఎస్ఆర్టీసీకి రూ 4.38 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి కనీసం రూ.10 కోట్ల ఆదాయాన్ని సంపాదించడమే లక్ష్యంగా ఏపీఎస్ఆర్టీసీ చర్యలకు ఉపక్రమించింది. సాధారణంగా వసూలు చేస్తున్న చార్జీలపై అదనంగా 50 శాతాన్ని వసూలు చేస్తుండడంతో లక్ష్యాన్ని తేలికగానే చేరుకుంటామంటున్నారు.ఈనెల 9వ తేదీ నుంచి 13 వరకు ఈ ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాలకు నడపనున్నారు. ఇందుకు సంబంధించి ఆర్టీసీ అధికారులు ఇప్పటికే డ్రైవర్లకు డ్యూటీలు కూడా వేశారు. ఆయా మార్గాల్లో బస్సులను నడిపేందుకు సర్వం సిద్ధం చేశారు. విజయవాడ, హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏపీఎస్ ఆర్టీసీ చర్యలు తీసుకున్నది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఏపీఎస్ఆర్టీసీ 2,135 బస్సులు ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్రాల నుంచి మొత్తం 5,397 బస్సులు ప్రయాణికులకు సేవలందించేందుకు చర్యలు తీసుకున్నారు. సంక్రాంతి ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఉంటున్న తెలుగువారి కోసం టీఎస్ఆర్టీసీ 3,262 బస్సులు నడపాలని నిర్ణయించగా, ఏపీఎస్ ఆర్టీసీ 2,135 బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, అనంతపురం, నెల్లూరు, రాజోలు,భీమవరం , ఒంగోలు, తిరుపతి, కర్నూలు, అమలాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం, కాకినాడ,తదితర ప్రాంతాలకు రోజు వారీ తిరిగే బస్సులతో పాటు అదనపు సర్వీసులను నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ పాటు కామారెడ్డి , నల్గొండ వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వంటి ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పండుగ తర్వాత కూడా తిరుగుప్రయాణంలో కూడా ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేకబస్సులను నడపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయా మార్గాల్లో ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం , సీట్లు కూడా ఇప్పటికే భర్తీ అయ్యాయంటున్నారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ ఆర్టీసీ కంటే రెట్టింపు చార్జి వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు విజయవాడ నుంచి ముంబై, విశాఖపట్నం, చెన్నై, విజయనగరం, బెంగుళూరు, షిర్డీ, బళ్లారి, కొల్హాపూర్, బర్హంపూర్ రూట్లలో మరింత డిమాండ్ ఉండడంతో ప్రైవేట్ ట్రావెళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయంటున్నారు. కాగా ఇక రైళ్ల పరిస్థితికి కూడా ఇందుకు భిన్నంగా లేదంటున్నారు. ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు వాటిల్లో సంపన్నులకే పెద్దపీట వేశారనే విమర్శలున్నాయి. కొన్ని ప్రత్యేక రైళ్లల్లో ఏసీ మినహా సాధారణ బోగీల అడ్రసే లేదు. దీంతో సాధారణ ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జనవరి 1 నుంచి 31 వ తేదీ వరకు వివిధ మార్గాల్లో తిరుగుతున్న 16 రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేశారు.వీటిలో ఏసీ బోగీలే ఉన్నాయి. సాధారణ బోగీలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదంటున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి,ప్రత్యేకించి,అదనపు బోగీలు ఏర్పాటు చేసిన రైళ్లో సాధారణ బోగీలు కూడా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఫిబ్రవరిలో గ్రామీణ విద్యా సదస్సులు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం పూర్వ ప్రాథమిక క్లాసులు(ప్రీప్రైమరీ క్లాసులు)ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. సమాంతరంగా ఇంగ్లీష్ మీడియంను ప్రారం భించాలని ఆదివారం జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్ర అధ్యక్షులు చిలుకరాజు రాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్రఆఫీస్ బేరర్స్ సిహెచ్ దుర్గా భవాని, కె సోమశేఖర్, ఎన్ కిష్టయ్య, ఏ నర్సిరెడ్డి, పి మాణిక్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. జూలై నుంచి రావల్సిన డిఏను వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2018 జూలై నాటికి 11వ పిఆర్‌సి గడువు ముగుస్తున్నందున పిఆర్‌సి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్ఎస్ఎస్ తెలంగాణ సంఘ్‌చాలక్‌గా బూర్ల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రాంత సంఘచాలక్‌గా బూర్ల దక్షిణామూర్తిని ఎన్నుకున్నారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణలో జరిగే కార్యక్రమాలన్నీ ఇక నుంచి వీరి ఆధ్వర్యం లో జరుగనున్నాయి. ఈయన 1978 నుంచి స్వయం సేవక్‌గా పని చేస్తున్నా రు. గత కొంత కాలంగా ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌లోని మహిళా డిగ్రీ కళాశాల, కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించారు. వారు కరీంనగర్‌లో నివసిస్తున్నారు. ఇంతకాలం తెలంగాణ ప్రాంత సంఘచాలక్‌గా బాధ్యతలు నిర్వహించిన ప్యాట వెంకటేశ్వర్‌రావు ఆరేళ్ళుగా కొనసాగారు. వయసు, ఆరోగ్యం సహకరించక పోవడంతో బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఇక నుంచి వెంకటేశ్వరరావు ప్రాంత కార్యకారిణి సభ్యులుగా కొనసాగుతారు.

జడ్జీల నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించండి

- బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ డిమాండ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని హైకోర్టు అడ్వకేట్ల సమావేశం డిమాండ్ చేసింది. ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేయాలని సమావేశంలో పాల్గొన్న అడ్వకేట్లు డిమాండ్ చేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎన్ శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొనగా, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ప్రసంగించారు. సమావేశంలో హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ జల్లి కనకయ్య, గుండ్రాతి శారదా గౌడ్, సామల రవీందర్, సదానందం, మహేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. హైకోర్టులో ఇప్పటి వరకు అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీలుగా బీసీలు నియామకం కాలేదని ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. స్టాడింగ్ కౌన్సిల్‌లో జిపి, ఏజిపిలలో 54 శాతం వాటా రావల్సి ఉండగా బీసీలకు ఇంత వరకు కనీసం 5 శాతం కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ పోస్టుల్లో ఒకటి బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పిపి, అడిషనల్ పిపి పోస్టుల్లో ఖచ్చితంగా బీసీలు ఉండాలని, రాష్ట్రంలోని అన్ని రకాల న్యాయాధికారుల నియామకాల్లో బీసీలకు 54 శాతం వాటాను బీసీలకు కల్పించాలని, తెలంగాణ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలని అడ్వకేట్ల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని ఎర్ర సత్యనారాయణ తెలిపారు.

కరవును తరిమేస్తా

- ప్రకృతిని రక్షిస్తే మనల్ని కాపాడుతుంది
- ఖనిజాలు మన సహజ సంపద
- గ్రీనాంధ్రప్రదేశ్‌గా మారుద్దాం
- నదులను అనుసంధానిస్తాం
- పోలవరం పూర్తిచేసే వరకూ నిద్రపోను: ఏపీ సీఎం

కర్నూలు, ప్రభ న్యూస్ బ్యూరో : ప్రకృతి ఆరాధనతోనే సహజాభివృద్ధిని సాధించగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని సిద్ధాపురం గ్రామంలో ఆదివారం జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అపారంగా సహజ వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటటడం ద్వారా రాష్ట్రాన్ని గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని మనం రక్షిస్తే అది తిరిగి మనల్ని అన్నివిధాలా రక్షిస్తుందని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ రెండేళ్లుగా వృద్ధిరేటును సాధిస్తున్నట్టు చెప్పారు. నీటిని, అడవులను, ఖనిజాలను సంరక్షించుకుని, సద్వినియోగం చేసుకుంటే దేశంలోనే ప్రధమ స్థానంలో నిలుస్తామని చంద్రబాబు అన్నారు.

అంతకుముందు సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో సాగునీటికి, తాగునీటికి కొరత లేకుండా చేస్తానని చెప్పారు. నదులను అనుసంధానిస్తామని, పోలవరంను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తానని, రాష్ట్రం నుంచి కరవును తరిమివేస్తానని గ్రామస్తుల హర్షధ్వానాల మధ్య చంద్రబాబు అన్నారు. యువతతోనే మార్పు సాధ్యమని, మహిళా సాధికారికతే లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు.

రాష్ట్రంలో మహిళా సాధికారితనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెడుతోందని , యువతతోనే మార్పు సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. తనకు రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల మంది ఆడపడుచులు ఉన్నారని , వారి దీవెనలే శ్రీరామరక్ష అన్నారు. అంత పెద్ద సైన్యం తన వెంట ఉందని అంతకంటే తనకు ఇంకేమి కావాలని చెప్పారు. చెంచులకు పక్కా గృహాల నిర్మాణాల కోసం ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ. 1.50 లక్షలకు అదనంగా మరో రూ. 75 వేలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. జన్మభూమి -మాఊరు కార్యక్రమంలో రూ.24.28 కోట్ల వడ్డి లేని రుణాల చెక్కును అందజేశారు. కార్యక్రమం సజావుగా నడిపించిన జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆత్మకూరు ఎంపీపీ సౌజన్య, జెడ్‌పిటిసి వెంకటరాముడు, గ్రామ సర్పంచు రవణమ్మ, ఎంపీటీసీ నాగునాయక్, సింగిల్ విండో చైర్మన్ జెడ్ శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సిద్ధించిన కల... ఎత్తిపోతల ప్రారంభం

పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి సహకారంతో అన్ని అడ్డంకులు తొలగిపోయాయని ఇక పనులు చకచకా ప్రారంభమవుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. సాధ్యమైనంత త్వరగా పోలవరాన్ని పూర్తి చేసి రాష్ట్రం నుండి కరవును శాశ్వతంగా పారదోలుతానని సీఎం భరోసా కల్పించారు. జలసిరికి హారతి కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం కర్నూలు జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ సభనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా గుర్తించబడిన పోలవరం ప్రాజెక్టుకు మొదట్లో చాలా అడ్డంకులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న ఏడు మండలాలను ఆంధ్ర రాష్ట్రంలో కలపకపోయి ఉంటే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగేది కాదని చెప్పారు. తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేస్తేనే ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తానని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తాను వివరించినట్లు స్పష్టం చేశారు. అప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని మన రాష్ట్ర ప్రజలను గౌరవించి మొదటి కేంద్ర కేబినెట్ సమావేశంలోనే తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రకు కేటాయించేలా తీర్మాణం చేయించడంలో తాను కీలకపాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ ప్రజలకు జీవనాడిగా ఉన్న పోలవరం పూర్తయితే రాష్ట్రంలో కరువు సమస్యే తలెత్తదని చెప్పారు. గత కొంత కాలంక్రితం పోలవరంపై కొన్ని సమస్యలు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో పరిష్కారానికి మార్గం సుగమమైందని తెలిపారు. కేంద్ర మంత్రి గడ్కరీ పోలవరంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని ఆటంకాలను తొలగించాడని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి సోమవారం తానే స్వయంగా ప్రాజెక్టు నిర్మాణ పనులపై అధికారులతో , కాంట్రాక్టర్లతో సమీక్ష చేపట్టి పనులు వేగవంతం అయ్యేలా చూస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాదిలోనే కాఫర్ డ్యాం పూర్తి చేసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయ పడ్డారు. అయినప్పటికి కాఫర్ డ్యాంకు అన్ని అనుమతులు క్లియరెన్స్ కావడంతో త్వరలో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. పోలవరం ప్రాజెక్టులో దాదాపు 300 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిలువ ఉంచుకోవచ్చునని ఇందులోనే 9600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని కూడా చేసుకోవచ్చునని ముఖ్యమంత్రి చెప్పారు. జలవనరుల కోసం రూ. 50 వేల కోట్లను ఖర్చు చేసిన ఘనత దేశంలోనే తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 27 ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి వాటిలో ప్రస్తుతం ఏడు ప్రాజెక్టులను పూర్తి చేశానని త్వరలో 11 ప్రాజెక్టులను కూడా పూర్తి చేస్తామని మిగిలిన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 40 నదులు, 40117 చెరువులు, 1196 ఎత్తిపోతల పథకాలు, 59176 చెక్ డ్యాంలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. వీటి ద్వారా 6,32,000 హెక్టారులకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది గోదావరినది నుంచి 3 వేల నుంచి 4 వేల టీఎంసీల దాకా నీరు వృధాగా సముద్రంలో కలుస్తుందని ఈ నీటిని ఎక్కడికక్కడే ఒడిసి పట్టుకుంటే రాష్ట్రంలో పంటలను సస్యశ్యామలం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. నదుల అనుసంధానం కింద ఇప్పటికే గోదావరి నుంచి కృష్ణ డెల్టాకు, పట్టిసీమకు నీళ్లు తీసుకెళ్లే కార్యక్రమం పూర్తయిందని తెలిపారు. కృష్ణ, డెల్టాకు దక్కాల్సిన నీటి వాటాను శ్రీశైలం డ్యాంలో నీటిని నిలువ చేసి సీమకు తరలించి ఇక్కడి పంటలను కాపాడినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నదుల అనుసంధానాన్ని కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

తెరాస గూటికి 'కొమ్మూరి'!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అధికార టిఆర్ఎస్‌కు రాష్ట్రంలో ప్రత్యామ్నాయం కావడంతో పాటు 2019 ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునే వ్యూహాలను సిద్ధం చేస్తున్నామంటున్న బిజెపి నేతలకు షాక్ ఇచ్చేందుకు మాజీ ఎంఎల్ఎ సిద్ధమయ్యారు. టిఆర్ఎస్ నుంచి ఎంఎల్ఎగా ఎన్నికై ఆ తర్వాత వైసిపిలో చేరి అనంతరం పరిణామాల వల్ల బిజెపిలో చేరిన జనగామ మాజీ ఎంఎల్ఎ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తిరిగి సొంతగూటికి చేరేందుకు ఏర్పాట్లను పూర్తి చేసుకున్నారు. సోమవారం బిజెపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించనున్నారు. గతంలో చేర్యాల నియోజకవర్గం నుంచి కొమ్మూరి ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో చేర్యాల కనుమరుగైంది. మంత్రి హరీష్‌రావుతో భేటీ అయిన కొమ్మూరి జనగామ ఎంఎల్ఎ టికెట్‌పై ఎలాంటి హామీని పొందలేదని, అయినప్పటికీ టిఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారని ఆయన అనుచరులు అంటున్నారు. ప్రస్తుతం జనగామ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వ్యవహారంలో ముఖ్యమంత్రి కెసిఆర్ కొంత అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో భవిష్యత్‌లో కొమ్మూరికి అవకాశం ఇచ్చేందుకు మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారని తెలిసింది.

ముగిసిన టిఆర్‌టి దరఖాస్తుల ప్రక్రియ

2.93 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రం లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహించే ఉపాధ్యాయ నియామక పరీక్ష(టిఆర్‌టి) దరఖాస్తు ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. ఆదివారం చివరి రోజు కావడం సెలవు దినం అయినప్పటికీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నందున ఎక్కువ మందే దరఖాస్తులను సమర్పించారు. టిఆర్‌టికి ఎస్‌జిటి, ఎస్ఏ పోస్టులకు కలిపి రాష్ట్రవ్యాప్తంగా 2,93 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న టిఆర్‌టికి దరఖాస్తు చేసుకోవడానికి ఆదివారంతో గడువు ముగిసింది. అభ్యర్థులు ఎడిట్ ఆప్షన్‌ను 11 వరకు కొనసాగించుకోవచ్చు. స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు 1,85 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, ఎస్‌జిటి పోస్టులకు 1.08 లక్షల దరఖాస్తు చేసుకున్నారు.

'పెట్టుబడి' పథకంపై నేడు ఉపసంఘం తొలిభేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పంట పెట్టుబడి మద్దతు పథకంపై ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం మొదటిసారి భేటీ కానుంది. రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన గల ఈ ఉపసంఘంలో మరో నలుగురు మంత్రులు ఉన్నారు. సచివాలయంలో 'డి' బ్లాక్‌లో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. రైతు కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనివ్వాలన్న సీఎం కేసీఆర్ సంకల్పం మేరకు పథకం అమలుకు గల అవరోదాలపై లోతుగా చర్చించనున్నారు.

అవినీతి అంతు తేలుస్తాం

- చంద్రగిరి పాదయాత్రలో వైఎస్ జగన్

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాలో అభివృద్ధి పథకాల మాటున చోటుచేసుకున్న అవినీతి ఆరోపణలపై ప్రత్యేకంగా విచారణ జరిపిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం జగన్ మధ్యాహ్నం వరకు చంద్రగిరి నియోజకవర్గంలో, సాయంత్రం వరకు పూతలపట్టు నియోజకవర్గంలో పాదయాత్రను కొనసాగించారు. ఉదయం పుదిపట్ల బైలు, గుండ్లగుట్ల పల్లి మీదుగా దామలచెరువుకు చేరుకున్న జగన్ రచ్చబండ పేరుతో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చంద్రగిరి శాసనసభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తెలుగుదేశం వర్గీయుల అరాచకాలు పెరిగిపోయాయని, పాకాల మండలంలోని 199 ఇళ్లున్న గ్రామంలో 250 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినట్టు బిల్లులు చేసుకున్నారని, కేవలం మండల అధికారిని బలిచేసి అధికారపార్టీ నాయకులంతా తప్పించుకున్నారని వివరించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ చంద్రగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా 1978 ఎన్నికల్లో పోటీచేసి, 2,500 ఓట్ల మెజారిటీతో గెలిచిన చంద్రబాబు 1983లో 17 వేల ఓట్ల మెజారిటీతో ఓడిపోగానే చంద్రగిరి అభివృద్ధి పట్టించుకోవడం మానేశారన్నారు. తన అవసరాల కోసం ప్రజల్నే కాదు, మామనైనా, తమ్ముడినైనా మోసం చేయడానికి వెనుదీయరని ఆరోపించారు. ఏ దేశానికి వెళ్తే రాష్ట్రాన్ని ఆదేశంలా మార్చేస్తానని చెప్పుకున్న చంద్రబాబు గతంలో 9 ఏళ్లు, ప్రస్తుతం 3 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా తాను చిన్నప్పుడు చదువుకున్న శేషాపురం పాఠశాలను కూడా బాగుచేసుకోలేక పోయారని విమర్శించారు. ఆయన పై స్థాయిలో దోచుకుంటూ ఉంటే ఆయన పార్టీ నాయకులు జన్మభూమి కమిటీల మాఫియా ద్వారా కింది స్థాయిలో మరుగుదొడ్లను కూడా వదలకుండా దోచుకుంటున్నాయన్నారు. భగవంతుని ఆశస్సులతో వచ్చే ఎన్నికలలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చిత్తూరు డెయిరీని తెరిపించడంతో పాటు పాడి రైతులకు లీటర్ కు రూ. 4 బోనస్‌గా ఇస్తానని, చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తానని హామీలిచ్చారు. సభకు వచ్చిన సామాన్య ప్రజలు ముఖాముఖి చర్చ ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై స్పందిస్తూ ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సిఎం జిల్లాలో జరిగిన అన్ని రకాల అవినీతి కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షిస్తానన్నారు. మధ్యాహ్నం భోజన విరామానంతరం పూతలపట్టు నియోజకవర్గంలోని కొట్టాల క్రాస్ గుండా గుండ్లపల్లె, సవతపలలి, పాలకల సంతగేటు, పాటూరు మీదుగా మొరవపాటూరు వరకు పాదయాత్రను కొనసాగించారు.

ఈ కార్యక్రమాలలో పార్టీ సీనియర్ నేతలు విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, నారాయణస్వామిలతో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు. 55వ రోజు పాదయాత్రను ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 14 కిలోమీటర్ల దూరం కొనసాగించిన జగన్ సోమవారం పూతలపట్టు కేంద్రంలో సభను నిర్వహించిన తర్వాత గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ప్రవేశించనున్నారు.

సర్పంచ్‌కే పవర్



- పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రక్షాళన
- పారదర్శకతకు పెద్దపీట
- సర్పంచులకు విశేష అధికారాలు
- కొత్త చట్ట రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘం
- కేబినెట్ సబ్ కమిటీలో సీనియర్లకు స్థానం
- త్వరలో ముసాయిదా సిద్ధం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రక్షాళనకు కేసీఆర్ సర్కారు వేగంగా అడుగులు వేస్తోంది. గ్రామ పంచాయతీ పాలనను మరింత పారదర్శంగా, జవాబుదారి తనంగా చేస్తూ కొత్తచట్టంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. గ్రామపంచాయతీ ఎన్నికల వ్యవస్థలో పెద్ద ఎత్తున సవరణలు చేపట్టింది. అంతేకాకుండా సర్పంచులకు విశేషమైన అధికారాలను కట్టబెట్టాలన్న నిర్ణయం తీసుకుంది. పంచాయతీల అభివృద్ధికి అవసరమైన నిధులను నేరుగా పంచాయతీలకే అందచేయాలన్న అభిప్రాయంతో ఉన్న ప్రభుత్వం సర్పచులకు విధులతో పాటు బాధ్యతలను కూడా కల్పిస్తూ కొత్త చట్టంలో నిభంధనలు పొందుపరుస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పంచాయతీరాజ్ కొత్త చట్టం ఏవిధంగా ఉండాలన్న దానిపై ఇప్పటికే అధికారులకు దిశా నిర్దశం చేశారు. ఇప్పటికే పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనపై నిపుణుల కమిటీని నియమించిన ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించటంపై వేగంగా అడుగులు వేస్తోంది. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి వర్గ ఉపసంఘాన్నికూడా నియమించారు. ఆదివారం నాడు ఇందుకు సంబందించిన ఆదేశాలు కూడా వెలువడ్డాయి. మంత్రి వర్గ ఉపసంఘంలో సీనియర్ మంత్రులకు పెద్దపీట వేశారు. గత ప్రభుత్వాల్లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రులుగా, జిల్లా పరిషత్ ఛైర్మన్లుగా పనిచేసిన వారికి మంత్రి వర్గ ఉపసంఘంలో స్థానం కల్పిచారు. దేశంలోనే ఆదర్శవంతమైన పంచాయతీరాజ్ వ్యవస్థకు తెలంగాణ రాష్ట్రం నుంచే అంకురార్పణ చేయాలన్న నిర్ణయం తీసకున్న తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పంచాయతీరాజ్ వ్యవస్థను సమర్థవంతంగా, ఆదర్శవంతంగా అమలు చేస్తూ గ్రామసీమల అభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్రాల్లో నిపుణుల బృందాల ద్వారా అధ్యయనం చేయించింది. అన్నింటిని విష్లేశించి మెరుగైన, తెలంగాణ రాష్ట్రంలో అమలుకు ఉపయుక్తమైన కొన్ని అంశాలను పరిశీలనకు స్వీకరించింది. నిపుణుల కమిటీ అద్వర్యంలో కొత్త పంచాయతీరాజ్ చట్టం ముసాయిదా ప్రతిపాదనలు తుదిదశకు చేరుకున్నట్టు సమాచారం. అయితే అంతటితోనే సంతృప్తి చెందని ప్రభుత్వం సీనియర్ మంత్రులను కూడా ఈ చట్టం రూపకల్పనలో భాగస్వాములను చేసింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుభవం, మంచి అవగాహన ఉన్న మంత్రుల సేవలను కూడా కొత్త చట్టం రూపకల్పనలో ఉపయోగించుకోవాలన్న నిర్ణయం తీసుకుంది. సీనియర్ మంత్రుల సలహాలు సూచనలతో నూతన పంచాయతీరాజ్ చట్టానికి మరిన్ని మెరుగులు దిద్దబోతుంది.

మంత్రి వర్గ ఉప సంఘం ఛైర్మన్‌గా జూపల్లి



రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఏడుగురు సభ్యులతో కూడిన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావును ఈ మంత్రివర్గ ఉపసంఘానికి ఛైర్మన్‌గా నియమించారు. మిగిలిన ఉపసంఘం సభ్యుల ఎంపికలో కూడా ముఖ్యమంత్రి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఉపసంఘం పనితీరు మొక్కుబడిగా కాకుం డా చట్టం రూపకల్పనలో వారి అనుభవం, మేధస్సును ఉపయోగించుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చినట్టు స్పష్టమ వుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు మంత్రివర్గంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డికి మంత్రివర్గ ఉపసంఘంలో స్థానం కల్పించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గంలో తొలితెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న రాష్ట్రపురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు కూడా పంచాయరాజ్ చట్టం రూపకల్పనకు సంబంధించిన మంత్రి వర్గ ఉపసంఘంలో అవకాశం కల్పిం చారు. గతంలో అదిలా బాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పనిచేసి పంచాయతీరాజ్ వ్యవస్థ ట్ల క్షేత్రస్థాయిలో అనుభవం గడించిన రాష్ట్ర దేవాదాయ గృహనిర్మాణ శాఖల మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కూడా మంత్రివర్గం ఉపసంఘంలో సభ్యులుగా నియమించారు. గత ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అనుభవంతోపాటు గ్రామ స్థాయి పంచాయతీ పాలనలో మంచి అవగాహన ఉన్న తుమ్మల నాగేశ్వరరావుకు కూడా ఉపసంఘంలో అవకాశం ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి ఏవిధంగా ఉండాలి, పంచాయతీల పాలనా వ్యవస్థను ఏవిధంగా మెరుగు పరచాలి అన్న అంశాలపట్ల అవగాహన ఉన్న ఈటెలను కూడా మంత్రివర్గ ఉపసంఘంలో సభ్యుడిగా నియమించారు.

మేడారం జాతరకు 4వేల బస్సులు

- 50కేంద్రాల నుండి తిప్పేందుకు చర్యలు
- విశాలమైన టర్మినల్, కనీస వసతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేడారం జాతరకు 4 వేల బస్సులు తిప్పబోతున్నారు. జనవరి 31 నుండి ఫిబ్రవరి 3 వరకు జాతర జరగనుంది. బస్సులు తిప్పడానికి అవసరమైన ఏర్పాట్లను ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవీందర్, సత్యనారాయణకు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ నెల 10వ తేదీన ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణారావు ఉన్నత స్థాయి సమీక్షనిర్వహించే అవకాశం ఉంది. అత్యధికంగా వరంగల్, హన్మకొండ, కాజీపేట, కరీంనగర్, మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి నుండి ఆర్టీసీ బస్సులను తిప్పడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ రీజియన్లను అప్రమత్తం చేశారు. ఇప్పటికే కొన్ని డిపోల నుండి మేడారంకు బస్సులను తిప్పడం పెంచేశారు. మేడారంలో తాత్కాలిక టర్మినల్, వసతుల కల్పన పైన స్థానిక అధికారులు దృష్టి కేంద్రీకరించారు. గతంలో ఉత్పన్నమైన సమస్యలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

దాదాపు 10 లక్షల మంది భక్తులు మేడారం జాతరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు పొరుగు రాష్ట్రాల్లోని గిరిజన ఆవాసాలు, ప్రధానమైన 50 కేంద్రాల నుండి బస్సులను మేడారం తిప్పేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో 1.20 లక్షల ఖాళీలున్నాయ్

- నోటిఫికేషన్ కాదు రిక్రూట్ కావాలి
- తెలంగాణ ఉద్యోగుల సభలో ఎంపీ దత్తాత్రేయ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 1.20లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని కేంద్ర మాజీ మంత్రి ఎంపి బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం రవింద్రభారతిలో తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ సభలో దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రమంత్రులు ఈటెల రాజేందర్, లక్ష్మారెడ్డి, ఎంపి కొండా విశ్వేశ్వరరెడ్డి తదితరులు గౌరవ అతిధులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో ఎన్నినోటిఫికేషన్లు ఇచ్చిందన్న దానికంటే ఎంతమందికి నియామక పత్రాలు ఇచ్చిందన్నదే ముఖ్యం అన్నారు. కేంద్ర కార్మిక ఉపాధికల్పనల శాఖ మాజీ మంత్రిగా తనవద్ద ఉన్న సమాచారం మేరకు 6872మందిని మాత్రమే నియమించారన్నారు. ఈ ఏడాదిలోపు సర్వీస్ కమీషన్ కోటాలోని ఉద్యోగఖాళీలన్నింటినీ భర్తీ చేయాలన్నా రు. ప్రతి ఉద్యోగికి సొంత ఇంటి నిర్మాణం కోసం కేంద్రప్రభు త్వం ద్వారా రూ.5లక్షలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రభుత్వ ఉద్యోగుల కృషి మరువలేనిదన్నారు. సకల జనుల సమ్మె అపూర్వం అని గుర్తిచేశారు. మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యోగులు ఇపుడు బంగారు తెలంగాణ రాష్ట్రంకోసం ఉద్యమంలా పనిచేయాలన్నారు. ఉద్యోగులకు, పాత్రికేయులకు హెల్త్‌కార్డుల పథకం మంచి స్పందన ఇచ్చిందన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పేదలకు మంచి వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అన్నారు. కేసీఆర్ కిట్లపథకం అమల్లోకి వచ్చాక డెలివరీ కేసులు బాగా పెరిగాయన్నారు. ఎంపి కోండా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్దిలో ఉద్యోగుల కృషి ఎనలేనిదిన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరింస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మరింత అంకితభావంతో కృషిచేసి బంగారు తెలంగాణను నిర్మించుకుందామ న్నారు. తెలంగాణ రాష్ట్ర సర్వీస్ కమీషన్ సభ్యులు విఠల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగులంతా రెండు గంటలు ఎక్కవ పనిచేస్తామని ఉద్యమ సందర్భంలో ప్రకటించారని ఇపుడు ఏకంగా ఎడెనిమిది గంటలు అధికంగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి 62వేల ఉద్యోగాల భర్తీకి ఆర్థిక పరమైన ఆమోదం లభించిందన్నారు. సర్వీస్‌కమీషన్ ద్వారానే 35వేల ఉద్యోగాలకు క్లియరెన్స్ లభించిందన్నారు. . ఈ నెల చివరినాటికి 30వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించి పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఉద్యోగసఘం అధ్యక్షుడు పద్మాచారి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో బ్రేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవి ప్రసాద్, శ్రీకాంత్ రావు, పవన్ కుమార్, వి.సురేందర్, టీఎన్జీవో అధ్యక్షడు రవీందర్ రెడ్డితోపాటు వి.మల్లయ్య, శివశంకర్, చంద్రశేఖర్ గౌడ్ .బి.రాజేశం, లక్ష్మణ్, రాజేందర్, ఏ సత్యనారాయణ, పి, కృష్ణమూర్తి, గడ్డం శంకర్ తదితర ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు ఉద్యోగసంఘం డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు.

తెదేపాకు ఆదరణ తగ్గలేదు

- ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుంటేనే కేసీఆర్ మళ్లీ సీఎంగా అయ్యే ఛాన్స్
- వచ్చే ఎన్నికల్లో తెదేపాతో పొత్తుపెట్టుకున్న పార్టీలకే రాజకీయ ప్రయోజనం
- తెదేపా నేత మోత్కుపల్లి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రస్తుతం కేసీఆర్ పాలనలో సామాజిక న్యాయం పూర్తిగా లోపించిందని....ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే ప్రజలే తగు రీతిలో బుద్ది చెబుతారని తెదేపా సీనియర్ నాయకుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు హెచ్చరించారు. ఒక స్నేహికుడిగా కేసీఆర్‌ను అభిమానిస్తానని....కానీ ముఖ్య మంత్రిగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న కార్యక్రమాలు అంతగా ఆకట్టుకో 'వడం లేవన్నారు. ఎన్టీఆర్‌ను కేసీఆర్ స్ఫూర్తిగా తీసుకుని అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తేనే ....తిరిగి ఆయన ముఖ్య మంత్రి కుర్చీలో కూర్చునే అవకాశముం టుందన్నారు.

ఆదివారంఒక ఎలక్ట్రానిక్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కేసీఆర్ పాలనలో దళిత వర్గాలకు, మహిళలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దీని ప్రభావం వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీపై పడడం తథ్యమన్నారు. తెదేపా నుంచి నేతలు వలసపోయినప్పటికీ క్యాడర్ మాత్రం చెక్కుచెదరలేదన్నారు. ఇటీవల పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు గంటల పాటు ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ వచ్చిన సమయంలో వేలాది మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. చివరకు తాను ఇటీవల నల్గొండ జిల్లాలో నిరసన కార్యక్రమానికి పూనుకుంటే గ్రామగ్రామాలు తరలివచ్చాయన్నారు. తెలంగాణ ప్రాంతంలో 'అభివృద్ధి జరిగిదంటే అది కేవలం తెలుగుదేశం పాలనలోనేని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం హయంలో చేపట్టిన కార్యక్రమాలే తప్ప ప్రస్తుతం కొత్తగా చేపట్టినవి ఏమున్నవని ఆయన ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాతో పెత్తుపెట్టుకునే పార్టీలకే ప్రయోజనం ఉంటుందే...తప్ప తమంతట తాము ఎవరి వద్దకు వెళ్ళమన్నారు. 2014 ఎన్నికల్లో అన్ని పార్టీలకు చెందిన ఓట్లు తెరాసకు పడితేనే 63 సీట్లు వచ్చాయన్నారు. అప్పుడే తెరాసకు 70 సీట్ల సంఖ్యకు చేరుకోలేదని....వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోతే ఆ పార్టీ పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం లేకపోలేదన్నారు. చంద్రబాబు నాయకత్వంపైనా...తెలుగుదేశం పార్టీపైనా తెలంగాణ ప్రజల్లో ఇంకా ఆదరణ, ఆత్మవిశ్వాసం తగ్గలేదన్నారు. తమ నాయకుడు చంద్రబాబు నాయుడు ఒక్కసారి రాష్ట్ర పర్యటనకు వచ్చి ఎన్నికల సంగ్రామానికి శ్రీకారం చుడితే ...అప్పుడు తెదేపా సత్తా ఏమీటన్నది తెలుస్తుంద న్నారు. తనకు మొదటి నుంచి ఎన్టీఆర్ అంటే ఎనలేని ప్రేమ, ఆప్యాయతా అనిఅన్నారు. తనకు గవర్నర్ పదవి రాకపోవడానికి చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ మధ్య కొంతకాలంగా అంతగా సఖ్యత లేని కారణం కూడా ఒకటి అయి ఉండవచ్చునన్నారు. అయితే రాజకీయాల్లో ఎప్పుడు...ఎలాంటి పరిణామాలు ఉత్పన్నం అవుతాయో తెలియవన్నారు. ఈ నేపథ్యంలో తాను నమ్మిన సిద్దాంతాలకు అనుగు ణంగా తెదేపాను మరింత పటిష్టం చేయడం.... పార్టీని అధికారంలోకి తీసు కరావడంలో తన వంతు కృషి చేస్తానని ఇంటర్వ్యూను ముగించారు.

జిల్లాల్లో 'నేను సైతం'కు అపూర్వ స్పందన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర పోలీసు బాస్ మహేందర్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది వారికి నిర్దేశించిన లక్ష్యసాధన దిశగా పరుగులు పెడుతున్నారు. హైదరాబాద్‌లో నేను సైతం ప్రాజెక్టుకు ఆయా ప్రాంత కమ్యూనిటీల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో జీహెచ్‌ఎంసీ పరిధిలో 10 లక్షల సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా అధికారులు, సిబ్బంది పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా జిల్లాల్లో సైతం నేను సైతం ప్రాజెక్ట ు కింద కమ్యూనిటీ సహకారంతో సీసీ కెమెరాల స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపు మేరకు కమిషనరేట్ల పరిధిలో కమిషనర్లు, జిల్లా స్థాయిలో ఎస్పీలు నేను సైతం ప్రాజెక్టుకింద వారి వారి పరిధిలో సీసీకెమెరాల ఏర్పాటుకోసం కమ్యూనిటీలో అవగాహన కల్పిస్తూ ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది చేయాల్సిన పనులు, పూర్తి చేయా ల్సిన పనులపై సైతం మహేందర్‌రెడ్డి కమిషనర్లకు, జిల్లా ఎస్పీలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. యాదా ద్రి-భువనగిరి జిల్లాలోని 17 పోలీస్‌స్టేషన్లు, 16 మండల హెడ్ క్వార్టర్స్‌లో కమ్యూ నిటీ సీసీటీవీ ప్రాజెక్టు కింద సీసీటీవీలు ఏర్పాటయ్యాయి. దీంతో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటులో ఇది మొదటి జిల్లా కావడం గమనార్హం. యాదాద్రి-భువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో సాయి కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన మెగా సిసి టీవీ కెమెరాలను సీపీ మహేష్ భగవత్ ప్రారంభించారు. ఓ ప్రణాళికాయుతంగా ముందకు సాగితే అనుకున్న లక్ష్యం పూర్తి కాగలదని మహేందర్‌రెడ్డి భావన. అదే విషయాన్ని జిల్లాల పర్యటనల్లో సైతం ఆయన పదే పదే ఉన్నతాధికారులకు, సిబ్బందికి చెబుతున్నారు. ప్రభుత్వం పోలీసు శాఖకు ఎనలేని సహకా రాన్నందిస్తుందని, సిబ్బంది సమస్యలను తీర్చడంతో పాటు ప్రతి విషయంలోనూ అడిగిందే తడవుగా నిధులను సమకూర్చుతోందని.. ఈ దశలో ప్రభుత్వం కాంక్షించిన విధంగా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షించబడాలన్నారు. నేరాల విషయానికొస్తే సైబర్ నేరాలు మనకు సవాల్. రానున్న కాలంలో ఈ నేరాల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది. దీంతో, వాటిని అరికట్టాలంటే ఆ స్థాయిలో సిబ్బంది పరిణతి చెందాల్సిన అవసరం ఉంది. ఇక నక్సల్ సమస్య కూడా పెద్దదేనన్నారు. ఈ సమస్య నివారణకు సంబంధించిన అంశా లను సైతం ఆయన సిబ్బందికి పదే పదే విపులీకరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సిబ్బంది టెక్నాలజీలో శిక్షణను పూర్తి చేసుకోవాల్సిన అవసరం కూడా అంతే స్థాయి లో ఉంది. పనిలో వేగం పెరగాలి.. అదే సమయంలో కమ్యూనిటీ సహకారాన్ని తీసుకోవాలి. నేను సైతం ప్రాజెక్టు కింద అన్ని జిల్లాల్లోనూ కమ్యూనిటీ సహకారంతో సీసీటీవీ కెమెరాల ఏర్పా టు దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేయాలన్నారు

ఏవోబీలో కూంబింగ్ షురూ

కూంబింగ్‌లో సీఆర్‌పీఎఫ్, యాంటీ నక్సల్స్, గ్రేహౌండ్స్ దళాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏపీ, తెలంగాణలో నక్సలైట్ల ఏరివేత దిశగా చర్యలు ముమ్మరమయ్యాయి. మావో అగ్రనేతలే టార్గెట్‌గా భద్రతా దళాలు కూంబింగ్ చర్యలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. శనివారం అర్ధరాత్రి నుంచే అటు కేంద్ర సీఆర్‌పీఎఫ్, ఇటు తెలంగాణ యాంటీ నక్సల్స్, గ్రేహౌండ్స్, అటు ఏపీ గ్రే హౌండ్స్ దళాలు సంయుక్తంగా ఈ కూంబింగ్ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మావో పార్టీ వార్షికోత్సవాలు నిర్వహించిన దరిమిలా ఆ పార్టీ బలోపేత దిశగా పలు చర్యలను ప్రారంభించినట్లు తెలిసింది. ఛత్తీస్‌గఢ్ తదితర మావో ప్రభావిత ప్రాంతాలనుంచి నక్సల్స్ బోర్డర్ ప్రాంతాల్లో గస్తీని తీవ్రతరం చేశాయి. నక్సల్స్ సమస్య పెద్ద సమస్యగానే భావిస్తున్నామని తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి స్పష్టం చేసిన సంగతి విదితమే. నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇటీవల మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు జంపన్న, అతడి సహచరి పోలీసుల ఎదుట లొంగిపోయిన సంగతి విదితమే. ఏవోబీలో కూంబింగ్ చర్యలను ముమ్మరం చేశాయి. ఈ మారు మావో అగ్రనేతలనే టార్గెట్ చేస్తూ ఈ కూంబింగ్ చర్యలకు భద్రతా దళాలు చేపడుతున్నట్లు సమాచారం. ఆంధ్రా-ఒడిసా సరిహద్దు(ఏవోబీ)లో ప్రస్తుత పరిస్థితి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న మావోలు అంతేస్థాయిలో పార్టీ బలోపేత చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి మావోలు ఏవోబీలో ప్రవేశించారని తెలుస్తోంది.

ఉత్తమ్‌కు అభినందనలు

పీసీసీ చీఫ్ ఇంటి వద్ద సంబరాలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులుగా కేప్టెన్ ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కొనసాగిస్తూ ఎఐసిసి జారీ చేసిన ప్రకటన రాష్ట్ర కాంగ్రెస్ నేతలను సంబరాల్లో ముంచింది. ఉత్తమ్‌ను నాయకత్వాన్ని సమర్థించే నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బంజారాహిల్స్ లోని ఆయన నివాసానికి వచ్చి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. ఇంటి ముందు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీసీసీ నేతలు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కేంద్ర మాజీ మంత్రులు, రాష్ట్ర మాజీ మంత్రులు ఉత్తమ్‌కు గ్రీటింగ్స్ చెప్పారు. ఉత్తమ్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంతో పాటు ఆయన సతీమణి నల్లమాడ పద్మావతి ప్రాతినిధ్యం వహిస్తున్న కోదాడ నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

అధికార దాహంతోనే ఆర్మూర్ డిక్లరేషన్

ఎమ్మెల్సీ భాను ప్రసాద్ ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ ఆర్మూర్ డిక్లరేషన్ పేరిట ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం ద్వారా కాంగ్రెస్ నాయకులు వారి అధికార దాహాన్ని ప్రదర్శించారని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసా ద్ మండిపడ్డారు. టిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయం లో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎడారిలో తప్పిపోయిన బాటసారులుగా మారారని, వారికి అధికారం పగటికలేనన్నారు. ఎపుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ నాయకులకు రైతుల బాధలు పట్టవని, అధికారం పోగానే వారికి అన్న దా ాతపై ఎక్కడలేని ప్రేమ పొంగివస్తుందన్నారు. పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో పదేం డ్లు అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్‌కు రైతుల సమస్యలు కనిపించలేదా అని నిలదీ శారు. ఇసుకమాఫియా అంటూ తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలు తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు నీతిబాహ్య రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు.

మేడారంలో భక్తుల సందడి



వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : మేడారం భక్తులతో హోరెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు సమ్మక్క-సారలమ్మలకు తమ మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్న వాగులో స్నానాలు ఆచరించి తమ కోరిన కోర్కెలు తీర్చాలని తల్లులను వేడుకున్నా రు. పౌర్ణమి మొదలై నాలుగు రోజులు కావడం, ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు మేడారంనకు తరలివచ్చారు. వందల సంఖ్యలో వాహనాలు మేడారంనకు చేరుకోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఎటూ చూసిన భక్తుల కోలాహలం కనిపించింది. జాతరకు మూడువారాల ముందు నుంచే మేడారంలో తల్లులకు మొక్కులు చెల్లింపులు మొదలు పెట్టారు. నిలువెత్తు బంగారం (బెల్లం) చెల్లించుకుని మొక్కులను తీర్చుకు న్నారు. ఆదివారం నాడు సమ్మక్క-సారలమ్మ తల్లులకు మొక్కుల చెల్లించుకు న్నవారిలో సీబీఐ మాజీ డైరెక్టర్, మాజీ మంత్రి కె. విజయరామా రావుతో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు.

వాట్సప్‌లు, ఫేస్‌బుక్‌లలో ఉండొద్దు

పోలీసులకు అధికారుల ఆదేశాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోలీసు శాఖలో పని చేస్తున్న వారెవరూ సామాజిక మాధ్యమాలను వినియోగించరాదు. శాఖలో జరుగుతున్న నిత్య కార్యకలాపాలతో పాటు విచారణ అంశాలు, స్టేషన్‌లు, దర్యాప్తు అధికారుల వద్దకు ఎవరెవరు వస్తున్నారన్న అంశాలు ఎప్పటికప్పుడు బయటకు వెళ్తున్నాయన్న ఉద్దేశ్యంతో ఈ మేరకు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. క్రమశిక్షణను తప్పనిసరిగా పాటించాల్సిన శాఖలో పని చేస్తున్నందున కొన్ని నిబంధనలకు లోబడి పని చేయాల్సి ఉంటుందని, అందులో భాగంగానే పోలీసు శాఖలో పని చేసే వారంతా సామాజిక మాధ్యమాలలో కొనసాగించేందుకు వీలు లేదని పేర్కొంటున్నారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రస్తుతం రెండు రాష్ట్రాలలోని పోలీసు సిబ్బందిలో తీవ్ర చర్చ జరుగుతోంది. అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, అందుకు అనుగుణంగా అప్‌గ్రేడ్ కావాలని పదే పదే పేర్కొంటున్న అధికారులు ఏకంగా సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని ఆదేశించడం ఏంటన్న చర్చ మొదలైంది. ఇటీవల హైటెక్స్‌లో గ్లోబల్ ఎంటర్‌ప్యూనర్స్ సమ్మిట్ (జిఇఎస్) జరిగింది. ఈ సమావేశానికి హాజరైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇవాంక గౌరవార్థం ప్రధాని నరేంద్ర మోడీ విందు ఇచ్చారు. ఇవాంక రాష్ట్ర పర్యటన మొదటి నుంచీ అత్యంత రహస్యంగా, పకడ్బంధీగా ఉండాలని ఆ దేశ భద్రతా సిబ్బంది పదే పదే సూచించింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఫలక్‌నుమా ప్యాలేస్‌లో ఇవాంకా పాల్గొన్న విందులో ఆమెతో పాటు కొంత మంది ప్రముఖులకు మాత్రమే అనుమతించారు. అయినప్పటికీ ఇవాంకా పాల్గొన్న విందులో ఆహార పదార్థాలు, ఎవరెవరు పాల్గొన్నారన్న విషయాలన్నీ క్షణాల్లో వాట్సప్‌లో కనిపించాయి. ఈ విషయాన్ని అమెరికా భద్రతా సిబ్బంది గుర్తించి తన అసంతృప్తిని తెలియజేశారు. సిబ్బంది, అధికారులు ఎవరైనా వాట్సప్ గ్రూప్‌లలో ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేసి అనుమతులు తీసుకోవాలని, నిబంధనలను అధిగమిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే ఏపీ డిజిపి మాలకొండయ్య ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ పోలీసు శాఖ ఎలాంటి అధికారిక ఉత్తర్వులను జారీ చేయనప్పటికీ మౌఖిక ఆదేశాలను ఇది వరకే ఇచ్చారు.

ఉద్యోగులకు కష్టం రాకుండా చూసుకుంటాం

డైరీ ఆవిష్కరణలో మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలకపాత్ర పోషించా రని వారికి ఎలాంటి కష్టం వచ్చినా వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుంటుందని మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాప్రియదర్శని ఆడిటోరియంలో 31 జిల్లాల ప్రతినిధుల మధ్య డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. వైద్య ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి (అసోసియేట్ ప్రెసిడెంట్) ఆనంద్‌యాదవ్ (వర్కింగ్ ప్రెసిడెంట్) తాళ్ల శ్రీనివాస్, ఆర్.నవీన్‌కుమార్, 31 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 2000 మంది ఉద్యోగులు ఈ డైరీ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

తన వైద్యవిద్యకు సంబందించిన సర్టిఫికెట్లు నకిలీవని నిరూపిస్తే తాను రాజకీయాలనుంచి శాశ్వితంగా తప్పుకుంటానని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం ఆయన తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తన వైద్యవిద్యకు సంబందించిన సర్టిఫికెట్లన్నింటినీ నెట్‌లో పెట్టానని ఎవరైనా వాటిని పరిశీలించుకోవచ్చన్నారు. తాను వైద్యవిద్యను అభ్యసించిన కళాశాలకు వెళ్లి అక్కడా తన విద్యాభ్యాసానికి సంబందించిన అన్ని వివరాలను విచారణ చేసుకోవచ్చన్నారు. పాత్రికేయులు కమిటీగా ఏర్పడితే కళాశాలకు వెళ్లి విచారణ చేసుకుని నిజాలు నిగ్గుతేల్చేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా తానే కల్పిస్తానని వెల్లడించారు.

కిమ్‌ను కట్టడి చేయలేరా?

అమెరికా, చైనా భాగస్వామ్యంపై అనుమానాలు

- పెద్ద ఎత్తున అణ్వాస్త్రాల తయారీకి ఉత్తరకొరియా
- దిక్కుతోచని స్థితిలో అంతర్జాతీయ సమాజం



వాషింగ్టన్: కిమ్ జోంగ్ ఉన్ నేతృత్వంలో ఉత్తరకొరియా ఇష్టానుసారంగా జరుపుతున్న అణ్వాయుధాల కార్యక్రమాన్ని చైనా అత్యంత సులభంగా నిలుపుదల చేస్తుం దని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంటున్నారు. దీనికి సంబంధించి అమెరికా, చైనా దేశాలు భాగస్వామ్యం కుదు ర్చుకున్నాయి. గత ఏడాది కాలంగా అంతర్జాతీయ పరిణా మాలను పరికించినప్పుడు వీరి భాగస్వామ్యం ఏ మేరకు కిమ్‌ను కట్టడి చేయగలదనే సందేహాలు అంతటా నెలకొన్నాయి.

ప్రపంచంతో పదేళ్ళ పాటు పిల్లి-ఎలుక చెలగాటమాడిన ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ తనకు అత్యంత ప్రతిష్ఠాకరమైన అణ్వాయుధ సామర్థ్యాన్ని విజయవంతంగా సంపాదించుకున్నానని కొత్త ఏడాది తొలి రోజున ప్రకటించారు. 2018లో అణ్వాయుధాలను పెద్ద ఎత్తున తయారు చేస్తామని తెలిపారు. అంతేకాక యావత్ అమెరికా భూభాగాలు మా అణ్వాయుధాల ప్రయోగ పరిధిలో ఉన్నాయి. అణ్వాయుధం మీట నా బల్లపైనే ఉంది అని కిమ్ అమెరికాను సగర్వంగా హెచ్చరించారు.

ఐరాస భద్రతా మండలి వైఫల్యం

కిమ్ విజయదర్పంతో చేసిన ప్రకటన ప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయ భద్రతకు సంబంధించి ఐక్యరాజ్యసమితి(ఐరాస) నిర్ణయాధికార మండలి అయిన భద్రతా మండలి వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నది.సరిగ్గా ఏడాది క్రితం 2017 తొలి రోజున ఖండాంతర క్షిపణి ప్రయోగ సంబంధిత సన్నాహకాల తుదిదశకు ఉత్తరకొరియా చేరుకుందని కిమ్ స్పష్టం చేశారు. అన్న మాట నిలబెట్టుకుంటున్నట్టుగా ఈ సుప్రీం నేత 15 బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించారు. అలాగే అంతర్జాతీయంగా అన్ని హెచ్చరికలు, ఆంక్షలను బేఖాతరు చేస్తున్నట్టుగా గత సెప్టెంబర్‌లో ఆరవది, అత్యంత శక్తిమంతమైన అణ్వాయుధాన్ని పరీక్షించారు.

ఆంక్షలు బేఖాతరు

ఐరాస భద్రతా మండలిలో ఐదు శాశ్వత సభ్య దేశాలు, జీ20లో ఇతర ప్రముఖ దేశాలు ఉత్తర కొరియాకు అణ్వాయుధ సంపత్తి లేకుండా చేయడానికి అంగీకరించాయి. కానీ 2006 నుంచి అంతర్జాతీయ ఆంక్షలు ముందరికాళ్లకు బంధం వేస్తున్నప్పటికీ ఉత్తర కొరియా తన ప్రయత్నాలను ఏ మాత్రం విరమించుకోలేదు.

ఒక్క గత ఏడాదిలోనే ఐరాస భద్రతామండలి కిమ్ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి నాలుగు ఆంక్షలు విధించింది. కానీ ప్రస్తుతం పరిస్థితి చేయి దాటిపోయినట్టుగా కనిపిస్తున్నది. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలను చల్లార్చి, అణ్వాయుధ ఘర్షణ నివారణకు ఖచ్చితంగా ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.అమెరికా ఎప్పుడూ లేని విధంగా ఉత్తర కొరియాతో అణు యుద్ధానికి అత్యంత సమీపంలో ఉందని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ మాజీ ఛైర్మన్ అడ్మిరల్ మైక్ ముల్లెన్ హెచ్చరించారు.

చైనా మెతక ధోరణి!

ఉత్తరకొరియా యావత్ అణ్వాయుధ సంపత్తిని నాశనం చేయడమే లక్ష్యంగా కలిసి పనిచేయడానికి అమెరికా, చైనా అంగీకరించాయి. అది చైనాకు చాలా తేలికైన పని అని డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. తోటి మార్కిస్ట్-లెనినిస్ట్ మిత్రపక్షం పట్ల చైనాకు ఆ మాత్రం చొరవ ఉంటుందని ట్రంప్ వ్యాఖ్య అంతరార్థం. అయితే చైనా-అమెరికా బంధాన్ని విజయవంతం చేయడానికి వెయ్యి కారణాలు ఉంటాయి. కానీ దెబ్బ తీయడానికి ఒక్క కారణం కూడా లేదు అని చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ అన్నారు.

అయితే అంతర్జాతీయంగా ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కిమ్ వైఖరిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో ఉత్తరకొరియాను నిలువరించడంలో చైనా సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఉత్తర కొరియాను అణ్వాయుధాలు లేకుండా చేయడంలో అమెరికా, చైనా చిత్తశుద్ధి కలిగిన భాగస్వాములేనా అనే ప్రశ్న అంతర్జాతీయంగా ఉత్పన్నమైంది.

భద్రతపై అప్రమత్తం

- డీజీపీలకు ప్రధాని దిశానిర్దేశం

టెకన్‌పూర్, మధ్యప్రదేశ్: దేశంలో మరీ ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్, ఈశాన్య భారతం, నక్సల్ బాధిత ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్టపరచాల్సిన ఆవశ్యకతను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నొక్కి చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారమిక్కడి బీఎస్ఎఫ్ అకాడమీలో జరిగిన రెండవ రోజు డీజీపీలు, ఐజీపీల వార్షిక సదస్సులో ఉన్నత పోలీసు అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం పోలిసింగ్, భద్రతకు సంబంధించి నిర్దేశిత అంశాలపై అధికారుల బృందాలతో దృక్కోచర చర్చలు జరిపినట్టు ప్రధాని ట్వీట్ చేశారు. మన దేశ భద్రతకు సంబంధించి లోతైన ప్రతిపాదనలు, ఫలవంతమైన చర్చలు సదస్సులో చోటు చేసుకున్నాయని తెలిపారు. మూడు సంవత్సరాల కాలంలో తీసుకున్న నిర్ణయాల అమలు స్థితిగతులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని మోడీ ట్వీట్ చేశారు. మూడు రోజుల సదస్సులో రాష్ట్ర పోలీసు బలగాలు, కేంద్ర పోలీసు సంస్థల నుంచి దాదాపు 250 మంది ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు.

26న కేరళకు ఆర్ఎస్ఎస్ చీఫ్

న్యూఢిల్లీ: కేరళలో ఆర్ఎస్ఎస్ మోహన్ భగవత్ రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండా ఎగురవేయనున్నారు. పాలక్కాడ్‌లోని పాఠశాలలో జనవరి26న భగవత్ జాతీయజెండా ఎగురవేయనున్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ తిరుపతిలో గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత జాతీయపతాక ఆవిష్కరణ చేశారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేరళలో జాతీయ జెండా అవిష్కరించనున్నారు. ఈ నెల26నుంచి పాలక్కాడ్ పట్టణ సమీపంలో ఉన్న పాఠశాలలో మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్రీయ స్వయం సేవక్ శిబిరానికి సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ హాజరుకానున్నారు. గత ఏడాది ఆగస్టు 15వతేదీని పాలక్కాడ్ జిల్లాలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో త్రివర్ణ పతాకాన్ని తలకిందులుగా ఎగురవేశారు. దీంతో పాఠశాల అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. కేరళలో ఆర్ఎస్ఎస్ గణనీయ కార్యవర్గాన్ని కలిగి ఉంది. గతేడాది భాజపా అధినేత అమిత్‌షా కేరళలో పర్యటించారు. కార్మికులకు వ్యతిరేకంగా జరిగిన హింసాకాండను నిరసిస్తూ యాత్ర నిర్వహించారు. ప్రస్తుతం కమ్యూనిస్టులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం కేరళలో నెలకొంది.

సరిహద్దులో 14వేల బంకర్ల నిర్మాణం

కాశ్మీర్: జమ్మూ కాశ్మీర్ డివిజన్లలో పాక్ దాడులను ఎదుర్కొంటున్న సరిహద్దు ప్రాంత నివాసితుల రక్షణకోసం 14వేల బంకర్లు నిర్మించనున్నారు. నియంత్రణ రేఖవద్ద అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఈ బంకర్లు నిర్మించనున్నారు. పాక్ సరిహద్దు దగ్గర ప్రతిబంకర్ వద్ద ఒక సైనికుడిని రక్షణగా ఉంచుతారు. పూంచ్, రాజౌరీ ప్రాంతాల్లో 7,298బంకర్లు నిర్మించగా, జమ్మూ, కతువా, సాంబా జిల్లాల్లో 7162 భూగర్భ బంకర్లు నిర్మించనున్నారు. మొత్తం 13,029 వ్యక్తిగత బంకర్లు, 1431 కమ్యూనిటీ బంకర్లు నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. 160 చదరపు అడుగుల వ్యక్తిగత బంకర్‌లో 8మంది ఉండగల సామర్థ్యంతో, అదేవిధంగా 800 అడుగుల కమ్యూనిటీ బంకర్లో 40మంది ఉండగల సామర్థ్యంతో బంకర్‌లను నిర్మించనున్నారు. రాజౌరిలో 4,918 మందికి 372మంది కమ్యూనిటీ బంకర్లు నిర్మించనున్నారు. కతువా జిల్లాలో 243 కమ్యూనిటీ బంకర్లు నిర్మించనున్నారని అధికారులు తెలిపారు.

సమావేశానికి సభ్యులు రెడీ

- దక్షిణ కొరియాకు జాబితా పంపిన ఉత్తర కొరియా

సియోల్ : ఈ వారంలో దక్షిణ కొరియా అధ్యక్షుడు, ఉత్తరకొరియా అధ్యక్షుడితో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా నుండి హాజరయ్యే ప్రతినిధులకు సంబంధించిన జాబితాను దక్షిణ కొరియాకు పంపించడం జరిగింది. ఈ విషయాన్ని ఉత్తర కొరియా మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇరు దేశ అధ్యక్షులు ఏకాభిప్రాయంతో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే నెలలో జరిగే శీతాకాల ఒలింపిక్ ఆటల పోటీల విషయమై సమావేశం అవుతున్నారు. ఈ అంశమే ప్రధాన ఎజెండాగా రెండేళ్ల తరువాత సమావేశానికి సిద్ధమయ్యారు. దీనికి ముందు మంగళవారం పాన్మూంజాంలోని ట్రూస్ గ్రామంలో ఉత్తర కొరియా ప్రతినిధులు సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి కొరియా అంతర్గ వ్యవహారాల ఏజెన్సీ ఉన్నతాధికారి రి-సన్-గ్వోన్ అధ్యక్షత వహిస్తారని ఆ దేశ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. క్రీడా విభాగానికి సంబంధించి నలుగురు అధికారులు సైతం ఈ సమావేశం హాజరుకానున్నట్టు రి-సన్-గ్వోన్ దక్షిణ కొరియాకు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తన వద్ద న్యూక్లియర్ బాంబు బటన్ ఉందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ చేసిన హెచ్చరికను దృష్టిలో పెట్టుకుని పకడ్బందీ వ్యూహంతో వెళ్తున్నట్టు తెలిసింది. అదేవిధంగా తన దేశ జట్టును సైతం ఒలింపిక్ క్రీడల కోసం పంపుతున్నట్టు ప్రకటించారు. మంగళవారం నిర్వహించేసమావేశంలో ఒలింపిక్‌తో పాటు ఇరు దేశాలకు సంబంధించిన సమస్యలపై కూడా చర్చించనున్నట్టు వివరించారు.

కిమ్‌తో మాట్లాడతా..



అమెరికా: అమెరికా, ఉ.కొరియా మధ్య ప్రస్తుతం పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు కనిపిస్తున్నా యి. ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణ లకు దిగుతూ యుద్ధం వరకు వెళ్తున్నా రు. ఇలాంటి సమయంలో ట్రంప్ చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఉ. కొరియా అధ్యక్షుడు కిమ్ తో మాట్లాడుతానని, చర్చల ద్వారా ఎలాంటి సమస్య అయినా పరిష్కారం అవుతుందనే అభిప్రా యాన్ని ట్రంప్ వ్యక్తం చేస్తున్నారు. తామిద్దరం మాట్లాడు కుంటే సత్సంబంధాలు బలపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. కచ్చితంగా కిమ్‌తో నేను మాట్లాడుతానని ట్రంప్ ప్రకటించారు. కానీ మాట్లాడటానికి కొన్ని నిబంధనలు విధిస్తానని ట్రంప్ చెప్పుకొచ్చారు. దక్షిణ కొరియాలో వింటర్ ఒలింపిక్ క్రీడలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తర, దక్షిణ కొరియా సత్సంబంధాలు మెరుగుపర్చేందుకు ప్రత్యర్థులు ప్రయతిస్తున్నారు. మంగళవారం రెండు దేశాల సరిహద్దు పట్టణంలో మొదటిసారిగా చర్చలు నిర్వహించనున్నారు. రెండు సంవత్సరాల తరువాత ఇరు దేశాల మధ్య చర్చలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పెద్ద ఈవెంట్ ఉండటంతో ఇరు దేశాలు ఆ విషయమై మాట్లాడుకుంటున్నారని ట్రంప్ చెప్పారు. 2018 లెజిస్టేటివ్ ఎజెండాలో భాగంగా ట్రంప్ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో కాంగ్రెస్‌తో పాటు కేబినేట్ సభ్యులు పాల్గొన్నారు. జీఓపీ సమావేశం అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో కిమ్‌నుద్దేశించి ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు.

నాలుగో రోజుకు చేరిన సమ్మె సైరన్

చెన్నై: కోర్టు ఆదేశించినా, రవాణా మంత్రి నోటీసులు ఇచ్చినా తమిళనాడులో ట్రాన్స్‌పోర్టు కార్మికులు సమ్మెబాట వీడటంలేదు. రవాణాశాఖ కార్మికసంఘాల ఉద్యమానికి ఇతర కార్మిక సంఘాలు సంఘీభావం తెలపటంతో ఆదివారం నాటికి ఆర్టీసీ కార్మిక సమ్మె నాలుగోరోజుకు చేరింది. మరోవైపు ప్రయాణికులు బస్సులు లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక డ్రైవర్లను నియమించి బస్సులు నడిపించేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కోర్టు ఆదేశాలను సైతం కార్మికులు లక్ష్యపెట్టడంలేదు. ఇప్పటివరకు సమ్మెకారణంగా ప్రభుత్వానికి రూ.40కోట్ల రాబడి నిలిచిపోయింది. డిమాండ్లు పరిష్కరించకుంటే సంక్రాంతి వరకు ఆందోళన నిర్వహిస్తామని కార్మికసంఘాలు హెచ్చరిస్తున్నాయి. పొంగల్ సందర్భంగా 12వేల ప్రత్యేక బస్సుల్లో సీట్ల రిజర్వేషన్ పూర్తవటంతో అధికారుల్లో కలవరం మొదలైంది.

పిల్లల దత్తత ఏజెన్సీ గుర్తింపు రద్దు

న్యూఢిల్లీ: అమెరికాలో మూడేళ్ల షేరీన్ మాథ్యూస్ మృతిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అమెరికాకు చెందిన పిల్లలను దత్తత తీసుకునే ఏజెన్సీ గుర్తింపును రద్దు చేసింది. ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే షేరీన్ మృతి చెందిందని ప్రకటించింది. ఇండో-అమెరికాకు చెందిన ఓ జంట 2016లో షేరీన్‌ను దత్తత తీసుకుంది. తరువాత దత్తత తండ్రి వ్యవహారంతో షేరీన్ గత సంవత్సరం అక్టోబర్‌లో మృతి చెందింది. ప్రస్తుతం ఇద్దరు జైల్లో ఉన్నారు. ఏజెన్సీ గుర్తింపును రద్దు చేయాల్సిందిగా మహిళ, శిశు సంక్షేమ శాఖ కేంద్ర మంత్రి మేనకా గాంధీ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయమై ఆమె అమెరికా ప్రభుత్వానికి ఓ లేఖ రాసింది. ఏజెన్సీ నిర్లక్ష్యంగా వల్లే పసి పాప ప్రాణాలు కోల్పోయిందని నిర్ధారణకు వచ్చారు. ఇవాంకా ట్రంప్ భారత్ పర్యటన నేపథ్యంలో రద్దు నిర్ణయం అనేది కొంత ఆలస్యమైందని వివరించారు. ఇరు దేశాల మధ్య ఎలాంటి మనస్పర్థలకు తావివ్వకుండా భారత్ ఈ నిర్ణయం తీసుకుందని అమెరికా అధికారి ఒకరు తెలిపారు.

ఆర్థికాభివృద్ధి దిశగా భారత్



సింగపూర్ : అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఆసియన్ నేషన్ (ఏఎస్ఈఏఎన్)తో భారత్ సత్సంబంధాలు కొనసాగిస్తున్నదని, అన్ని రకాల వసతులు కల్పిస్తూ ఆర్థికాభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తున్నదని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ అన్నారు. ఆసియన్-భారత్ ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ దేశాల నుండి సుమారు 3వేల ప్రతినిధులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. భారత్ అందరి భాగస్వామ్యంతో, నిబద్ధతో ముందుకు వెళ్తూ ప్రగతి సాధిస్తున్నదని అభిప్రాయపడ్డారు. ఆసియన్ దేశాలతో కలిసి భారత్ 25ఏళ్ల మైలురాయిని అధిగమించిందని, ప్రపంచ దేశాల నియమనిబంధనలు తెలుసుకుని ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిపుచ్చుకుంటోందన్నారు. ఆసియన్ దేశాలతో జతకట్టిన తరువాత దేశంలో పెట్టుబడులు పెరిగాయని చెప్పారు. అసియాన్ దేశాల్లో భారత్ వాణిజ్యపరంగా ఏడో స్థానంలో ఉందని, 2016-17లో గతేడాదితో పోలిస్తే 8 శాతం వృద్ధి సాధించిందని అన్నారు. భారత్ 25 ఏళ్ల మైలు రాయిని అందుకున్న నేపథ్యంలో జనవరి 25న కార్యక్రమం ఏర్పాటు చేస్తుందని, దీనికి అందరూ తప్పక హాజరు కావాలని ఈ సందర్భంగా ఆమె ప్రతినిధులను కోరారు.

11 మంది సౌదీ యువ రాజుల అరెస్టు

రియాద్ : యువరాజులు వారు ఉపయోగించుకుంటున్న కరెంటు, నీటి బిల్లు కట్టాలని సౌదీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ.. వారంతా రియాద్‌లోని ఖసర్-అల్-హక్మ్ ఎదుట నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని సౌదీ అరేబియా అటార్నీ జనరల్ అధికారికంగా ప్రకటించారు. 11 మంది యువ రాజులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు. అదేవిధంగా వారిలో తోబుట్టువు మరణానికి నష్టపరిహారం కూడా చెల్లించాలని ఈ సందర్భంగా ఆందోళన నేపథ్యంలో డిమాండ్ చేశారు. 2016లో ఈ ఘటన చోటు చేసుకుందని జర్నల్ సౌద్ అల్ మోజీబ్ తెలిపారు.

వారి డిమాండ్లు సౌదీ ప్రభుత్వ చట్టానికి వ్యతిరేకంగా ఉన్నాయని, అందుకే ఆందోళనలో పాల్గొన్న 11 మంది యువరాజులను అరెస్టు చేసినట్టు తెలిపారు. ప్రజలకు ఇబ్బందికరంగా వ్యవహరించడం కూడా వారిని అదుపులోకి తీసుకోవడానికి కారణమని వివరించారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

చైనా తలచుకుంటే ఉగ్రవాదం అంతం

పాక్‌పై ఒత్తిడి తేవాలి : అమెరికా



వాషింగ్టన్ : పాకిస్థాన్-చైనాకు మధ్య ఉన్న సంబంధాన్ని మరోసారి అమెరికా తెరపైకి తీసుకొచ్చింది. పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందని పేర్కొంది. చైనా ప్రయత్నిస్తే.. పాకిస్థాన్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి ముందుకు వస్తుందని వైట్‌హౌస్‌లోని ఓ సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. ఉగ్రవాద నిర్మూలన విషయమై చైనా, పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పాక్‌లో ఉగ్రవాదం పెరగడానికి చైనా హస్తం కూడా ఉందని అమెరికా అభిప్రాయపడుతుందన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో ఇప్పటికీ చాలా మంది ఉగ్రవాదులు ఉంటున్నారని, ప్రభుత్వం కూడి వారికి రక్షణ కల్పిస్తున్నదని వైట్ హౌస్ అధికారి ఆరోపించారు. పాకిస్థాన్ చాలా ఏళ్ల నుండి చైనాతో చారిత్రాత్మకం ఒప్పందాలు కలిగి ఉందని, అదేవిధంగా మిలటరీ పరంగా కూడా సహాయ సహకారాలు అందిపుచ్చుకుంటారని వివరించారు.

లోతుగా పరిశీలిస్తే.. చైనా-పాక్ ఎకానమీ కారిడర్ (సీపీఈసీ) పెరుగుతూ వస్తుందని ఓ సీనియర్ పరిపాలనాధికారి అభిప్రాయపడ్డారు. చైనా గట్టిగా ప్రయత్నిస్తే.. పాకిస్థాన్‌లో ఉగ్రవాద జాడలు లేకుండా పోతాయి. పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కూడా మెరుగైన సంబంధాలు కొనసాగించడానికి చైనా పెద్దన్న పాత్ర పోషిస్తున్నది. ఇరు దేశాల మధ్య చీలికలు రాకుండా ఉండటానికి డ్రాగన్ ప్రయత్నిస్తూనే ఉంటున్నది. పాకిస్తాన్‌కు సహాయ సహకారాలు అందించాలా..? వద్దా..? అనేది చైనా వ్యక్తిగతం. కానీ ప్రపంచ వ్యాప్తంగా మారణహోమం సృష్టిస్తున్న ఉగ్రవాద చర్యలు నిర్మూలించడంలో మాత్రం చైనా అన్ని దేశాల్లాగే వ్యవహరించాలని అధికారి చెప్పుకొచ్చారు. చైనా పాక్‌కు ఎంత సహాయం చేస్తుందో అలాగే ఆఫ్ఘనిస్థాన్‌ను సైతం వెనకేసుకొస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నది. పాకిస్థాన్‌కు సైన్యం పరంగా, ఆర్థికంగా అమెరికా దెబ్బ తీసినా ఎలాంటి ఇబ్బంది కల్గలేదు.

ఎందుకంటే చైనా అండగా నిలవడమే దీనికి కారణం. ఎప్పుడు అయితే అమెరికా ఆంక్షలు విధించడం ప్రారంభించిందో.. ఇస్లామాబాద్-బీజింగ్ మధ్య కార్యకలాపాలు మరింత విస్తరించాయి. రెండో అంశం ఏంటంటే దక్షిణాసియాలో ఉగ్రవాదంపై చైనా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది.

15 ఏళ్లలో ఉగ్రవాదం కోసం పాకిస్థాన్ ఏకంగా 33 బిలియన్ డాలర్లు ఖర్చు చేసిందంటే ఎంత మేర ప్రోత్సహిస్తుందో అర్థం అవుతున్నది. ఇలాంటి దేశానికి చైనా వెన్నుదన్నుగా నిలవడం బాధాకరమని వైట్‌హౌస్ పరిపాలనాధికారులు పేర్కొంటున్నారు.

మనస్పర్థలకు తావివ్వం

పాక్ విదేశాంగ కార్యదర్శి తెహిమినా జనుజ

కరాచీ : అమెరికాతో తాము సాధ్యమైనంత వరకు కలుసుకుపోయేలా చూస్తామని, ఎలాంటి మనస్పర్థలకు తావివ్వకుండా ప్రయత్నిస్తామని పాక్ విదేశాంగ కార్యదర్శి తెహిమినా జనుజ అన్నారు. కరాచీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో నిర్వహించిన 'పాకిస్థాన్ విదేశీ పాలసీలు-విధానాలు' సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అమెరికా తనకు పొరుగుదేశం అని, వారితో ఎలాంటి వైరుధ్యాలు ఉంచుకోవడానికి ఇష్టపడటం లేదన్నారు. జనవరి 1న ట్రంప్ చేసిన ట్వీట్‌పై పాకిస్థాన్ లోతుగా ఆలోచిస్తున్నదని, ఎందుకు తమను ఇలా లక్ష్యం చేసుకుంటున్నారనే విషయమై పరిశీలించుకోవడం జరుగుతున్నదని అన్నారు. జనవరి 1న ఉదయం 4 గంటల సమయంలో ట్రంప్ పాకిస్థాన్, ఇరాన్ గురించి ఎందుకు ఆలోచిస్తున్నారో తెలియడం లేదు. ఇరాన్‌లో ఏదో జరుగుతోందనే అనుమానం వస్తుందని తెహిమినా జనుజ అన్నారు. ఉగ్రవాదులకు పాకిస్థాన్ స్వర్గధామంగా నిలిచిందని, 15 ఏళ్లలో 33 బిలియన్ డాలర్లు ఖర్చు చేశారంటూ ట్వీట్ ఎందుకు చేశారో తెలియడం లేదని, ఎందుకు పాకిస్థాన్‌ను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారో అని అన్నారు.

మూడో పెళ్లి చేసుకోలేదు: ఇమ్రాన్

ఇస్లామాబాద్ : మూడో పెళ్లి చేసుకున్నాడన్న వార్తపై పాకిస్థాన్ రాజకీయ నాయకుడు, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ ఆదివారం స్పందించారు. పత్రికలు, ఛానళ్లు ప్రసారం చేస్తున్న వార్తలో నిజం లేదని కొట్టిపారేశారు. రహస్యంగా మూడో పెళ్లి చేసుకున్నా అనే వార్త పచ్చి అబద్ధం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ.. బుష్రా మేనకతో పెళ్లి గురించి కేవలం ప్రస్తావించడం జరిగిందని, ఆమె తన తల్లి దండ్రులు, పిల్లలతో చర్చించి చెప్తా అని సమాధానం ఇచ్చిందని అన్నారు. వ్యక్తిగత విషయాలు ఇలా రచ్చ రచ్చ చేయడం చాలా బాధగా ఉందని చెప్పారు.బుష్రా మనస్సు బాధపెట్టేలా మీడియా వ్యవహరించడంపై ఆయన మండిపడ్డారు. ఎప్పుడు అయితే మేనక నాతో పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంటుందో అప్పుడు స్వయంగా మీడియా ముఖంగా ప్రకటిస్తానని ఇమ్రాన్ వివరించాడు.

3ఏళ్లలో 2% పెరిగిన జడ్జీల సంఖ్య

న్యూఢిల్లీ: దేశంలో న్యా యమూర్తుల సంఖ్య గత మూ డేళ్లలో కొద్దిగా పెరిగినట్లు న్యా యశాఖ స్పష్టం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం సుప్రీం కోర్టు, దేశంలోని 24 హైకోర్టు లు, జిల్లా, దిగువ కోర్టుల్లో న్యా యమూర్తుల సంఖ్య ప్రతి 10 లక్షల మంది ప్రజలకు 19.66 గా ఉన్నట్లు వెల్లడించింది. 2014లో ఈ 17.44 శాతంగా ఉన్న న్యాయమూర్తుల సంఖ్య గడిచిన మూడేళ్లలో పెరిగినట్లు పేర్కొంది. సుప్రీంకోర్టులో 31 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 25 మందిన్యాయమూర్తులున్నారు. ఇక దేశంలోని 24 హైకోర్టుల్లో 1079 న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా..ప్రస్తుతం 684 జడ్జిలున్నట్లు మిగతా 395 ఖాళీలున్నట్లు న్యాయశాఖ తెలిపింది. 2014లో హైకోర్టులకు నిర్దేశించిన న్యాయమూర్తుల సంఖ్య 906 ఉండగా..ప్రస్తుతం ఆ సంఖ్యను 1079కి పెంచినట్లు పేర్కొంది. కిందిస్థాయి కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో ఖాళీలు సంఖ్య గణనీయంగా తగ్గిందని న్యాయశాఖ స్పష్టం చేసింది.

బోఫోర్స్ కేసులో ఇద్దరికి జైలు

న్యూఢిల్లీ : 25 ఏళ్లనాటి బోఫోర్స్ కుంభకోణంలో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం ఇద్దరికి జైలు శిక్ష విధించింది. జయంత్ ఆయిల్ మిల్ డైరెక్టర్ అభయ్ వి.ఉదేశి, సదరు కంపెనీ ఉద్యోగి హరీష్ పాండ్యలను న్యాయస్థానం దోషులుగా పేర్కొంటూ రెండేళ్ల జైలు శిక్ష వేసింది. నేర పూరిత కుట్ర, మోసం చేసినందుకు గానూవీరిద్దరికీ రెండేళ్ల జైలు శిక్ష విధించినట్లు న్యాయమూర్తి లక్ష్మీకాంత్ బిద్వాయ్ స్పష్టం చేశారు. ఈ ఇద్దరు చేసిన మోసం వల్ల అంతర్జాతీయ మార్కెట్ లో దేశ కీర్తికి భంగం వాటిల్లిందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. 1986లో భారత్ 155ఎంఎం అత్యంత ఎత్తు నుంచి గుండ్లను పేల్చే 400 ఫిరంగులను స్వీడన్ నుంచి కొనుగోలు చేసేందుకు 1437 కోట్లతో ఒప్పందం చేసుకుంది. అయితే ఆ ఒప్పందంలోని ఒక నిబంధన ప్రకారం బోఫోర్స్ కంపెనీ భారత్ నుంచి కాఫీ, కాస్టర్ ఆయిల్ వంటివి దిగుమతి చేసుకుంటోంది. ఈ దిగుమతులను పర్యవేక్షించేందుకు భారత ప్రభుత్వం స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. 1989, 90 సంవత్సరాల్లో అభయ్ వి ఉదేశ్, హరీష్ కె పాండ్యలు స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ లో నేరపూరిత కుట్ర, మోసాలకు పాల్పడ్డారు. అవినీతికి పాల్పడిన పాండ్య నకిలీ ఎగుమతుల డాక్యుమెంట్లు సృష్టించి లబ్ధిపొందాడు. ఈనేరంలో ఇద్దరికీ భాగం ఉందని నిర్ధారించిన న్యాయస్థానం వారిరువురికీ రెండేళ్ల జైలు శిక్ష విధించింది.

147 మంది జాలర్లు విడుదల

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆదివారం తమ అధీనంలో ఉన్న 147మంది భారత జాలర్లను విడుదల చేసింది. అరేబియా సముద్రంలో స్పష్టమైన సరిహద్దు లేనందున పాక్, భారత్ జాలర్లు తరుచూ చట్టవిరుద్ధంగా చేపలు పట్టేందుకు సరిహద్దు దాటడం పరిపాటిగా మారింది. పాక్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి మహ్మద్ ఫైసల్ గత డిసెంబర్లో ప్రకటించిన ప్రకారం రెండో విడతలో 147మంది భారత జాలర్లను విడుదల చేశారు. దాదాపు 300మంది జాలర్లను పాకిస్థాన్ తమ ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారని ఆరోపిస్తూ వారిని అరెస్టు చేసింది. కాగా డిసెంబర్ 28న పాకిస్థాన్ 145మంది భారత జాలర్లను మొదటిదశలో విడుదల చేసింది. తాజాగా తమ అధీనంలో ఉన్న 147మంది జాలర్లను విడుదల చేశారు. కరాచీలో మత్స్యకారులను విడుదల చేసినట్టు ఇస్లామాబాద్ పోలీసులు ధ్రువీకరించారు. లాహోర్ నుంచి భారత జాలర్లను వాగా సరిహద్దును ద్వారా భారత్లోకి వచ్చేవిధంగా ఏర్పాట్లు చేశామని కరాచీలోని జైలు అధికారులు వెల్లడించారు.

పెరోల్‌పై లాలూ ఆశలు...?

- సోదరి అకాల మరణంతో లాలూ కంటతడి
- అంత్యక్రియల కోసం పెరోల్ కోరే అవకాశం
- తోటమాలిగా లాలూ జైలు జీవితం

రాంచీ: పశుగ్రాసం కుంభకోణంలో మూడున్నరేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ పెరోల్ పై కోర్టుకు పెరోల్ పిటిషన్ పెట్టుకునే అవకాశముంది. లాలూ సోదరి గంగోత్రి దేవి ఆదివారం మృతి చెందడంతో అక్క అంతిమ సంస్కారాలకు లాలూ హాజరయ్యే అవకాశాలున్నాయి. గంగోత్రి మరణ వార్తను జైలు అధికారుల ద్వారా లాలూకు చేరవేసినట్లు లాలూ కుమారుడు తేజస్వి తెలిపారు. కోర్టు నిబంధనల ప్రకారం కోరిన వెంటనే పెరోల్ వస్తుందో లేదోనని.. తమ అత్తగారి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. లాలూ భార్య రబ్రీదేవి మాట్లాడుతూ.. సోదరుడికి జైలు శిక్షపడకూడదని శనివారం రోజంతా గంగోత్రి పూజలు చేసిందని.. సోదరుడికి జైలు శిక్ష ఖరారు కావడంతోనే ఆమె తీవ్రంగా కలత చెందిందని తెలిపారు. లాలూకు జైలు శిక్షపడడం.. మరుసటి రోజే సోదరి మరణవార్త రావడంతో లాలూ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



లాలూకు అఖిలేశ్ సంఘీభావం

జైలులో ఉన్న లాలూకు సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందించారు.తమ పార్టీ తరపున సంఘీభావం తెలియజేసిన అఖిలేశ్ లాలూ విషయంలో బీజేపీ అన్యాయంగా వ్యవహరించిందని మండిపడ్డారు. సమాజ్ వాదీ పార్టీ జాతీయ కార్యదర్శి రామశంకర విద్యార్థి మాట్లాడుతూ.. లాలూ ప్రసాద్ బీజేపీతో జతకట్టకపోవడం వల్లే ఆయనపై ఇలాంటి చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. లాలూను బీజేపీ కుట్రపూరితంగా ఇరికించింది. ఒకవేళ ఆయన బీజేపీలో చేరితే ఆయనకు జైలు జీవితం ఉండేదికాదు. హైకోర్టులో లాలూకు న్యాయం జరుగుతుందన్ననమ్మకం నాకుంది. అని చెప్పుకొచ్చారు.

తోటమాలి లాలూకు రోజుకు రూ. 93 కూలీ

దాణా కుంభకోణంలో రాంచీలోని బిర్సాముండా జైలులో ఉన్న లాలూ తోటమాలిగా మారిపోయారు. జైలులో లాలూకు రోజుకు రూ. 93 చెల్లిస్తున్నారు. లాలూ వయస్సు, హోదా రీత్యా ఆయనకు జైలు అధికారులు తోటమాలి పని అప్పగించినట్లు తెలుస్తోంది. మరోవైపు జైలుకు వెళ్లిన మరుసటి రోజే లాలూ బీహార్ ప్రజలకు ఓ ఉత్తరం రాశారు. ఉత్తరంలోని సందేశాన్ని లాలూ అధికారిక ట్విట్టర్ ద్వారా ప్రజలు చేరవేశారు.

తాను జైలు కెళ్లినం దుకు భయపడటం లేదని.. రాజకీయ సిద్ధాంతాలైన లౌకికవా దం, దళితులు, వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రాజీలేని పోరాటం చేస్తానని లేఖలో లాలూ పేర్కొన్నారు. బీజేపీ తనపై చేతబడి చేయించిందని.. తమతో కలిసి రాకుంటే ఇరికిస్తామని హెచ్చరించిందని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం చనిపోయేందుకు కూడా సిద్ధమని ప్రకటించారు.



సంక్రాంతి బరిలో చేరారు తమిళ స్టార్ సూర్య. గ్యాంగ్‌తో ఆయన జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. దర్శకుడు విఘ్నేష్ శివన్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ తెలుగు తెరపైకి తీసుకొస్తోంది. కీర్తి సురేష్ నాయికగా నటించింది. హిందీ సినిమా స్పెషల్ చబ్బీస్ పునర్నిమాన చిత్రంగా రూపొందిన గ్యాంగ్ విశేషాలు కథానాయకుడు సూర్య మాటల్లో...

మార్కెట్ కాపాడుకుంటూనే ప్రయోగాలు చేస్తా... - సూర్య

☞ గ్యాంగ్‌లో నటించడం నాకొక ప్రత్యేకమైన అనుభవం. ఈ సినిమాతో నేను యువకుడిగా ఉన్న రోజులకు వెళ్లినట్లు అనిపించింది. మనం చేసే ఏ వృత్తిలోనైనా నేర్చుకుంటాం, పరిపక్వత చెందుతాం, ప్రశ్నిస్తాం, ఎదుగుతాం, మిగతా వాళ్ల నుంచి స్ఫూర్తి పొందుతాం లేక ంటే కొత్తగా ప్రయాణించాలనుకుంటాం. యవ్వనంలోని అలాంటి వాతావరణం ఈ కథలో కనిపిస్తుంది.

☞ బాలీవుడ్ సినిమా స్పెషల్ చబ్బీస్ ఆధారంగా గ్యాంగ్ రూపొందించాం. అయితే ఆ సినిమాకు ఈ కథలో చాలా మార్పులు చేశారు దర్శకుడు. 1980 లో జరిగిన అతి పెద్ద దోపిడీ నేపథ్యంతో చిత్రం సాగుతుంటుంది. చాలా వాస్తవ సంఘటనలు తెరపై కనిపిస్తాయి. మాతృకలోని రెండు మూడు సన్నివేశాలనే అలా ఉంచేసి మిగతా అంతా కొత్తగా మార్చుకుని తెరకెక్కించాం.

☞ మన చుట్టూ అండగా ఉండే ఓ గ్యాంగ్ కథ ఇది. ఆ జట్టు చాలా సమస్యలపై పోరాడుతుంటుంది. రాజకీయాలు, నిరుద్యోగం లాంటి సామాజిక సమస్యలను ఎదుర్కొంటుంది. 80 దశకంలో వచ్చిన ఆకలి రాజ్యం లాంటి చిత్రాల్లో మనం నిరుద్యోగ సమస్యను చూశాం. అది అప్పటి సమస్య. మళ్లీ ఇన్నాళ్లకు అది పునరావృతం అవుతోంది. మన దగ్గర విద్యావంతులు సరైన ఉద్యోగాన్ని పొందలేకపోతున్నారు.

☞ దర్శకుడు సన్నివేశాన్ని చెప్పేప్పుడు ఇది చాలా సహజమైన చిత్రం అవుతుంది అనిపించింది. మనమంతా క లిసి మాట్లాడుకున్నట్లే సంభాషణలు ఉంటాయి. నేను సింగం సినిమాలతో దేశ విదేశాలకు వెళ్లి సంఘ విద్రోహులను వేటాడాను. ఈ చిత్రంతో మన దగ్గరే ఉన్న సమస్యలను ఎదుర్కొనే పాత్రలో కనిపిస్తాను.

☞ ప్రయోగాత్మక చిత్రాలు చేయడం ముఖ్యమే. అయితే నాకున్న వ్యాపారాన్ని కాపాడుకోవాలి. సూర్య సినిమా చేస్తే...కనీస పెట్టుబడి వస్తుందనే నమ్మకం నిర్మాతల్లో, పంపిణీదారుల్లో ఉండాలి. మేము గజినీ, కాక లాంటి చిత్రాలు చేసినప్పుడు చాలా తక్కువ నిర్మాణ వ్యయంలో చేశాం. అవి అందరికీ లాభాలు తెచ్చాయి. అంకెలు తెలియవు కానీ..తెలుగులోనూ ఘన విజయం సాధించాయి. ఎన్నో విభిన్నమైన కథలు నా దగ్గరకు వ స్తుంటాయి. వాటిలో వాణిజ్యపరంగా ఉండేవి చూసుకోవాల్సి వస్తోంది. ఓ మంచి పాత్రకు సిద్ధమవ్వాలంటే కనీసం రెండేళ్ల సమయం తీసుకుంటోంది. ఇక నిర్మాణ వ్యయాలు గతంలో కంటే చాలా ఎక్కువగా పెరిగాయి. వీటన్నింటినీ సమతూకం చేసుకుంటూ, మార్కెట్ కాపాడుకుంటూ సినిమాలు ఎంచుకుంటున్నాను.

☞ ఈ చిత్రంలో కార్తీక్, రమ్యకృష్ణ లాంటి అనుభవమున్న నటీనటులతో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతిని మిగిల్చింది. కార్తీక్ సినిమాలు మా తరానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయి. మౌనరాగం లాంటి సినిమా ఇప్పుడు చూసినా ఆయన ఎంత బాగా నటించారా అని ఆశ్చర్యపరుస్తుంటుంది.

☞ తెలుగు మధురమైన భాష. గ్యాంగ్ కోసం తెలుగులో నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. తమిళ చిత్రానికి 8 రోజులు పడితే...తెలుగుకు 6 రోజుల్లోనే డబ్బింగ్ చెప్పాను. రాబోయో రోజుల్లో ఇంకా బాగా తెలుగు నేర్చుకుంటాను.

☞ సంక్రాంతికి పవన్, బాలకృష్ణ సినిమాలు వస్తున్నాయి. అజ్ఞాతవాసి విడుదలైన రెండు రోజులకు మా చిత్రం తెరపైకి వస్తోంది. పవన్, బాలకృష్ణ అగ్ర కథానాయక ులు. అయితే పండగకు ఎన్ని చిత్రాలైనా చూస్తారనే నమ్మకం ఉంది. తమిళనాడు అంతా 400 థియేటర్‌లు ఉంటే....రెండు తెలుగు రాష్ట్రాల్లో వెయ్యి థియేటర్‌లు ఉన్నాయి. యూవీ క్రియేషన్స్ వల్ల చాలా థియేటర్‌లు దొరికాయి.

☞ అగరం అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పేద విద్యార్థులను చదివిస్తున్నాను. పదేళ్ల కిందట ఈ స ంస్థను స్థాపించాను. ప్రస్తుతం మా సంస్థలో 2 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదు. అదొక పెద్ద ప్రక్రియ. రజినీ, కమల్ దశాబ్దాలుగా స్నేహితులు. సినిమా రంగంలో పోటీని చూశారు. అయినా క లిసే ఉన్నారు. వాళ్ల నుంచి ఈతరం నేర్చుకోవాలి. థియేటర్‌లకు సినిమాలు చూసే ందుకు వచ్చే ప్రేక్షకులు పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓట్‌లు వేయరని వాళ్లకూ తెలుసు. భవిష్యత్‌లో తమిళనాడు గొప్ప రాజకీయ వేత్తలను చూడబోతోంది.

☞ ప్రస్తుతం సెల్వ రాఘవన్, కేవీ గుహన్‌లతో సినిమాలు చేస్తున్నాను. విక్రమ్ కుమార్, హరి లాంటి దర్శకులతో పనిచేసే ఆలోచనలు ఉన్నాయి.

ఎవరితో పోటీ పడను


పోటీ ఎక్కడైనా ఉంటుంది. చిత్ర రంగంలో మరింత ఎక్కువగా ఉంటుంది. ఏమరపాటుగా ఉంటే దాని విలువ ఓ కెరీర్‌నే ప్రభావితం చేసేస్తుంది. ముఖ్యంగా నాయికల విషయంలో ప్రతి సినిమాకూ మార్పులు చూస్తుంటాం. ఇంత పోటీని పదమూడేళ్లుగా తట్టుకుంటూ అగ్ర నాయికగా కొనసాగుతోంది కాజల్ అగర్వాల్. అందాల జాబిలి ఇప్పటికీ తీరిక లేకుండా సినిమాలు చేస్తోంది. రాశీ ఖన్నా, నివేదా, రకుల్, లావణ్య త్రిపాఠీ, మెహరీన్ లాంటి తారలంతా కాజల్ చూస్తుండగా వచ్చిన వాళ్లే. పరిశ్రమలో ఇంత పోటీ నెలకొన్నా...తానెప్పుడూ దీని గురించి ఆలోచించలేదంటోంది కాజల్. ఈ అందాల భామ మాట్లాడుతూ...నేనెవరికీ పోటీ అనుకోను. ఎందుకంటే చిత్ర పరిశ్రమలో ప్రతి ఒక్కరికీ కావాల్సినన్ని అవకాశాలున్నాయి. ఇదో సముద్రం. ఇక్కడ ఎవరికైనా అవకాశాలు దొరుకుతాయి. నా కోసం పాత్రలు ఊహించుకునే దర్శకులు ఉన్నంత కాలం నేను అభద్రతా భావానికి ఎందుకు గురవ్వాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నన్ను నేను మెరుగుపర్చుకునేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాను. పాత్రకు తగిన భావోద్వేగాలు పలికించేందుకు ప్రయత్నిస్తాను. రకరకాల సినిమాలు చూస్తాను. మనుషులను కలుస్తాను. నటనలో, అందంలో కొత్తగా కనిపించాలని శ్రమిస్తుంటాను. అని చెప్పింది. ప్రస్తుతం కాజల్ తెలుగు తమిళంలో రెండేసి సినిమాల్లో నటిస్తోంది.





మహాభారతం కంటే బాహుబలి తీయడం మేలు

సినిమాల సృజనలో సెన్సార్ అభ్యంతరాల వివాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. బాలీవుడ్ తారలు సెన్సార్ తీరును తప్పుబడుతూ విమర్శలు చేస్తున్నారు. వీళ్లలో తాజాగా సైఫ్ అలీఖాన్ చేరారు. ఆయన నటించిన కలాకండ్ సినిమా సెన్సార్ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మాఫియా నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రంలో హింస, అభ్యంతరకమైన భాష ఎక్కువగా ఉందంటూ ధృవీకరణ ఇచ్చేందుకు సెన్సార్ బోర్డు విముఖతచూపింది. దీంతో చిత్ర యూనిట్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లింది. అక్కడ ఒకే ఒక్క కట్ తో ఏ సర్టిఫికెట్ జారీ చేసింది ట్రిబ్యునల్. ఈ సందర్భంగా సైఫ్ అలీఖాన్ మాట్లాడుతూ...సెన్సార్ బోర్డులో రాజకీయ ప్రభావం బాగా పెరిగింది. మతం, దేవుడు, సంస్కృతి లాంటి సున్నిత కథల్లో కొద్దిగా గీత దాటినా...ఆయా వర్గాలు భగ్గుమంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మహాభారతం కంటే బాహుబలి తెరకెక్కించడమే మంచిది. కలాకండ్‌లో మాఫియా నేపథ్యముంది. అయితే దానికి ఏ సర్టిఫికెట్ ఇవ్వొచ్చు. కానీ అసలు ధృవీకరణే ఇవ్వమంటూ సెన్సార్ చెప్పడం బాధాకరం. పాతికేళ్ల తన నట జీవితంలో సంతృప్తిగా ఉన్నానన్నారు. అన్నారు.



సీరత్ కపూర్, వీఐ ఆనంద్, అల్లు శిరీష్

నమ్మకాన్ని నిలబెట్టిన ఒక్క క్షణం...

అల్లు శిరీష్, సురభి, అవసరాల శ్రీనివాస్, సీరత్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఒక్క క్షణం. లక్ష్మీ నరసింహా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై చక్రి చిగురుపాటి ఈ సినిమాను నిర్మించారు. వీఐ ఆనంద్ దర్శక ుడు. డిసెంబర్ 28న ఒక్క క్షణం తెరపైకి వచ్చింది. థ్రిల్లర్ తరహాలో సాగే కథా కథనాలతో ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ విజయంలో భాగమైన వాళ్లందరికీ కృతజ్ఞతలు తెలిపింది. దర్శకులు వీఐ ఆనంద్ మాట్లాడుతూ....మా సినిమా విజయవంతంగా రెండో వారంలో ప్రదర్శితమవుతోంది. రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించిన నిర్మాతలకే ఈ విజయం దక్కుతుంది. ప్రేక్షకులకు కృతజ్ఞతలు. అన్నారు. నటుడు అల్లు శిరీష్ మాట్లాడుతూ...నా తొలి సినిమా గౌరవం అపజయం పాలవడంతో ఆలోచనలో పడ్డాను. ఏదైనా కొత్తగా ప్రయత్నించాలని అనుకున్నాను. కొత్త జంట, శ్రీరస్తు శుభమస్తు లాంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో నటించాను. అవి సాధించిన విజయాలు మళ్లీ నటుడిగా ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. వినూత్న చిత్రాలు చేస్తే విజయం దక్కుతుందనే ధైర్యం కలిగింది. ఆ ప్రయత్నంలోనే ఒక్క క్షణంలో నటించాను. ఈ రోజు నా నమ్మకం నిజమైంది. 2017 మాకు ఓ మర్చిపోలేని సంవత్సరంగా మిగిలింది. అన్నారు. ఈ కార్యక్రమంలో నాయిక సీరత్ కపూర్ పాల్గొన్నారు.



రకుల్ ప్రీత్‌సింగ్

బాలీవుడ్‌పై ఎన్ని ఆశలో...

సినీరంగంలో కెరీర్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎంత గుర్తింపు పొందిన తారలకైనా ఒక్కోసారి అవకాశాలు సన్నగిల్లుతుంటాయి. ప్రస్తుతం రకుల్‌ప్రీత్‌సింగ్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీలేదు. నిన్నా, మొన్నటివరకు తెలుగు సినీరంగంలో అగ్రశ్రేణి కథానాయికగా ఓ వెలుగువెలిగిన ఆమెకు ఇక్కడ అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. జయ జానకి నాయక, స్పైడర్ చిత్రాల తర్వాత ఆమె నూతన చిత్రాల కోసం ఎదురుచూస్తోంది. సాధారణంగా తారలు ఎక్కడ అవకాశాలొస్తే అక్కడ నటించేందుకు ప్రాధాన్యమిస్తుంటారు. అయితే ఇంతకాలం తెలుగులో బిజీగా ఉండటం వల్ల ఇతర భాషల సినీరంగాలపై అంతగా దృష్టి పెట్టని రకుల్ ఇప్పుడు తమిళ, హిందీ భాషల చిత్రాలు చేసేందుకు ఆసక్తిని కనబరుస్తోంది. ఇటీవల తమిళంలో రూపొంది, తెలుగులోకి కూడా అనువాదమైన ఖాకి చిత్రం రెండు చోట్ల చక్కటి ప్రేక్షకాదరణను అందుకుంది. దాంతో ఆమెకు తమిళంలో కూడా అవకాశాలు వస్తుండటంతో మరో ఆలోచన లేకుండా అక్కడి సినిమాలకు కూడా వెంటనే ఓకే చెప్పేస్తోంది. ఇక బాలీవుడ్‌లో మూడేళ్ల క్రితం యారియా అనే చిత్రంలో రకుల్ నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఆ చిత్రం తర్వాత ఆమె టాలీవుడ్‌కే ప్రాధాన్యమిచ్చారు. మళ్లీ ఇంతకాలం తర్వాత తాజాగా ఆమె నటిస్తున్న బాలీవుడ్ చిత్రం అయ్యారీ షూటింగ్ పూర్తికావచ్చింది. ఆర్మీ నేపథ్యంలో సాగే కథాంశంతో రూపొందిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌తో పాటు సిద్ధార్థ మల్హోత్రా, మనోజ్‌బాజ్‌పాయ్ తదితరులు ప్రధాన పాత్రధారులు. నీరజ్‌పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం కోసం కోయి కహానీ ఘరూ తో కర్...అంటూ సాగే పాటను రకుల్‌తో పాటు ఐదువేల మంది విద్యార్థులపై చిత్రీకరిస్తున్నారు. ఈ నెల 4న పిళ్లై కాలేజీలో ఈ పాట చిత్రీకరణ జరుగుతోంది. మిగిలిన కార్యక్రమాలను పూర్తిచేసి, ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ చిత్రంతో బాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు వస్తాయని రకుల్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. మరోవైపు ఈ చిత్రం ప్రమోషన్‌లో కూడా బిజీగా ఉన్న ఆమె హిందీలో సల్మాన్‌ఖాన్ వ్యాఖ్యాతగా రూపొందుతున్న బిగ్‌బాస్ గేమ్ షోలో కూడా పాల్గొనబోతోందట. అయ్యారీ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఈ గేమ్ షోలో ఆమె మెరవనుంది. ఇక తమిళంలో సూర్య 36 చిత్రంలో నటించేందుకు కూడా ఆమె రెడీ అవుతోందట. సంక్రాంతి తర్వాత ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానుందని అంటున్నారు. తెలుగు సినిమాల సంగతెలా వున్నా...విడుదల కాబోయే అయ్యారీ చిత్రం, నటించబోయే సూర్య చిత్రంతో ఎలాగైనా మళ్లీ వేగవంతం కావాలని ఆమె ఆశిస్తోంది.

మెగాస్టార్ ఆవిష్కరించనున్న జువ్వ ఫస్ట్‌లుక్



రంజిత్

రంజిత్, పాలక్‌లల్వాని హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం జువ్వ. త్రికోటి పేట (దిక్కులు చూడకు రామయ్య ఫేమ్) దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్.వి.రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్ పతాకంపై డా.భరత్ సోమి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయిన సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో కొన్ని సన్నివేశాలు, వైజాగ్‌లో ఒక పాట, కొన్ని సన్నివేశాలు, అలాగే మలేషియాలో రెండు పాటలు, బెంగళూరులో కారు ఛేజింగ్ సన్నివేశాలు చిత్రీకరించాం. త్వరలోనే మెగాస్టార్ చిరంజీవి చేతులమీదుగా ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్ విడుదల చేయనున్నాం. ఇదే నెల మూడోవారంలో ఆడియోను, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని చెప్పారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో పోసాని, అలీ, సప్తగిరి, మురళీశర్మ, రఘుబాబు, ప్రభాకర్, విజయ్‌చందర్, ఏడిద శ్రీరాం, సురేఖావాణి, దువ్వాసి, సన తదితరులు తారాగణం. ఈ చిత్రానికి మాటలు: ఎం.రత్నం, సాహిత్యం: అనంతశ్రీరామ్, సినిమాటోగ్రఫీ: సురేష్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఎడిటింగ్: కోటగిరి.



నిర్మాత బి.ఎ.రాజు జన్మదినోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో హీరో సూర్య పాల్గొని శుభాకాంక్షలను అందజేశారు.



మూడోరోజు ఆట వర్షార్పణం

క్రీడాప్రభ

- ఒక్క బంతీ పడకుండానే రద్దు
- నేడు ఆడేది 98 ఓవర్లు

కేప్‌టౌన్: భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్టుకు వరుణుడు అడ్డుపడ్డాడు. ఎడతెగని కురవడంతో మూడో రోజు ఆదివారం ఒక్క బంతి అయినా పడకుండానే ఆట రద్దయింది. సోమవారం షెడ్యూలు ప్రకారం ఆట ఆరంభమవుతుంది. ఆదివారం నష్టపోయిన ఓవర్లను భర్తీ చేయడం కోసం నాలుగో రోజు 98 ఓవర్లు ఆడించనున్నారు. ఆదివారం భారీ వర్ష సూచన ఉంది. అందుకు తగ్గట్టే తెల్లవారుఝామనే వరుణుడు పలకరించాడు. రోజంతా విరామం లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో షెడ్యూలు ప్రకారం ఆట ఆరంభం కాలేదు. రెండు సెషన్ల ఆట తుడిచిపెట్టుకుపోయింది. టీ విరామం అనంతరం ఆట రద్దు చేయాలని అంపైర్లు నిర్ణయించారు. న్యూలాండ్స్ మైదానం ఔట్‌ఫీల్డ్ చెరువును తలపించింది. వర్షం తెరిపివ్వకపోవడంతో సూపర్ సాపర్లు కూడా పని చేయలేదు. కాగా మ్యాచ్ రెండు జట్ల మధ్య ఊగిసలాడుతోంది. తొలి రోజు భువనేశ్వర్ కుమార్ (4-87) విజృంభణలో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు ఆలౌట్ కాగా... భారత్ 28 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. రెండో రోజు హార్దిక్ పాండ్య వీరోచిత ఇన్నింగ్స్ సాయంతో భారత్ 209 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికాకు 77 పరుగుల ఆధిక్యం దక్కింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా... పాండ్య ధాటికి రెండు వికెట్లు కోల్పోయి 65-2 స్కోరు వద్ద నిలిచింది. మొత్తంగా 142 పరుగుల ఆధిక్యం సంపాదించింది. 95 బంతుల్లో 93 పరుగులు చేసిన పాండ్య 17 పరుగులిచ్చి 2 వికెట్లు కూల్చాడు.

ఇంగ్లండ్ ఓటమా?.. డ్రానా?

- ఓటమి కోరల్లో ఇంగ్లిష్ జట్టు
- సిరీస్‌లో 4-0 ఆధిక్యం దిశగా ఆసీస్
- మార్ష్ సోదరుల సెంచరీలు



ఈ సారి యాషెస్‌లో ఆస్ట్రేలియా జట్టు సొంతగడ్డపై ఇంగ్లండ్‌ను 5-0తో క్లీన్‌స్వీప్ చేయలేకపోవచ్చు కాని... 4-0 ఆధిక్యం సాధించడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మార్ష్ సోదరులు సెంచరీలు సాధించడంతో 303 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన స్మిత్‌సేన... మ్యాచ్‌పై పూర్తిగా పట్టుబిగించేసింది. ఇంగ్లండ్ ఆదివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌లో 93 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఎదురీదుతోంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకోవాలంటే మరో 210 పరుగులు చేయాలి. ఓటమినే తప్పించుకోవాలంటే రోజంతా బ్యాటింగ్ చేయాలి. చివరి రోజు సోమవారం ఇంగ్లండ్ ఓటమి కోరల నుంచి బయటపడుతుందా? డ్రాతో గట్టెక్కి పరాభవం తప్పించుకొని ఆసీస్ ఆధిక్యాన్ని తగ్గిస్తుందా? చూడాల్సిందే!

సిడ్నీ: ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియోన్ (2-31) స్పిన్ మాయాజాలం చేయడంతో ఇంగ్లండ్ ఓటమి అంచుల్లో నిలిచింది. ఆదివారం ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో లియోన్ మాయకు 93 స్కోరుకే 4 వికెట్లు కోల్పోయి ఎదురీదుతోంది. సహనంతో ఆడుతున్న కెప్టెన్ రూట్ (42, 124 బంతుల్లో), కీపర్ బెయిర్‌స్టో (17 బ్యాటింగ్, 45 బంతుల్లో, 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఐదో వికెట్‌కు వీరిద్దరు అజేయంగా 25 పరుగులు జోడించారు. రూట్ ఇన్నింగ్స్‌లో ఒక్క బౌండరీ అయినా లేకపోవడం విశేషం. ఓపెనర్లు కుక్ (10), స్టోన్‌మన్ (0) నిరాశపరిచారు.

షాన్, మిచెల్ శతకాలు: అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 479-4తో ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్‌కు మార్ష్ సోదరులు సెంచరీలతో భారీ స్కోరు (649-7 డిక్లేర్డ్) అందించారు. షాన్ (156, 291 బంతుల్లో, 18 ఫోర్లు), మిచెల్ (101, 141 బంతుల్లో, 15 ఫోర్లు, 2 సిక్స్) ఇంగ్లండ్ బౌలర్లను ఓ ఆటాడు కున్నారు. ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటడంతో ఇంగ్లండ్ బౌలర్లకు తీవ్రంగా ఆపసోపాలు పడ్డారు. మార్ష్ సోదరులను ఓ పట్టాన ఔట్ చేయలేకపోయారు. షాన్, మిచెల్ కలిసి ఐదో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. గ్రెగ్, ఇయాన్ చాపెల్ సోదరులు.. స్టీవ్, మార్క్ వా సోదరుల తరువాత ఆసీస్ తరఫున ఒకే టెస్టులో సెంచరీలు సాధించిన సోదరులు షాన్, మిచెలే. సెంచరీ పూర్తయిన వెంటనే కర్రన్ బౌలింగ్‌లో మిచల్ బౌల్డయ్యాడు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన మూడో బ్యాట్స్‌మన్ మిచెల్. శనివారం ఖవాజా 171 పరుగులు సాధించాడు. లంచ్ విరామం అనంతరం షాన్ రనౌట్‌గా వెనుదిరిగాడు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 346
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 649-7 డిక్లేర్డ్
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: కుక్ (బి) లియోన్ 10, స్టోన్‌మన్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0, విన్స్ (సి) స్మిత్ (బి) కమిన్స్ 18, రూట్ బ్యాటింగ్ 42, మలన్ (ఎల్బీ) (బి) లియోన్ 5, బెయిర్‌స్టో బ్యాటింగ్ 17, ఎక్స్‌ట్రాలు 1, మొత్తం (46 ఓవర్లలో 4 వికెట్లకు) 93
వికెట్ల పతనం: 1-5, 2-15, 3-43, 4-68
బౌలింగ్: స్టార్క్ 9-2-17-1, హాజెల్‌వుడ్ 9-1-26-0, లియోన్ 19-6-31-2, కమిన్స్ 7-1-12-1, స్మిత్ 2-0-6-0.

సవాళ్లంటే సరదా...!

ఓ మారుమూల పల్లెటూరు కుర్రాడికి సవాళ్లంటే ఇష్టం! సవాళ్లను ఎదుర్కొని సత్తా చాటడం మరీ మక్కువ! ఎలాంటి కఠిన సవాలుకైనా భీతి చెందని లక్షణం అతనిది. ఒక్క మాటలో చెప్పాలంటే.. సవాళ్లతో దోస్తీ చేస్తాడు! అలాంటి నైజం ఉండబట్టే ప్రత్యర్థి క్రికెటర్లను భయపెట్టే దక్షిణాఫ్రికా పిచ్‌లపై వారి భీకర పేస్ బౌలర్లను నిర్భీతితో ఎదుర్కోగలిగాడు. స్టెయిన్ దళం కళ్లు బైర్లు కమ్మే బౌన్సర్లు వేసినా వెరవకుండా ఆడాడు. దెబ్బలు తిన్నాడు... కొన్ని బంతుల్ని ఎలా ఆడాలో తెలియక నిస్సహాయంగా నిలబడ్డాడు. అలా నిలబడ్డబట్టే మ్యాచ్‌లో భారత్ ఇంకా నిలిచింది. ఆ కుర్రాడే.. హార్దిక్ పాండ్య! హేమాహేమీ బ్యాట్స్‌మెన్ విఫలమైన చోట పాండ్య సుడిగాలి ఇన్నింగ్స్ ఆడాడు!



ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

"ఇంతకన్నా గొప్ప అవకాశం ఇంకేముంటుంది"... 2016 నవంబరులో ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టుల కోసం జాతీయ సెలక్షన్ కమిటీ తనను ఎంపిక చేసినపుడు పాండ్య స్పందన ఇది. ఈ వార్తతో... గుజరాత్‌లోని సూరత్ సమీపంలోని 'చొర్యాసి' అనే గ్రామంలో పుట్టిన హార్దిక్ ఆనందానికి అవధుల్లేవు. ఓ గ్రామం నుంచి వచ్చిన కుర్రాడు క్రికెటర్‌గా ఇంత స్థాయికి వస్తాడంటే చాలామందికి నమ్మకం ఉండదు. కానీ సవాళ్లను ఆనందంగా స్వీకరించే పాండ్య పట్టుదలను విడిచి పెట్టలేదు. "సవాళ్లను స్వీకరించడం నాకు ఎంతో ఇష్టం" అంటాడు పాండ్య. సమయం కోసం ఎదురు చూస్తున్న హార్దిక్‌కు ఆ క్షణం రానే వచ్చింది. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలో చోటు వెతుక్కుంటూ వచ్చింది. తర్వాత భారత జట్టులోనూ చోటు దక్కింది. గత ఏడాది ఆగస్టులో క్యాండి టెస్టులో సెంచరీతో తన ఆగమనాన్ని పాండ్య ఘనంగా చాటాడు. 96 బంతుల్లోనే 108 పరుగులు సాధించాడు. లంక బౌలర్లు దక్షిణాఫ్రికా పేసర్లు స్టెయిన్, మోర్కెల్, ఫిలాండర్, రబాడ అంతటి క్లాస్ కాకున్నా... టెస్టుల్లో పెద్దగా ఆడిన అనుభవం కాని.. కఠిన పరిస్థితులు ఎదుర్కొన్న సందర్భాలు కాని లేని 24 ఏళ్ల పాండ్య రెండో 50 పరుగుల్ని అతి తక్కువ బంతుల్లో పూర్తి చేయడం చెప్పుకోదగ్గ అంశం! ఒకే సెషన్లో సెంచరీ చేసిన రెండో భారత బ్యాట్స్‌మన్‌గా పాండ్య రికార్డులకెక్కాడు. ఆ తర్వాతా అనేక మెరుపులు మెరిపించాడు. జట్టులో అసలుసిసలు ఆల్‌రౌండర్‌గా... దిగ్గజం కపిల్‌దేవ్ వారసుడిగా అంచెలంచలుగా ఎదుగుతూ వచ్చాడు. కేప్‌టౌన్‌లో సుడిగాలి ఇన్నింగ్స్‌తో పాటు దక్షిణాఫ్రికా ఓపెనర్లను ఔట్ చేసి ఆల్‌రౌండ్ ప్రతిభను చాటి తానే కపిల్‌కు నిజమైన వారసుడినని చాటాడు. పాండ్య సెంచరీ చేజార్చుకున్నప్పటికీ దక్షిణాఫ్రికా ఆధిక్యాన్ని తగ్గించడంలో సాయపడ్డాడు.

నిప్పుతో చెలగాటమాడాడు

దక్షిణాఫ్రికా పేస్ దళాన్ని ఎదుర్కోవడమంటే నిప్పుతో చెలగాటమాడడమే. అదీ కేప్‌టౌన్‌లో... 140 కిలోమీటర్లకు పైగా వేగంతో నిప్పులు చెరిగే స్టెయిన్, ఫిలాండర్, రబాడ, మోర్కెల్‌ను ఎదిరించి నిలబడాలంటే ఎంతో సాహసం, తెగువ ఉండాలి. ఈ భయంకర పేసర్లను ఎదుర్కొన్నపుడు పాండ్యలో భయపడిన లక్షణాలు ఏ కోశాన కనిపించలేదు. మూడో స్లిప్ నుంచి తొలి బౌండరీ సాధించినపుడు పాండ్యలో ఏదో సాధించాలన్న తపన, పట్టుదల కనిపించాయి. అది పాండ్య రోజు. అందుకే సమీక్ష సైతం అతనికి అనుకూలంగా వచ్చింది. ఎల్గర్ క్యాచ్ జారవిడిచాడు. అందరి సందేహాలను పటాపంచలు చేస్తూ కేప్‌టౌన్‌లో హార్దిక్ టీమ్‌ఇండియాకు నిఖార్సయిన టెస్టు ఆల్‌రౌండర్‌గా నిరూపించుకున్నాడు. క్రికెట్ పరుషునిగా ఎదిగాడు. పాండ్య ఇన్నింగ్స్ భారత టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యుత్తమంగా నిలిచి పోతుంది. వెస్టిండీస్ భీకర పేసర్ ఆండీ రాబర్ట్స్ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నపుడు 1975లో మద్రాసులో గుండప్ప విశ్వనాథ్ అజేయంగా సాధించిన 97 పరుగుల ఇన్నింగ్స్‌కు పాండ్య ఇన్నింగ్స్ ఏ మాత్రం తీసిపోదు. ఎదురుదాడిలో విషీ ఇన్నింగ్స్ ఓ బెంచ్‌మార్క్. ప్రతి బౌన్సర్‌కు ఓ బౌండరీ సాధించాడు. పేసర్లకు నిలయమైన పాకిస్తాన్‌లో 1987లో లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్ ఆడి 96 పరుగులు సాధించినా... కాండీలో 2001లో లంకపై గంగూలీ అజేయంగా 98 పరుగులు చేసినా... ఇవన్నీ అప్పటికే తమను తాము నిరూపించుకున్న బ్యాట్స్‌మెన్ సాధించిన ఘనతలు. దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో.. పేస్‌కు అనుకూలించిన పిచ్‌పై.... ఏకంగా నలుగురు పేస్ బౌలర్ల భీకరంగా సంధించే బంతులను ఎదుర్కొని ఈ యువ ఆల్‌రౌండర్ ఆడిన ఇన్నింగ్స్ కూడా ఆ దిగ్గజాల ఇన్నింగ్స్ సరసన చేరుతుంది. పాండ్య నిప్పుతో చెలగాటమాడాడు... బౌలర్లతో పోరాడాడు. సర్రున దూసుకువచ్చే బంతుల్ని తనదైన శైలిలో ఆడి స్క్వేయిర్, మిడ్ వికెట్, కవర్ ప్రాంతంలో అలవోకగా బౌండరీలు సాధించాడు. ఖచ్చితమైన టైమింగ్‌తో షాట్లు కొట్టాడు. బంతిని స్వీప్ చేయడంలో శక్తిని ప్రదర్శించాడు. పాండ్య 20 పరుగులు దాటిన అనంతరం విశ్వాసంతో ఆడాడు. నలుగురు మేటి పేస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఫిలాండర్ బౌలింగ్‌లో తనకే సాధ్యమన్నట్లు బంతిని మిడాఫ్ మీదుగా కళ్లు చెదిరే లాఫ్టెట్ షాట్‌తో బౌండరీకి తరలించాడు. అదే ప్రాంతం నుంచి మోర్కెల్ బంతిని నమ్మశక్యం కాని విధంగా బౌండరీ దాటించాడు. నిప్పులు చిమ్మే పేస్ బౌలింగ్లో బుక్ షాట్లు ఆడే టెక్నిక్ పాండ్యలో లేకపోవచ్చు. సరైన దృక్పథం, ఎలాంటి బంతినైనా ఊచకోయాలన్న సంకల్పం అతని సొంతం.

చదివింది తొమ్మిదే..

చాలామందికి హార్దిక్ పాండ్య ఎంతవరకు చదివాడో తెలియదు. అతను కనీసం డిగ్రీ అయినా పూర్తి చేసి వుంటాడనుకుంటారేమో! పాండ్య 9వ తరగతిని మధ్యలోనే ఆపేశాడు. "నాకు 9వ తరగతిలో పీహెచ్‌డీ ఉంది" అని పాండ్య చలోక్తిగా అంటాడు. చదువుకు దూరమైన పాండ్య జీవితంలో నిలదొక్కుకోవడానికి అతని సోదరుడు క్రునాల్, కోచ్ జితుభాయ్ ఎంతో సాయం చేశారు. లంకతో స్వదేశంలో సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న పాండ్య... తాను దక్షిణాఫ్రికా సిరీస్ కల్లా 'తాజా'గా ఉండాలని కోరుకున్నాడు. "మీరు భిన్నమైన పాండ్యను చూస్తారు" అనేవాడు. ఆ తాజాతనాన్ని భారత క్రికెట్ అభిమానులు శనివారం కేప్‌టౌన్లో చూశారు మరి!.

కోహ్లీసేన గెలుస్తుందట!

- జోతిష్కుడు నరేంద్ర బుందే అంచనా



న్యూఢిల్లీ: కోహ్లీసేన విదేశాల్లో విజయాలను సాధించే సమయం ఆసన్నమైందని నాగ్‌పూర్‌కు చెందిన క్రికెట్ జోతిష్కుడు నరేంద్ర బుందే అంటున్నాడు. ధోని, సచిన్ విషయంలో తాను చెప్పిన జోస్యాలు నిజమయ్యాయని... ఈ జోస్యం కూడా నిజమవుతుందని అంటున్నాడు. భారత క్రీడా చరిత్రలోనే కనీవినీ ఎరుగని వాణిజ్య ఒప్పందంపై విరాట్ సంతకాలు చేస్తాడని కూడా బుందే విశ్వాసం వ్యక్తం చేశాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో ధోని భవిష్యత్తు గురించి సందేహాలు తలెత్తినపుడు.. అతను 2019 ప్రపంచకప్‌లో ఆడతాడని కొన్ని మాసాల క్రితం చెప్పానని అన్నాడు. టెన్నిస్ ఎల్బో గాయం నుంచి కోలుకొని సచిన్ తిరిగి ఆడి భారతరత్న అందుకుంటాడని చెప్పానని పేర్కొన్నాడు. గంగూలీ తిరిగి జట్టులోకి వస్తాడని... భారత్ 2011లో ప్రపంచకప్ గెలుస్తుందని కూడా జోస్యం చెప్పానని బుందే వెల్లడించాడు. "సచిన్.. మాస్కరెన్హాస్‌తో మాదిరి కోహ్లీ కూడా భారీ ఒప్పందంపై సంతకాలు చేస్తాడు. ఆ ఒప్పందం దాని కంటే భారీగా ఉంటుంది. ప్రస్తుతం కోహ్లీ శుక్ర దశ గొప్పగా ఉంది. అందుకే విదేశాల్లో అతను గొప్పగా రాణిస్తాడు" అని బుందే అన్నాడు.

ప్రపంచకప్‌కు సిద్ధం: షా

క్రైస్ట్‌చర్చ్: అండర్ 19 క్రికెట్ ప్రపంచకప్‌కు సిద్ధంగా ఉన్నామని భారత యువ జట్టు కెప్టెన్ పృథ్వీ షా అన్నాడు. కోచ్ రాహుల్ ద్రవిడ్ మార్గదర్శకత్వంలో జట్టు లక్ష్యాన్ని అందుకుంటుందని, ట్రోఫీతో తిరిగి స్వదేశం వస్తామని నమ్మకంగా చెప్పాడు. "వారం రోజుల క్రితం ఇక్కడకు వచ్చాం. రెండు మ్యాచ్‌లు ఆడాం. మెరుగ్గా సమాయత్త మయ్యాం. ట్రోఫీతో తిరిగి వస్తాం" అని షా చెప్పాడు. సోమవారం ఇక్కడి ఓవల్ మైదానంలో వార్మప్ మ్యాచ్‌లు ఆరంభం కానున్నాయి. 13న భారత్ తన తొలి పోరులో ఆసీస్‌ను ఢీకొంటుంది.




రోడ్డు ప్రమాదంలో.. నలుగురు పవర్‌లిఫ్టర్ల మృతి

- ప్రపంచ చాంప్ సాక్షమ్ యాదవ్‌కు తీవ్ర గాయాలు

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో నలుగురు పవర్‌లిఫ్టర్లు దుర్మరణం పాలయ్యారు. ప్రపంచ చాంపియన్ సాక్షమ్ యాదవ్, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఔటర్ ఢిల్లీ అలీపూర్ ప్రాంతంలోని సింఘు సరిహద్దు సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తెల్లవారుఝామున పవర్‌లిఫ్టర్లు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురి కావడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. యాదవ్‌ను, అతని సహచరుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఉదయం 4 గంటల సమయంలో ప్రమాదం గురించి తమకు సమాచారం అందిందని పోలీసులు చెప్పారు. మృతి చెందిన వారిని హరీష్, టింకు, సూరజ్‌గా గుర్తించామని... నాలుగో వ్యక్తి గుర్తు తెలియలేదని తెలిపారు. యాదవ్ సహచరుడు బాలి కూడా తీవ్ర గాయాలతో బతికి బయటపడ్డాడన్నారు. లిఫ్టర్లు పానిపట్‌లో జరిగిన అథ్లెట్ మీట్‌లో పాల్గొని తిరిగి వస్తుండగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ సంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ మరో వాహనాన్ని తప్పించడానికి ప్రయత్నించినపుడు లిఫ్టర్ల కారు రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొని తిరగబడిందని చెప్పారు. కారు నుజ్జునుజ్జయిందన్నారు. వాహనం అనేకసార్లు పల్టీ కొట్టిందని ప్రత్యక్షసాక్షుల కథనం.



సాక్షమ్ యాదవ్



బ్రిస్బేన్ టైటిల్ కిర్గియోస్‌దే

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా ఆటగాడు నిక్ కిర్గియోస్ సొంతగడ్డపై తొలి టూర్ టైటిల్ గెలుచుకున్నాడు. అతను బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టైటిల్‌ను వశం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో 6-4, 6-2తో ర్యాన్ హారిసన్ (అమెరికా)ను ఓడించాడు. ఈనెల 15న ఆరంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌కు ముందు ఈ విజయం కిర్గియోస్ విశ్వాసాన్ని పెంచేదే. మోకాలి గాయంతో బాధపడుతున్న అతను ఆరంభంలో తడబడ్డాడు. ఐదు బ్రేక్ పాయింట్లు కాచుకున్నాడు. ఏడో గేమ్‌లో బ్రేక్ పాయింట్ సంపాదించాడు. తొలి సెట్‌ను గెలుచుకున్న కిర్గియోస్ ఆ తర్వాత తిరిగి చూడలేదు. రెండో సెట్‌ను సునాయాసంగా నెగ్గాడు.

స్టెయిన్‌కు గాయం... సిరీస్‌కు దూరం



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా జట్టుకు ఊహించని దెబ్బ. ఏస్ పేస్ బౌలర్ డేల్‌స్టెయిన్‌ను గాయాలు విడిచి పెట్టడం లేదు. తాజాగా ఎడమకాలి మడమ గాయంతో భారత్‌తో తక్కిన రెండు టెస్టులకు దూరమయ్యాడు. తొలి టెస్టులో రెండో రోజు ఎడమ మడమకు తగిలిన గాయం మానడానికి స్టెయిన్ కనీసం 4 నుంచి 6 వారాలు విశ్రాంతితీసుకోవాలి. దీంతో అతను తక్కిన రెండు టెస్టులకు దూరమయ్యాడు. భారత్ తొలి ఇన్నింగ్స్ 18వ ఓవర్లో గాయం బాధతో మైదానాన్ని వీడాడు. అతనికి తగిలిన గాయం తీవ్రమైందని తెలుస్తోంది. ప్రస్తుత టెస్టులో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో స్టెయిన్ బౌలింగ్ చేయబోడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.